www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మందుబాబులోయ్!
రాష్ట్రంలో మందు తాగేవాళ్లంతా మగవాళ్లే

మహిళల్లో ఈ సంస్కృతి చాలా తక్కువ
పురుషులు 31.2%.. మహిళలు 0.2%
జాతీయ కుటుంబ వైద్య సర్వేలో వెల్లడి
మొత్తం కోటిన్నరమందికి పైగా అలవాటు
వారిలో రోజూ తాగేవారు 50 లక్షల మంది

సగటున నెలకు 10 క్వార్టర్లు తాగుతున్నారు
ఈశాన్య రాష్ట్రాల్లో పోటీపడుతున్న మహిళలు

13




శనివారం | 9-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 154 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి మ.1:25 తదుపరి పాడ్యమి, నక్షత్రం: శ్రవణం మ.2:24 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: సా.6:18-7:52, దుర్ముహూర్తం: ఉ.6:00-7:41, అమృతఘడియలు: తె. 3:42-5:16, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:00, సూర్యాస్తమయం: 6:40 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పార్టీ అధ్యక్షా.. పదవులెక్కడ?

అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కొలిక్కిరాని నామినేటెడ్ భర్తీ

సంస్థాగత పదవుల్లోనూ అదే జాప్యం



పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోతున్నా ఇప్పటికీ ప్రధాన కార్పొరేషన్లు, అధిక శాతం దేవాలయ కమిటీలను నియమించుకోలేకపోవడంపై టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అధిష్ఠానం పెట్టిన నిబంధనలు, పార్టీకోసం పనిచేసిన వారిని కాదని తమకు నచ్చిన వారిపై ఎమ్మెల్యేలు మొగ్గు చూపడం, పేర్లపై తెగని పంచాయితీలు... ఇలా పలు కారణాలతో సంస్థాగత పదవుల భర్తీ కూడా కొలిక్కి రావడంలేదు.

నామినేటెడ్‌కు పేర్లు ఇవ్వని ఎమ్మెల్యేలు
ఐవీఆర్ఎస్‌కే ప్రాధాన్యంపై కినుక
పార్టీ పదవుల భర్తీలో అనేక సమస్యలు
ఎన్నికల కమిటీ వేసినా ఫలితం శూన్యం
పాలనలో చంద్రబాబు, లోకేశ్ బిజీ
కార్యాలయానికి సీనియర్లు దూరం
సమన్వయ భారమంతా పల్లాపైనే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'జగన్ జమానాలో ఐదేళ్లూ అష్టకష్టాలు పడ్డాం! ఇప్పుడు అధికారంలోకి వచ్చాం! ఏదో ఒక పదవి దక్కకపోతుందా?' అని ఎదురు చూస్తున్న టీడీపీ కిందిస్థాయి నేతలకు నిరాశే మిగులుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా... నామినేటెడ్ పదవుల భర్తీ కొలిక్కిరాలేదు. ఇక... సంస్థాగత పదవుల పైనా కసరత్తు పూర్తి కాలేదు. ఈ పరిస్థితి టీడీపీ శ్రేణుల్లో ఒక రకమైన నిరాశకు, అసంతృప్తికి దారి తీస్తోంది. అధికారం చేతిలో ఉండీ, నామినేటెడ్ పదవులు ఇచ్చే అవకాశమూ ఉండీ... ఎందుకీ తాత్సారం? అనే ప్రశ్నకు భిన్న సమాధానాలు

మిగతా 13వ పేజీలో...



కలిసి తిరిగినవాడే చంపించాడంటే నమ్మలేకపోయా

అవినాశ్‌రెడ్డిని మంచి లీడర్‌గా చేయాలని వివేకా అనేవారు
అలాంటి వ్యక్తే నాన్నను హత్య చేయించడం దారుణం
నాన్న అంతిమ యాత్ర చేద్దామంటే జగనన్న వద్దన్నారు
నిన్న కార్యకర్తకు చిన్న దెబ్బ తగిలిందని పులివెందులలో పెద్ద ర్యాలీ చేశారు
వివేకా కుమార్తె సునీత ఆవేదన

పులివెందుల/పులివెందుల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి (నాన్న) జయంతి రోజు ఆయన జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి అన్నారు. 'ఎప్పుడూ మాతోనే తిరుగుతున్న వ్యక్తి (వైఎస్ అవినాశ్‌రెడ్డి).. నాన్నను హత్య చేయించాడంటే నమ్మలేకపోయా'నని చెప్పారు. శుక్రవారం వివేకా 74వ జయంతి సందర్భంగా పులివెందులలోని ఇంటి వద్ద ఉన్న తండ్రి విగ్రహానికి

మిగతా 14వ పేజీలో...

అమెరికా ఆయుధాల కొనుగోళ్లు

నిలిపివేత!



ట్రంప్ సుంకాలకు నిరసనగా కాన్పూర్‌లో ప్లకార్డులను తగులబెడుతున్న వస్త్ర వ్యాపారులు

సుంకాల నేపథ్యంలో భారత్ యోచన

తుది దశలో ఉన్న ఒప్పందాలపైనా చర్చలు ఆపేయాలని నిర్ణయం
అందుకే రాజ్‌నాథ్ పర్యటన రద్దు
రాయిటర్స్ కథనం
కొనుగోళ్ల నిలిపివేత అవాస్తవమన్న రక్షణ శాఖ వర్గాలు

2

భారత్‌తో వాణిజ్య చర్చలుండవు!

టారిఫ్‌ల వ్యవహారం తేలేవరకు ఇదే పరిస్థితి అన్న ట్రంప్
రష్యా చమురు కొనకుండా ఆపేలా తీవ్ర ఒత్తిడికి యత్నం
మాంద్యం పొంచి ఉంది.. సుంకాల అంశంలో జోక్యం వద్దు
కోర్టులకు ట్రంప్ హెచ్చరిక.. పుతిన్-మోదీ ఫోన్ చర్చలు
ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో చెబుతా: నెతన్యాహూ

రష్యా ఆయిల్ కొనుగోళ్లను ఆపేస్తే చమురు దిగుమతులు భారమే!

ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ బిల్లు 900 కోట్ల డాలర్లు
వచ్చే ఏడాది 1,200 కోట్ల డాలర్లు.. ఎస్‌బీఐ నివేదిక



బెంగళూరులో జరిగిన ర్యాలీలో ఖర్గే, రాహుల్, సిద్దరామయ్య, శివకుమార్, వేణుగోపాల్

అధికారంలోకి వచ్చాక మిమ్మల్ని వదలం

ఓటర్ల జాబితాల్లో మోసాలెందుకు?
జవాబివ్వకుండా మాకు బెదిరింపులా?
బీజేపీ ఏజెంటులా ఎందుకు పనిచేస్తున్నారు?
ఎన్నికల అధికారులపై రాహుల్ గాంధీ ఆగ్రహం
బెంగళూరులో 'ఓటు అధికార ర్యాలీ'

ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమం

జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' స్థాయిలో నిర్మాణానికి 'ఇండియా' యోచన
దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్
బీజేపీకి నష్టమే అంటున్న రాజకీయ వర్గాలు
ఓటరుకార్డు-ఆధార్ అనుసంధానంతో బోగస్ ఓట్లకు చెక్ పడుతుంది: ఈసీ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయిందన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం, దాని పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితా ఆధారంగా ఆయన ఇచ్చిన 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్‌కు మంచి స్పందన వచ్చిందని ఇండి కూటమి భావిస్తోంది. దీనిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీని ఎండగట్టేందుకు సిద్ధమైంది. గతంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ నిర్మించిన 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమం తరహాలో... దేశవ్యాప్తంగా ప్రజా ఆందోళనను లేవనెత్తాలని ఇండి కూటమి నేతలు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కలసికట్టుగా ముందుకు వెళ్లాలని, ఎన్నికలు

మిగతా 2వ పేజీలో...

'మాస్టర్ ప్లాన్'

మాయ!

విశాఖ కొండల్ని కొల్లగొట్టేందుకు నాడు వైసీపీ ఎత్తు

దానికోసం మిక్స్‌డ్ జోన్‌లోకి మార్చి విధ్వంసం

రామానాయుడు స్టూడియోలోనూ లేఅవుట్
సుప్రీంకోర్టు అభ్యంతరంతో ఆగిన పనులు
రుషికొండకూ పర్యాటకం పేరుతో టెండర్

తిరిగి 'నో డెవలప్‌మెంట్ జోన్'లోకి తేవాలి
కూటమి సర్కారుకు పర్యావరణవేత్తల వినతి

విశాఖపట్నం నుంచి భీమిలి వరకూ తీరం వెంబడి ఉన్న కొండల్ని కొల్లగొట్టేందుకు గత వైసీపీ ప్రభుత్వం 'మాస్టర్ ప్లాన్' వేసింది. ఇప్పుడు అదే ప్లాన్‌ను కొనసాగిస్తే కొండలన్నీ కాంక్రీట్ నిర్మాణాలతో నిండిపోయే ప్రమాదం ఉంది. వైసీపీ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో సవరణల నిమిత్తం కూటమి ప్రభుత్వం అభ్యంతరాలను స్వీకరించింది. ప్రస్తుతం వాటిని పరిశీలిస్తోంది. ఇప్పుడైనా గత ప్రభుత్వ నిర్ణయాలను మార్చి విశాఖ కొండలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

13

వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు!

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆదేశాల ఉపసంహరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిని క్రిమినల్ కేసుల విచారణ చేపట్టకుండా నిషేధించాలని ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. గత తీర్పులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మీద చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు పేర్కొంది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో ముగిస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ నెల 4న వివాదాస్పద తీర్పును వెలువరించింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌ను

మిగతా 2వ పేజీలో...

'వాతావరణ' గందరగోళం!

వర్షాలపై చెప్పేదొకటి.. జరిగేది మరొకటి



తప్పుతున్న వాతావరణ శాఖ అంచనాలు
వాతావరణంలో అనూహ్య మార్పులే కారణం!
రాష్ట్రంలో వింత పరిస్థితి.. ప్రజల్లో అయోమయం

ఆగస్టు 4న రాయలసీమలో అనేకచోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఆ 2 ప్రాంతాల్లో ఒకటి, రెండు చోట్ల భారీవర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. తీరాచూస్తే.. రాయలసీమ, కోస్తాల్లో తక్కువ చోట్ల మాత్రమే వర్షాలు కురిశాయి.

ఆగస్టు 5న కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, సీమలో భారీ నుంచి అతిభారీ, ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కోస్తాలో 10-20 చోట్ల మాత్రమే వర్షాలు కురిశాయి.

(విశాఖపట్నం ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వర్షాలపై భారత వాతావరణ శాఖ ముందస్తుగా ప్రకటిస్తున్న అంచనాలు తప్పుతున్నాయి. లేదా కొంత మేర మాత్రమే వాస్తవికతకు దగ్గరగా ఉంటున్నాయి తప్ప బులెటిన్లలో

మిగతా 12వ పేజీలో...

రసాయన ఎరువులకు

నానో తోడు!



పోషకాలు ఎక్కువ.. పర్యావరణానికి మేలు
రసాయన యూరియాతో నష్టాలే ఎక్కువ
అధిక వాడకంతో మరిన్ని అనర్థాలు
నానో యూరియాలో 80-90% పోషకాలు
రసాయన యూరియాలో 30-40 శాతమే
రసాయన యూరియా 75%, నానో 25% వాడుకోవడం మేలు
పంట ప్రాథమిక దశలో నానో వద్దు
ఆఖరి దశలో వాడితే ప్రయోజనం
వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో యూరియాకు అధిక డిమాండ్ ఉంది. ఈ సమస్య పరిష్కారానికి నానో యూరియా వాడటం మంచిదని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే పంటల ప్రాథమిక దశలో 75 శాతం వరకూ రసాయన యూరియా వాడుకోవచ్చని, చివరి దశలో 25 శాతం వరకూ నానో యూరియా వాడుకోవాలని సలహా ఇస్తున్నారు. కాగా, పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. అందుకే రసాయన యూరియానే కావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే పంట ఆరోగ్యం, నాణ్యమైన ఉత్పత్తికి పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన

మిగతా 12వ పేజీలో...





రష్యా ఆయిల్ కొనుగోళ్లను ఆపేస్తే

చమురు దిగుమతులు భారమే!

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రష్యా నుంచి భారత్ భారీగా ముడిచమురును కొనుగోలు చేస్తుండటం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ నుంచి తమ దేశానికి వచ్చే ఉత్పత్తులపై సుంకాల మోత మోగిస్తున్నారు. అయినా భారత్ మాత్రం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్న సంకేతాలు ఇస్తోంది. అయితే అమెరికా సుంకాలను క్రమంగా పెంచుతున్న తరుణంలో రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేస్తే ఏమవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. మన దేశానికి రష్యా డిస్కౌంట్ ధరలకు ముడిచమురును విక్రయిస్తోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసినట్టయితే దేశ చమురు దిగుమతి బిల్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మిగిలిన కాలానికి దాదాపు 900 కోట్ల డాలర్లు (దాదాపు రూ.78,822 కోట్లు) పెరగడానికి అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది. ఈ బిల్లు 2026-27 సంవత్సరంలో 1,200 కోట్ల డాలర్ల వరకు కూడా పెరగవచ్చని చెబుతోంది. ఇది భారత్‌కు పెనుభారంగానే చెప్పవచ్చు. రష్యా ఆయిల్ లేనిపక్షంలో భారత్ ఇంధన కొనుగోళ్లు మరింత ఖరీదుగా మారే అవకాశం ఉందని నివేదిక చెబుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఆ దేశంపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దీని తర్వాత 2022 నుంచి రష్యా చవకగా ముడిచమురును ఆఫర్ చేయడంతో భారత్ తన అవసరాల కోసం దానిని కొనుగోలు చేస్తోంది. బ్యారల్ రష్యన్ ఆయిల్ ధరను 60 డాలర్లకు పరిమితం చేయడం, తక్కువ ధరకు విక్రయించడం వల్ల భారత్ తన ఇంధన బిల్లును భారీగా ఆదా చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రధాన ఆయిల్ సరఫరాదారుగా రష్యా మారింది. 2019-2020 ఆర్థిక సంవత్సరంలో భారత్ ముడిచమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండగా.. 2024-25 సంవత్సరంలో ఏకంగా 35.1శాతానికి ఎగబాకింది. పరిమాణం పరంగా చూస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 245 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) ముడిచమురును దిగుమతి చేసుకోగా.. ఇందులో 88 ఎంఎంటీ ముడిచమురు ఒక్క రష్యా నుంచే రావడం గమనార్హం. కానీ పెరుగుతున్న ముడిచమురు ధరల కారణంగా భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రష్యా నుంచి కొనుగోళ్లను నిలిపివేసినట్టయితే దేశ ముడిచమురు దిగుమతి బిల్లు 900 కోట్ల డాలర్లు, వచ్చే సంవత్సరంలో దాదాపు 1170 కోట్ల డాలర్లు పెరగవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది.



ధరలు ఎందుకు పెరుగుతాయంటే?

ప్రపంచ ముడిచమురు సరఫరాలో రష్యా వాటా ప్రస్తుతం 10 శాతంగా ఉంది. రష్యా నుంచి పలు దేశాలు ఒక్కసారిగా చమురు కొనుగోళ్లను నిలిపివేసి.. ఇతర దేశాలు తమ ఉత్పత్తిని పెంచని పక్షంలో ముడిచమురు ధరలు దాదాపు 10 శాతం పెరగవచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది. పెరిగే ధరల వల్ల ఒక్క భారత్‌పైనే కాకుండా ప్రతి ఒక్క దేశంపైనా ప్రభావం పడటానికి అవకాశం ఉందంటున్నారు.

భారత్ ఏం చేయవచ్చంటే?

ఇంధన అవసరాల కోసం భారత్ 85% దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ సహా దాదాపు 40 దేశాల నుంచి ముడిచమురును సమకూర్చుకుంటోంది. గయానా, బ్రెజిల్, కెనడా వంటి దేశాలు కొత్తగా చేరడంతో భారత్ ఇంధన భద్రత మరింత మెరుగుపడింది. రష్యా ఆయిల్ లేకున్నా భారత్ ఇతర దేశాలతో ఉన్న సంబంధాలతో తన డిమాండ్‌కు సరిపడా ముడిచమురును సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే దేశ దిగుమతుల వ్యయాలు పెరగడానికి ఆస్కారం ఉంటుంది.

అమెరికా ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేత!


- సుంకాల నేపథ్యంలో భారత్ యోచన
- తుది దశలో ఉన్న ఒప్పందాలపైనా చర్చలు ఆపేయాలని నిర్ణయం
- అందుకే రాజ్‌నాథ్ పర్యటన రద్దు
- రాయిటర్స్ కథనం
- కొనుగోళ్ల నిలిపివేత అవాస్తవమన్న రక్షణ శాఖ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అమెరికా అడ్డగోలుగా సుంకాలు విధించడంపై భారత్ ఆగ్రహంగా ఉందా? అమెరికా నుంచి రక్షణ రంగ ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేయాలని భావిస్తోందా? అందుకే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తలపెట్టిన అమెరికా పర్యటన రద్దయిందా?.. ముగ్గురు కీలక అధికారులను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా సంస్థ రాయిటర్స్ ప్రచురించిన కథనం ఈ ప్రశ్నలకు అవుననే జవాబు చెబుతోంది. దాని ప్రకారం.. అమెరికా నుంచి స్ట్రైకర్ కాంబాట్ వెహికల్స్, ట్యాంక్ విధ్వంసక జావెలిన్ క్షిపణులు, నౌకాదళం కోసం ఆరు బోయింగ్ పీ8ఐ విమానాలు, ఇతర రక్షణ సామగ్రి కొనుగోలుకు భారత్ చర్చలు జరుపుతోందని ఇద్దరు కీలక అధికారులు తెలిపారు. ఈ కొనుగోళ్లను అధికారికంగా ఖరారు చేసి, ప్రకటించేందుకు రాజ్‌నాథ్ త్వరలో వాషింగ్టన్‌లో పర్యటించాల్సి ఉందన్నారు. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ కొనుగోళ్లను ప్రస్తుతానికి నిలిపివేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు మరో ఉన్నతాధికారి తెలిపారు. సుంకాలను ట్రంప్ ఏ క్షణమైనా వెనక్కి తీసుకోవచ్చని.. రక్షణ కొనుగోళ్లపై యథాతథంగా ముందుకెళ్లవచ్చని వెల్లడించారు. అమెరికా నుంచి ఆయుధ, రక్షణ కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్ భావిస్తోందన్నది తప్పుడు ప్రచారమని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు సరికాదని పేర్కొన్నాయి. యూఎస్‌ఏ నుంచి వివిధ రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపాయి.

భారత్ ఎవరికీ తలవంచదు: పీయూష్ గోయల్

వాణిజ్య అంశాలపై ఎవరి ఒత్తిడులకూ భారత్ తలవంచదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. భారత్ ఇప్పుడు బలమైన దేశమని, ఏటా 6.5శాతానికిపైగా వృద్ధి రేటుతో దూసుకుపోతోందన్నారు. శుక్రవారం బిజినెస్ టుడే ఇండియా సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ఆర్థిక మూలాలు, కరెన్సీ, డాలర్ నిల్వలు, స్టాక్ మార్కెట్లు బలంగా ఉన్నాయని చెప్పారు. మొత్తం ప్రపంచ వృద్ధిలో భారత్ ఒక్కదానికే 16శాతం భాగస్వామ్యం ఉందన్నారు. యూఏఈ, మారిషస్, ఆస్ట్రేలియా, చిలీ, పెరూ, న్యూజిలాండ్, అమెరికా.. ఇలా చాలా దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నామని తెలిపారు.

లోకం తీరు



ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా: నెతన్యాహూ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో భారత ప్రధాని మోదీకి చెబుతానని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ పేర్కొన్నారు. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించడంపై స్పందిస్తూ.. "ఈ విషయంలో భారత్, యూఎస్ ఒక అవగాహనకు రావాలి. మోదీ, ట్రంప్ ఇద్దరూ నాకు మంచి మిత్రులు. ట్రంప్‌తో ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా. కాకపోతే వ్యక్తిగతంగా కలిసినపుడు.." అని నెతన్యాహూ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఇజ్రాయెల్ ఆయుధాలను భారత్ ప్రయోగించిందని.. అవన్నీ చాలా బాగా పనిచేశాయని పేర్కొన్నారు. భారత్‌కు గగనతల నిఘా వ్యవస్థలు అందించేందుకు సిద్ధమని తెలిపారు.

మోదీ పర్యటనను స్వాగతించిన చైనా

బీజింగ్, ఆగస్టు 8: భారత ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చేపట్టనున్న చైనా పర్యటనను ఆ దేశం స్వాగతించింది. టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఏడేళ్ల విరామం అనంతరం ఆయన చైనా పర్యటనకు వెళ్లనుండడం విశేషం. ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తున్నట్టు శుక్రవారం చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు.

భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవు!

టారిఫ్‌ల వ్యవహారం తేలేవరకు ఇదే పరిస్థితి అన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

- రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసేలా మరింత ఒత్తిడికి యత్నం
- భారీ ఆర్థిక మాంద్యం పొంచి ఉంది.. సుంకాల అంశంలో జోక్యం వద్దు..
- అమెరికా కోర్టులకు ట్రంప్ హెచ్చరిక

న్యూయార్క్/వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఆగస్టు 8: రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా భారత్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వాణిజ్య ఒప్పందం దిశగా జరుగుతున్న చర్చలనూ మధ్యలోకి తెచ్చారు. వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌తో వాణిజ్య చర్చల అంశాన్ని ప్రస్తావించగా... "టారిఫ్‌ల అంశం తేలేదాకా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ఉండవు" అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపేయాలని ఎంత ఒత్తిడి తెస్తున్నా.. భారత్ వెనక్కి తగ్గకపోవడంపై ట్రంప్ ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అన్ని దేశాలకన్నా అధికంగా భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు. భారత్‌ను ముందుపెట్టి రష్యాపై ఒత్తిడి తేవాలని ప్రయత్నిస్తున్నారు.

ఆర్థిక మాంద్యం పొంచి ఉంది.. జోక్యం వద్దు..

అంతటా భారీ ఆర్థిక మాంద్యం పొంచి ఉందని.. వాణిజ్య సుంకాల అంశంలో జోక్యం చేసుకుని అమెరికా ఆదాయానికి గండికొట్టవద్దని అమెరికా కోర్టులను ట్రంప్ హెచ్చరించారు. దీనిపై తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. "వివిధ దేశాలపై సుంకాలతో అమెరికా ఖజానాకు వేల కోట్ల డాలర్లు సమకూరుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోంది. మరోవైపు అంతటా 1929 నాటి తరహాలో భారీ ఆర్థిక మాంద్యం పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సుంకాలను అడ్డుకునేలా కోర్టులు జోక్యం చేసుకుంటే.. అమెరికా తిరిగి కోలుకోవడం చాలా కష్టం" అని పేర్కొన్నారు. వివిధ దేశాలపై సుంకాలు విధించేందుకు ట్రంప్ 'అమెరికా అంతర్జాతీయ అత్యవసర ఆర్థికాధికారాల చట్టం (ఐఈఈపీఏ)'ను అడ్డుపెట్టుకున్నారు. అధ్యక్షుడికి ఈ అధికారాలు లేవని, సెనేట్ (శాసనసభ)కే అధికారాలు ఉన్నాయని.. సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీచేసిన ఆదేశాలను రద్దు చేయాలని అమెరికా కోర్టుల్లో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

పుతిన్‌తో ప్రధాని మోదీ చర్చలు..

రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై అమెరికా ఒత్తిళ్లు, సుంకాల విధింపు నేపథ్యంలో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. దీనికి సంబంధించి ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాను. ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిణామాలను ఆయన వివరించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపైనా చర్చించాం. భారత్-రష్యా మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. ఈ ఏడాది చివరిలో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు" అని మోదీ పేర్కొన్నారు.



విద్యార్థుల అడ్మిషన్ల డేటాను ఇవ్వాల్సిందే..

యూనివర్సిటీలకు ట్రంప్ ఆదేశాలు

అమెరికాలో ఉన్నత విద్యావ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకునే దిశగా దేశాధ్యక్షుడు ట్రంప్ పావులు కదుపుతున్నారు. విశ్వ విద్యాలయాలు తమ విద్యార్థులకు సంబంధించిన అడ్మిషన్ల డేటాను ప్రభుత్వానికి వెల్లడించాలంటూ గురువారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. తమ విద్యార్థుల జాతి, లింగ, టెస్ట్ స్కోర్, గ్రేడింగ్ పాయింట్ల సగటు వివరాలను విద్యాశాఖకు ఇక నుంచి ఇవ్వాల్సిందేనంటూ పేర్కొన్నారు. కాలేజీలు జాతి ఆధారంగా కల్పించే ప్రవేశాలపై నియంత్రణ తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతి సమానత్వాన్ని పెంపొందించడానికి, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించడానికి గతంలో జో బైడెన్ సర్కారు ఇచ్చిన ఆదేశాలను తాజా ఉత్తర్వుతో ట్రంప్ రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయంపై న్యాయ నిపుణులు మండిపడుతున్నారు. అమెరికా విద్యా సంస్థల్లో నలుపు, గోధుమ వర్ణ విద్యార్థులు చేరకుండా అణచేయాలని చూస్తున్నారని విమర్శిస్తున్నారు.

మేం ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నాం

- భారత్-పాక్‌ల మధ్య యుద్ధం ఆపాం
- ఆపరేషన్ సిందూర్ కాల్పుల విరమణపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

వాషింగ్టన్, ఆగస్టు 8: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట విరుచుకుపడిన విషయం తెలిసిందే. అయితే..పాకిస్థాన్ వేడుకోలు మేరకు కాల్పులు నిలిపివేశామని భారత్ చెబుతుంటే, కాదు.. మా జోక్యంతోనే ఇరు దేశాలు యుద్ధాన్ని ఆపేశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పారు. తాజాగా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మరోసారి ట్రంప్ మాటనే వల్లెవేశారు. "మేం ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నాం. అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్య యుద్ధాన్ని నిలువరించాం. శాంతిని నెలకొల్పే విషయంలో ట్రంప్ కీలకపాత్ర పోషించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ఆపేస్తే.. భారీస్థాయిలో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటామని హామీ కూడా ఇచ్చారు. అందుకే ఇరు దేశాలు కాల్పులు విరమించాయి."అని రుబియో వ్యాఖ్యానించారు. గురువారం 'ఈడబ్ల్యూటీఎన్' నెట్‌వర్క్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణలో తమ జోక్యం ప్రత్యక్షంగా ఉందన్నారు. అధ్యక్షుడు ట్రంప్‌ను.. శాంతికి ప్రతిరూపమని అభివర్ణించారు. 'ప్రెసిడెంట్ ఆఫ్ పీస్' (శాంతి అధ్యక్షుడు)గా పేర్కొన్నారు. "ట్రంప్ పాలనంతా శాంతిమయం. ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘర్షణ ఏర్పడినా ఆయన శాంతి కాముకుడిలా వ్యవహరిస్తున్నారు. కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని నిలువరించేందుకు ప్రయత్నిస్తున్నాం." అని వ్యాఖ్యానించారు.

ఎందుకు ఖండించరు?: కాంగ్రెస్

ఆపరేషన్ సిందూర్‌పై గతంలో ట్రంప్, తాజాగా రుబియో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. వారి వ్యాఖ్యలను నిర్దిష్టంగా ఎందుకు ఖండించడంలేదని ప్రశ్నించింది. అమెరికా వ్యాఖ్యలను ఖండించేందుకు ప్రధాని భయపడుతున్నారని ఎద్దేవా చేసింది. ఈమేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "మే 10న సాయంత్రం 5.35గంటలకు రుబియో స్పందిస్తూ.. భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయి. దీనికి కారణం అమెరికా జోక్యం చేసుకోవడమేనని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రంప్ 34సార్లు ఇదే మాట చెప్పారు. ఇప్పుడు మరోసారి రుబియో ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నామని, శాంతిని స్థాపించామని చెప్పారు. ఇంత జరుగుతున్నా మోదీ ఎందుకు బహిరంగంగా ఖండించలేకపోతున్నారు? అమెరికాఅంటే ఆయన భయపడుతున్నారా?"అని ఎద్దేవా చేశారు.

మేం వచ్చాక మిమ్మల్ని వదలం

- ఎన్నికల అధికారులకు రాహుల్‌గాంధీ హెచ్చరిక
- బెంగళూరులో 'ఓటు అధికార ర్యాలీ'

బెంగళూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మోసాలతో ప్రమేయం ఉన్న ప్రతి ఎన్నికల అధికారీ.. పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. ఏదో ఒక రోజు తాము అధికారంలోకి వస్తామని.. అప్పుడు మిమ్మల్ని ఏం చేస్తామో చూడండని హెచ్చరించారు. ప్రతి ఎన్నికల కమిషనర్, అధికారి దీనిని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరెంత సీనియర్ అధికారి అయినా.. జూనియర్ అయినా లెక్కచేసేది లేదని చెప్పారు. శుక్రవారం బెంగళూరులో ఆయన ఓటు అధికార ర్యాలీలో ప్రసంగించారు. గురువారం ఢిల్లీలో విలేకరుల భేటీలో తాను చూపిన డాక్యుమెంట్లపై సంతకం చేసి.. తమకు ప్రమాణ పత్రం సమర్పించాలని, అప్పుడు ఆయన ఆరోపణలపై విచారణ చేపడతామని ఈసీ చేసిన ప్రకటనపై రాహుల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. తాను రాజ్యాంగాన్ని కాపాడతానని పార్లమెంటులో ప్రమాణం చేశానని గుర్తుచేశారు. ఓట్ల చోరీ ఆరోపణను పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికలను దొంగిలించేందుకు ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయన్నారు. 'నేను గురువారం విడుదల చేసిన డేటాను చూసి ప్రజలు ప్రశ్నించడం మొదలుపెట్టేసరికి.. ఈసీ తన వెబ్‌సైట్‌ను మూసివేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్‌లలోని ఈసీ వెబ్‌సైట్లను మూసివేశారు. ప్రజలు నిలదీస్తే తమ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని వారికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. తనను బెదిరించడానికి బదులు వీటికి బదులివ్వాలని స్పష్టంచేశారు. 'డిజిటల్ మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఓటర్ల జాబితాలను మీరెందుకు ఇవ్వడం లేదు? వీడియో ఆధారాలను మీరెందుకు ధ్వంసం చేస్తున్నారు? ఓటర్ల జాబితాల్లో భారీగా ఎందుకు మోసాలకు పాల్పడుతున్నారు? మా ప్రశ్నలకు జవాబులివ్వకుండా మమ్మల్ని ఎందుకు బెదిరిస్తున్నారు? ఈసీ బీజేపీ ఏజెంటులా ఎందుకు పనిచేస్తోంది' అని అడిగారు. ఎన్నికల చోరీపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కర్ణాటకలోని తమ పార్టీ ప్రభుత్వాన్ని రాహుల్ కోరారు. మోదీని 25 సీట్ల మార్జిన్‌తో ఎన్నికైన ప్రధానిగా పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా మేం కోరిన ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా గనుక మాకిస్తే.. భారత ప్రధాని దొంగతనం ద్వారా ఆ పదవిని అంటిపెట్టుకుని ఉన్నారని రుజువుచేస్తాం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మా కూటమి గెలిచింది. అయితే 4 నెలలకే అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించింది. ఏం జరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నించినప్పుడు.. కోటి మంది కొత్త ఓటర్లు ఓటేశారని వెల్లడైంది. ఆ కొత్త ఓట్లన్నీ బీజేపీకి పడ్డాయి. కొత్త ఓటర్లు ఓటేసిన చోటల్లా ఆ పార్టీ గెలిచింది. కానీ మా కూటమి ఓట్లు తగ్గలేదు. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వచ్చాయి. నిజాలు తవ్వేందుకు మాకు 6నెలలు పట్టాయి. చిందరవందరగా పడేసిన ఎన్నో కాగితాల నుంచి మేం వెలికితీసిన డేటా.. ఓట్ల చౌర్యమనే నేరానికి ఆధారం'అని చెప్పారు. ఓటర్ల జాబితా సాఫ్ట్‌కాపీ ఇవ్వాలని ఈసీని అడిగితే తిరస్కరిస్తోందన్నారు. రాహుల్ రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకుని.. ఇందులో వేల శతాబ్దాల చరిత్ర గలిగిన సిద్ధాంతం ఉందని సభలో చెప్పారు. 'బీజేపీ సిద్ధాంతం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనది. డబ్బులిచ్చి కర్ణాటకలో మా ప్రభుత్వాన్ని తస్కరించింది' అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలనూ దొంగిలించిందని పూర్తి నమ్మకంతో, ఆధారాలతో చెబుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాల కారణంగా గుల్బర్గాలో తాను ఓడిపోయానన్నారు.



బెంగళూరు సభలో అభివాదం చేస్తున్న రాహుల్, ఖర్గే, సిద్దరామయ్య, డీకే శివకుమార్

మీ ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేయండి.. లేదంటే క్షమాపణ చెప్పండి: ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రాహుల్‌గాంధీ ఆరోపణలను ఈసీ మరోసారి ఖండించింది. ఆయన ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఓటర్ల జాబితాలో తప్పుగా వేసిన ఎంట్రీలు, తొలగింపుల వివరాలను తమతో పంచుకోవాలని పేర్కొంది. 'మీ విశ్లేషణపై మీకు నమ్మకముంటే.. మీ ఆరోపణలు నిజమని భావిస్తే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి.. తప్పుగా చేర్చిన, తొలగించిన ఓటర్ల వివరాలివ్వడానికి ఇబ్బంది ఉండకూడదు. డిక్లరేషన్‌పై సంతకం చేయలేదంటే.. ఆయన అనాలిసిస్‌పై ఆయనకే నమ్మకంలేనట్లు లెక్క. చేసిన నిరాధార ఆరోపణలకు ఆయన జాతికి క్షమాపణ చెప్పాలి'అని ఈసీ వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. తమ వెబ్‌సైట్లను మూసివేశామన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. అన్ని భేషుగ్గా పనిచేస్తున్నాయని పేర్కొంది.

ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్న బిహార్‌లో దూకుడుగా వ్యవహరించాలని భావిస్తున్నట్టు సమాచారం. గురువారం సాయంత్రం రాహుల్ నివాసంలో విందు భేటీలో పాల్గొన్న కూటమి నేతలంతా.. ఎన్నికల సంఘంపై రాహుల్ దాడి తీరును ప్రశంసించినట్టు తెలిసింది.

ప్రజల్లోకి వెళితే.. బీజేపీకి నష్టమే?

రాహుల్ చేసిన ఆరోపణలు విపరీతంగా ప్రజల్లోకి వెళ్లడం, సాధారణ ప్రజలు దీనిపై మాట్లాడుకోవడం, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం లభించడంపై అన్ని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ ఆరోపణలు ప్రజల్లో ఏ మాత్రం ప్రభావం చూపినా.. బీజేపీ పట్ల వ్యతిరేకతగా మారే అవకాశం ఉందని నేతలు అంటున్నారు. 2జీ కుంభకోణంతో నష్టం కేవలం ఊహాత్మకమేనని అప్పట్లో కాంగ్రెస్ నేతలు వాదించినా... కాంగ్రెస్ వేలకోట్ల అవినీతికి పాల్పడినట్టు ప్రజల్లోకి వెళ్లిందని, అది బీజేపీకి అనుకూలంగా మారిందని చెబుతున్నారు. ఇప్పుడు బీజేపీ ఓట్ల చోరీ చేయకపోయినా.. ప్రజల్లో ఆ అభిప్రాయం కలిగించడంలో కాంగ్రెస్ సఫలమైతే బీజేపీ దాని పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

లోపాలు సాధారణమే.. చర్చే అసాధారణం..

రాహుల్ ఆరోపణలు, ప్రజెంటేషన్‌పై ప్రభుత్వ వర్గాల్లో, మంత్రిత్వ కార్యాలయాల్లో విస్తృతంగా చర్చలు జరుగుతున్నట్టు ఓ అధికారి తెలిపారు. నిజానికి రాహుల్ లేవనెత్తిన అంశాలు.. దేశవ్యాప్తంగా స్థానికంగా జరుగుతున్నవేనని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంటి నంబర్లు సరిగా ఉండవని, అధికారులు ఏదో ఒకటి రాసుకుంటారని, దాన్ని బట్టి బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైనట్లు భావించలేమని స్పష్టం చేశారు. కానీ ఈ అంశాన్ని సరైన సమయంలో లేవనెత్తడం, బాగా ప్రజెంటేషన్ చేయడంతో ఎన్నికల సంఘం, బీజేపీ విశ్వసనీయతపై సందేహాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. రాహుల్ చెప్పినట్టు బోగస్ ఓట్లు పడ్డాయా అనేది ఎన్నికల్లో పార్టీ ఏజెంట్లు టిక్ చేసిన ఓటర్ల జాబితాలను చూస్తే వెల్లడవుతుందని, కానీ అదంతా జరిగి ఉండే అవకాశం లేదని చెప్పారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి

రాహుల్ ఆరోపణలతో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే.. ప్రధాన మంత్రి ముందుకొచ్చి అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని ఓ సీనియర్ రాజకీయ నాయకుడు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే కమిషనర్ల నియామకం పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు మోదీ ముందుకు రావాలన్నారు.

ఓటరుకార్డు-ఆధార్ అనుసంధానంతో పరిష్కారం!

ఓటరుకార్డును ఆధార్‌తో అనుసంధానం చేస్తే బోగస్, డూప్లికేట్ ఓట్ల సమస్యకు చెక్ పడుతుందని ఎన్నికల కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ నుంచి పంచాయతీల వరకు ఒకే ఓటర్ల జాబితాను అనుసరించడంతోనూ ప్రయోజనం ఉంటుందని అంటున్నాయి. ఇక దేశంలో పౌరులకు అన్ని అవసరాలకు ఉపయోగపడేలా ఒకే కార్డును జారీ చేయాలనే ప్రతిపాదనపై చాలా రోజులుగా చర్చ జరుగుతోందని.. అది అమల్లోకి వస్తే ఓట్ల సమస్య తీరుతుందని స్పష్టం చేస్తున్నాయి.

వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు!

(మొదటిపేజీ తరువాయి)

పదవీ విరమణ చేసే వరకు ఎలాంటి క్రిమినల్ కేసులు విచారించకుండా చూడాలని ఆదేశించింది. ఒక సివిల్ వ్యవహారంలో క్రిమినల్ చర్యలు చేపట్టాలని కింద కోర్టు తీసుకున్న నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ నిరాకరించారు. సివిల్ కేసుగా చేపడితే బాధితుడికి ఎప్పటికీ న్యాయం జరగదని తీర్పులో అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో అప్పీలుకు రాగా జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం తీవ్ర నిర్ణయాన్ని ప్రకటించింది. దాన్ని పునస్సమీక్షించాలని స్వయంగా ప్రధాన న్యాయమూర్తి విజ్ఞప్తి చేయడంతో జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం తన తీర్పులోని వివాదాస్పద వ్యాఖ్యలను తొలగించడంతో పాటు మిగతా తీర్పు అమలు కూడా పక్కనబెట్టింది. కేసును తాజాగా మళ్లీ విచారించాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పరిపాలన అధికారాల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని చెప్పింది. జడ్జిలకు విధులు కేటాయించే అధికారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిదేనని అంగీకరించింది. కేసుకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ బన్సాలీని కోరింది. ఈ నెల 4న ఇచ్చిన తీర్పులో జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ తీర్పును అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటిగా అభివర్ణించింది. తాజాగా ఆ వ్యాఖ్యలపై వివరణ ఇస్తూ, ఎవరినీ ఇబ్బంది పెట్టే, జడ్జికి ఎలాంటి ఉద్దేశాలు ఆపాదించే ఉద్దేశం తనకు లేదని పేర్కొంది. గొప్ప తీర్పులు వచ్చినపుడు హైకోర్టు జడ్జిలను కొనియాడుతున్నామని గుర్తుచేసింది. హైకోర్టులు స్వతంత్ర వ్యవస్థలు కావని, భారత న్యాయ వ్యవస్థకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం కుదరదని చెప్పింది. న్యాయవ్యవస్థ తలెత్తుకొనే విధంగా ఉండాలనే ఉద్దేశంతోనే తాము తీర్పులో వ్యాఖ్యలు చేశామని తెలిపింది. హైకోర్టు తీర్పులోని వ్యవహారం న్యాయప్రక్రియలో జరిగిన పొరపాటు కాదని, న్యాయ వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను ప్రభావితం చేసిదిగా ఉందని పేర్కొంది. వాటిని కాపాడేందుకే తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది.



ముగిసిన వివాదం

ఆగస్టు 4 తీర్పులోని 25, 26 పేరాలను సుప్రీంకోర్టు తొలగించింది. జస్టిస్ కుమార్‌కు పదవీ విరమణ వరకు క్రిమినల్ కేసులు వినే అవకా శం ఇవ్వరాదని, ధర్మాసనంలో సీనియర్ న్యాయమూర్తి పక్కన రెండో న్యాయమూర్తిగా ఆయన్ను కూర్చోబెట్టాలని ఇచ్చిన రెండు ఆదేశాలను రద్దు చేసింది. న్యాయస్థానాల్లోనే చట్టబద్ధ పాలన లేకుంటే న్యాయాన్ని అందించే వ్యవస్థ అంతరించినట్లేనని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు సమర్థంగా పనిచేస్తారని, విధులను శ్రద్ధగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ కేసును ముగించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవ్యవస్థ ఇబ్బందికర పరిస్థితి నుంచి బయట పడింది. హైకోర్టు జడ్జిని విధుల నుంచి తప్పించడమంటే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విధుల్లో జోక్యం చేసుకోవడమేనంటూ అలహాబాద్ హైకోర్టు నుంచి 13 మంది జడ్జిలు సుప్రీంకోర్టు ప్రధా న న్యాయమూర్తికి లేఖ రాశారు. జస్టిస్ పార్దీవాలా తీర్పును పక్కనబెట్టాలని కోరారు. కాగా, సుప్రీం తాజా ఆదేశాల పట్ల అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. సుప్రీం తీర్పులో తన తప్పు దిద్దుకోవడం గొప్ప విషయమని అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ కొనియాడారు. హైకోర్టులు సుప్రీంకోర్టుకు కింది స్థాయి వ్యవస్థలు కాదు, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలు అన్నారు.

ఎల్‌బ్రస్ పర్వతంపై విజయవాడ వాసి

» అరవై ఏడేళ్ల వయసులో యూరప్‌లో అత్యున్నత శిఖరాన్ని ఎక్కిన ప్రభాకరరావు



మౌంట్ ఎల్‌బ్రస్‌పై ప్రభాకరరావు

పెనమలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అరవై ఏడేళ్ల వయసులో యూరప్‌లోని అత్యంత ఎత్తయిన ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించి ఔరా అనిపించారు విజయవాడ వాసి అనుమోలు ప్రభాకరరావు. 5,642 మీటర్ల ఎత్తున్న ఈ శిఖరంపై టీడీపీ జెండాను ఎగురవేశారు. కృష్ణా జిల్లా పోరంకికి చెందిన ప్రభాకరరావు (67) ఈ నెల 1న విజయవాడలో బయలుదేరి 2న రష్యాలోని మినరల్నీ వోడీ పట్టణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన అధిరోహించాల్సిన పర్వతానికి సమీపంలోని అజావ్ గ్రామానికి వెళ్లి అక్కడ రెండు రోజులపాటు అభ్యాసం చేశారు. ఆగస్టు 4న బేస్ క్యాంపు వైపు ప్రయాణించి అక్కడి వాతావరణానికి పూర్తిగా అలవాటు పడిన అనంతరం 6వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు ఎల్‌బ్రస్ పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించారు. తన పర్వతారోహణ ప్రయాణంలో దీన్నొక మైలురాయిగా ప్రభాకరరావు అభివర్ణించారు. 2024లో ఆయన ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతం, 2023లో ఎవరెస్టు బేస్ క్యాంపు వరకు ట్రెక్కింగ్ చేశారు. అనుమోలుతో పాటు పోరంకి వాసి బొబ్బా గోపాలకృష్ణ కూడా ఈ సాహస యాత్రలో పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చొరవతో స్వదేశానికి

» కాంబోడియా నుంచి క్షేమంగా ఇంటికి చేరిన యువకుడు

» లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబసభ్యులు



చందు

తాడేపల్లి (పెనుమాక), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ యువకుడు, మంత్రి లోకేశ్ చొరవతో స్వగ్రామానికి చేరాడు. వివరాలిలా.. ఉద్యోగం కోసం కాంబోడియా వెళ్లిన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన మేదవరపు చందు ఇంటర్ వరకు చదివి కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విజయవాడలో క్యాటరింగ్ నిర్వహిస్తూ, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలల క్రితం విజయవాడలో జరిగిన తన సోదరి వివాహ కార్యక్రమంలో పర్యాయక చెందిన మోజెస్ అనే వ్యక్తి అతనికి పరిచయమయ్యాడు. అతని మాటలు నమ్మి చందు ఈ ఏడాది జూన్ 24న ఉద్యోగం కోసం కాంబోడియా వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తర్వాత సైబర్ నేరాలు చేయాలంటూ మోజెస్ అతని కుటుంబసభ్యులు వేధించడం ప్రారంభించారు. చందు అంగీకరించకపోవడంతో చీకటి గదిలో బంధించి తిండి సరిగ్గా పెట్టకుండా చిత్రహింసలకు గురిచేశారు. దీనికి తోడు అక్కడి వాతావరణ పరిస్థితులకు అతని గొంతు నుంచి గుండె వరకు ఇన్‌ఫెక్షన్ సోకింది. సైబర్ ముఠా నుంచి బయటపడలేని భావించిన చందు.. హెల్ప్‌నాగాలోకేశ్‌కు ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించాడు. స్పందించిన మంత్రి అతన్ని క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోకేశ్ ఆదేశాలతో కాంబోడియా ఎంబసీ అధికారులతో మాట్లాడిన రాష్ట్ర అధికారులు.. చందును ఈ నెల 1న క్షేమంగా స్వగ్రామానికి చేరేలా చర్యలు తీసుకున్నారు. కాగా.. తనను సైబర్ నేరగాళ్ల చెర నుంచి కాపాడిన మంత్రి లోకేశ్‌కు చందు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ 28న ప్రతిజ్ఞా దినం

అమరావతి/విజయవాడ(గవర్నర్‌పేట), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా, అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఈ నెల 28న ప్రతిజ్ఞ దినం పాటించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం విజయవాడ సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో 10 వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. 'గత వైసీపీ ప్రభుత్వం ప్రజలపై వేసిన రూ.వేల కోట్ల భారాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు అవే విధానాలను కొనసాగిస్తోంది. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ.. విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఈ నెల 28న ప్రతిజ్ఞ దినంగా పాటించాలి' అని ఈ సమావేశంలో తీర్మానించారు.



పాత కంపెనీలకే పట్టం!

» చివరి దశకు చేరుకున్న శానిటేషన్ టెండర్లు

» డీఎంఈకి 5, డీఎస్‌హెచ్‌కు 7 కంపెనీల అర్హత

» ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరగట్లేదు

» గతంలో డీఎంఈ, డీఎస్‌హెచ్ కమిషనర్ నివేదిక

» ప్రస్తుతం మళ్లీ అర్హత సాధించిన అవే కంపెనీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

శానిటేషన్ టెండర్లలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మరోసారి పాత కంపెనీలకే పట్టం కట్టారు. టెక్నికల్ బిడ్ తర్వాత డిస్‌క్వాలిఫై చేసిన కంపెనీల నుంచి అభ్యంతరాల స్వీకరణకు 24 గంటలే గడువు ఇచ్చి ఆ ప్రక్రియను తూతూమంత్రంగా కానిచ్చేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు, రూ.కోట్లలో టర్నోవర్, అర్హత కలిగిన కంపెనీలను పరిగణలోకి తీసుకోలేదు. టెండర్ నిబంధనలు మార్చేసి, కొన్ని కంపెనీలను ఉద్దేశ పూర్వకంగా డిస్‌క్వాలిఫై చేశాన్న విమర్శలొచ్చినా పట్టించుకోలేదు. చివరకు తాము అనుకున్న కంపెనీలనే ఎంపిక చేశారు. డీఎంఈ ఆస్పత్రులకు ఐదు, డీఎస్‌హెచ్ (డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్)కు ఏడు చొప్పున అర్హత సాధించిన కంపెనీలకు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్‌లను గత మంగళవారం ఆఘమేఘాల మీద తెరిచారు. అందులో 2మినహా మిగిలిన కంపెనీలు ఏపీఎంఎస్ఐడీసీ నిర్దేశించిన 3.85శాతానికే పరిమితమయ్యాయి. సోమవారం బిడ్ ఫైనలైజ్ కమిటీ (బీఎఫ్‌సీ) సమావేశం ఏర్పాటు చేసి కంపెనీలకు టెండర్లు ఖరారు చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న కంపెనీలే కొత్త టెండర్లలో అర్హత సాధించాయి. టెండర్ నిబంధనల ప్రకారం కాకుండా సిబ్బందిని తగ్గించి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జీజీహెచ్‌ల సూపరింటెండెంట్లతో గతంలో ఎంవోయూ కుదుర్చుకున్న కంపెనీ మరోసారి ఎంపికైంది. గతంలో శానిటేషన్ సిబ్బంది నియామకంలో అక్రమాలకు పాల్పడిన మరో కంపెనీ కూడా అర్హత సాధించింది. ఆయా కంపెనీలపై పలు ఆరోపణలున్నా వాటిని పరిగణలోకి తీసుకోలేమని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఎండీ వీర పాండియన్ ఇప్పటికే స్పష్టం చేశారు.

కమిషనర్ నివేదిక బుట్టదాఖలు

ప్రస్తుతం రాయలసీమలో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న కంపెనీ తీరు సరిగ్గా లేదని, సిబ్బంది ధర్నాలు చేస్తున్నారని మూడు జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి లేఖలు రాశారు. సదరు కంపెనీ వర్కర్లకు జీతాలు సమయానికి ఇవ్వడం లేదని, ఆస్పత్రుల్లో పారిశుధ్యం శుభ్రంగా ఉండటం లేదని, టెండర్ నిబంధనలు పాటించట్లేదని ఆరోపించారు. అదేవిధంగా శానిటేషన్, సెక్యూరిటీ పనులు చేస్తున్న కంపెనీల పని తీరు సక్రమంగా లేదంటూ డీఎంఈ, డీఎస్‌హెచ్ కమిషనర్ సైతం ప్రభుత్వానికి గతంలోనే లేఖ రాశారు. ఇకపై పిలిచే టెండర్లలో టర్నోవర్ ఎక్కువగా ఉన్న, మంచి కంపెనీలకు శానిటేషన్, సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించాలని ఆ లేఖలో సూచించారు. శానిటేషన్ టెండర్లు పిలిచే ముందు సీఎం చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. అయితే ఈ సూచనలను అధికారులు బుట్టదాఖలు చేశారు. మరోవైపు టెండర్ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలున్నా డిస్‌క్వాలిఫై చేశారని ఆరోపిస్తూ నాలుగు కంపెనీలు సోమవారం కోర్టును ఆశ్రయించడానికి సిద్ధమయ్యాయి. ఏపీఎంఎస్ఐడీసీ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇస్తే మొత్తం టెండర్ ప్రక్రియకు బ్రేక్ పడే అవకాశం ఉంది.

అంతా నిబంధనల ప్రకారమే..: స్పెషల్ సీఎస్

శానిటేషన్ టెండర్ల ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారమే చేపట్టామని ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు తెలిపారు. కంపెనీల ఎంపికను పారదర్శకంగా చేస్తున్నామని చెప్పారు. టెండర్ డాక్యుమెంట్ సిద్ధం చేసినప్పుడే క్షుణ్నంగా అధ్యయనం చేశామని, మెటీరియల్ కాస్ట్, సర్వీస్ చార్జీలను విభజన చేశామని వివరించారు. అంతా పకడ్బందీగా చేస్తున్నామని, కంపెనీ యాజమాన్యాల విషయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొన్నారు. టర్నోవర్ ఎక్కువగా ఉన్నా కంపెనీలను ఎంపిక చేయాలని సీఎం చెప్పారని, ఆ ప్రకారమే టెండర్ ప్రక్రియ చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

'ధర్మస్థల' కవరేజీపై మీడియాకు అడ్డుకట్ట వేయలేం!

» చాలా అరుదైన కేసుల్లోనే 'గ్యాగ్ ఆర్డర్'

» సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

» 15వ ప్రదేశంలో తనిఖీలు ప్రారంభం

బెంగళూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలలో మృతదేహాలు పూడ్చిపెట్టిన వివాదంపై మీడియా కవరేజీపై ఆంక్షలు విధించలేమని, అడ్డుకట్ట వేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం తేల్చిచెప్పింది. అయితే ఆలయాన్ని నిర్వహిస్తున్న తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రచారంలో ఉన్న అవమానకర కంటెంట్‌ను తొలగించాలని కోరుతూ ధర్మస్థల ఆలయ ట్రస్టు కార్యదర్శి హర్షేంద్రకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై కొత్త నిర్ణయం తీసుకోవాలని కర్ణాటక ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే గ్యాగ్ ఆర్డర్ (నిషేధ ఉత్తర్వులు) ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. మీ వద్ద ఉన్న సమాచారాన్ని అంతా ట్రయల్ కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్‌కు సూచించింది. ధర్మస్థల ఆలయ ట్రస్టు సభ్యులుగా ఉన్న తమ కుటుంబానికి అవమానం చేసేలా సాగుతున్న మీడియా ప్రచారం నిలిపివేయాలని పిటిషన్‌దారుడు కోరారు. యూట్యూబ్ చానెళ్లలో 8 వేలకు పైగా లింక్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, శవాల పూడ్చివేత కేసుపై రిపోర్టింగ్‌ను నియంత్రిస్తూ బెంగళూరు సివిల్ కోర్టు ఇచ్చిన గ్యాగ్ ఆర్డర్‌ను రాష్ట్ర హైకోర్టు ఈనెల 1న పక్కన పెట్టింది.

భద్రత కల్పించండి.. ఫిర్యాదుదారుడి వినతి

తనకు ప్రాణభయం ఉందని, గన్‌మెన్‌తోపాటు భద్రత కల్పించాలని ధర్మస్థలలో వందలాది మృతదేహాలను పూడ్చానని ఫిర్యాదు చేసిన మాజీ పారిశుధ్య కార్మికుడు 'సిట్' అధికారులను శుక్రవారం కోరారు. ఇప్పటికే ఆయనకు భద్రత కల్పించామని, మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ కన్నడ జిల్లా పోలీసులు హామీ ఇచ్చారు. మరోవైపు ఫిర్యాదుదారుడు చూపిన 14 స్థలాల్లో 13 చోట్ల తవ్వకాలు ముగిశాయి. 13వ స్థలంలో గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్)తో తనిఖీలు చేపట్టాలని భావిస్తున్నారు. జీపీఆర్ వినియోగానికి అవసరమైన అనుమతుల కోసం సిట్ ఎదురుచూస్తోంది. శుక్రవారం 15వ ప్రదేశాన్ని చూపగా.. అక్కడ తనిఖీలు ప్రారంభించారు. మృతదేహాలు పూడ్చిపెట్టానని ఫిర్యాదు చేసిన వ్యక్తితో కలిసి గతంలో 1995 నుంచి 2014 వరకు పనిచేసిన తమిళనాడుకు చెందిన ఐదుగురిని సిట్ అధికారులు రప్పించి, విచారించింది. ధర్మస్థల గ్రామపంచాయతీ నుంచి పాత రికార్డులను పరిశీలించారు. కాగా, బెళ్తంగడిలో సిట్ కార్యాలయాన్ని సిట్ పోలీస్‌స్టేషన్‌గా మార్పు చేశారు.

గతంలోనూ ఇదే తరహా ఆరోపణలు: బీఎల్ సంతోష్

మృతదేహాలను పూడ్చిపెట్టారన్న ఆరోపణలు ధర్మస్థల పేరును చెడగొట్టే ప్రయత్నంలో భాగమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ అన్నారు. గతంలో శబరిమల, శనిసింగనాపూర్, ఈషా ఫౌండేషన్‌పై ఇదే తరహాలో ఆరోపణలు వచ్చాయని శుక్రవారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ధర్మస్థల దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగుతోందని, దశాబ్దాలుగా ఆధ్యాత్మిక చైతన్యం తీసుకొస్తున్న సంస్థ అని, విద్య, వసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. మహిళల చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఎప్పుడో జరిగిందనే అంశాన్ని తెరపైకి తెచ్చి వివాదం చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రం చేయాలి: కుంచం

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రాన్ని 2029లోగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ప్రెసిడెంట్ డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌తో పోరాటం చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు.



వైద్య పరీక్షల నిమిత్తం అనిల్‌కుమార్ రెడ్డిని రుయాకు తరలిస్తున్న పోలీసులు

'తిరుపతి' ఘటనలో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బైక్ అద్దె చెల్లించలేదని కిడ్నాప్ చేసి ఫైబర్ లాఠీ, దుడ్డుకర్రతో చితకబాదిన ఘటనలో నిందితులైన భూమన అభినయ్ అనుచరులు అనిల్‌కుమార్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి, దినేష్‌ను తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. వారిని శుక్రవారం రిమాండుకు తరలించారు. నిందితులపై అట్రాసిటీతో పాటు కిడ్నాప్, హత్యాయత్నం, చిత్రహింసలకు గురిచేయడం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వీరిపై పాత కేసులు ఏమున్నాయి? ఎక్కడైనా అరాచకాలకు పాల్పడ్డారా అనే కోణంలోనూ దర్యాప్తు చేశారు. ఈ ముగ్గురినీ అరెస్టు చేసిన పోలీసులు రుయాలో వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచగా, 14 రోజులు రిమాండ్ విధించారు. మరో నిందితుడు అజయ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. కాగా, బాధితుడు పవన్‌కుమార్ బుధవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో అతని కోసం పోలీసులు గాలించారు. ఈ క్రమంలో చిత్తూరులోని ఓ లాడ్జిలో బందీగా ఉన్న పవన్‌ను శుక్రవారం తిరుపతికి తీసుకొచ్చారు. దాడి దృశ్యాలు వైరల్ అయిన తర్వాత తనను ఎవరూ చిత్రహింసలకు గురిచేయలేదని, దళిత సంఘాలు ఆందోళన చేసి తనను ఇబ్బంది పెట్టాల్సిన పనిలేదంటూ పవన్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వచ్చింది. తనను బెదిరించి ఈ వీడియో చేయించారని పవన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు.

పేలుడుకు కారణం రక్షణ శాఖ వస్తువు?

» పోలీసులకు లభించిన ఆధారాలు

విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపాన బుక్కా వారి వీధిలో గురువారం సాయంత్రం భారీ పేలుడుకు కారణం గ్యాస్ సిలెండర్ కాదని, రక్షణ శాఖకు చెందిన వస్తువు అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి పోలీసులు ఆ ప్రాంతంలోకి ఎవరూ రాకుండా, సాక్ష్యాలు ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి పలు అంశాలు వచ్చాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు రక్షణ శాఖకు చెందిన ఓ బరువైన ఇనుప వస్తువు లభించగా, దానిని వారు బుక్కా వీధిలో ప్రమాదం జరిగిన వెల్డింగ్ షాపు పక్కనున్న తుక్కు వ్యాపారికి విక్రయించారు. ఇలాంటి వస్తువులను ముక్కలుగా కట్ చేసి అమ్మేస్తుంటారు. అందులో భాగంగా దానిని కట్ చేసి ఇవ్వాలని తుక్కు వ్యాపారి పక్కనున్న వెల్డింగ్ షాపులో ఇవ్వగా దానిని కట్ చేస్తున్నప్పుడు భారీ పేలుడు సంభవించిందని తేలింది. దీనికి గ్యాస్ సిలిండర్లకు సంబంధం లేదని పోలీసులు భావిస్తున్నారు. కట్ చేసిన వస్తువు శకలాలను కూడా పోలీసులు సేకరించారు. వాటిపై రక్షణ శాఖకు చెందిన గుర్తులు ఉన్నట్టు తెలిసింది. దర్యాప్తు చేస్తున్నామని, పరీక్షల అనంతరం పేలుడుకు కారణం ఏమిటనేది తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

మెడికవర్‌కు ఒకరు తరలింపు

భారీ పేలుడు ఘటనలో ముగ్గురు మరణించగా మరో ముగ్గురిని తీవ్ర గాయాలతో కేజీహెచ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెడికవర్ ఆస్పత్రికి గురువారం రాత్రే తరలించారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా

పేలుడు కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్టు వెల్లడించారు.

2029 నాటికి మూడో లాంచ్ ప్యాడ్ పూర్తి

బెంగళూరు, ఆగస్టు 8: స్వదేశీ, విదేశీ, వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాలతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బిజీగా ఉంది. ఈ అవసరాల కోసం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం - షార్‌లో రెండు లాంచ్ ప్యాడ్‌లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇక్కడ మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలోనే ఆమోదం తెలిపింది. అయితే.. ఈ మూడో లాంచ్ ప్యాడ్‌ను 2029 మార్చి నాటికల్లా పూర్తిచేయగలమని అంతరిక్ష శాఖ తెలిపింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూడో లాంచ్ ప్యాడ్.. న్యూ జనరేషన్ లాంచ్ వెహికిల్ (ఎన్‌జీఎల్వీ) ప్రయోగాలతోపాటు ఇస్రో భవిష్యత్ మిషన్లకు ఎంతగానో ఉపయోగపడనుంది. అలాగే శ్రీహరికోటలో ప్రస్తుతం ఉన్న రెండు లాంచ్ ప్యాడ్‌లకు బ్యాకప్‌గా నిలవనుంది. ఈ ఏడాది మే నాటికి సర్వేలు, బయోటెక్నికల్ అధ్యయనాలు పూర్తయ్యాయని, మౌలిక సదుపాయాల పనుల కోసం టెండర్ల ప్రక్రియ జరుగుతోందని అంతరిక్ష శాఖ తెలిపింది. 2028 సెప్టెంబరు నాటికి లాంచ్ ప్యాడ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి.. 2029 మార్చి నాటికి లాంచ్ ప్యాడ్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని తెలిపింది.



కట్టలేరు వరదలో కొట్టుకుపోతూ..



సురక్షితంగా బయటపడిన పాపారావు

కట్టలేరులో కొట్టుకుపోయి.. వరదకు ఎదురీది...!

» సకాలంలో తాడు అందించి రక్షించిన పోలీసులు

ప్రాణాలు దక్కించుకున్న వి.అన్నవరం వాసి

వీరులపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరద ప్రవాహాన్ని అంచనా వేయకుండా బైక్‌పై చప్టా దాటుతుండగా కొట్టుకుపోయిన ఓ వ్యక్తి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడికి ఈత రావడంతో పాటు, పోలీసులు సకాలంలో తాడు అందించడంతో ఒడ్డుకు చేరుకున్నాడు. గురువారం రాత్రి ఎగువన కురిసిన వర్షానికి దాములూరు వైరా కట్టలేరుకు భారీగా వరద నీరు చేరింది. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పల్లంపల్లి, నందిగామ మండలం కూడెలి, దాములూరు మధ్య ఉన్న చప్టాను వీరులపాడు మండలం వి.అన్నవరానికి చెందిన దొండపాటి పాపారావు శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై దాటే ప్రయత్నం చేశాడు. అయితే, వరద ఉధృతికి బైకు కొట్టుకుపోగా అతను ఓ చెట్టుకొమ్మను పట్టుకొన్నాడు. విషయం తెలుసుకున్న వీరులపాడు పోలీసులు అక్కడకు చేరుకొని తాళ్ల సాయంతో అతన్ని క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. పాపారావు మోటార్ బైక్, రూ.25 వేలు నగదు, సెల్‌ఫోన్ వరదలో కొట్టుకుపోయాయి.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

టెండరు నం. GTL-EM-23-2025-26 తేది : 06.08.2025 PUB/0958

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం: GTL-EM-23-2025-26. పని పేరు: గుంతకల్ డివిజన్: GY డిపో ఫ్రైట్ ఎగ్జామినేషన్ యార్డు కొరకు వెల్డింగ్ గ్రిడ్ కొరకు ప్రతిపాదన. సుమారు విలువ: రూ. 1,48,12,783.08/-

ముగింపు తేది మరియు సమయం: 29.08.2025న 15.00 గం.లకు.

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. ఏదేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

గమనిక: ఈ ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటులో గల డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, నిర్వహణ, గుంతకల్

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. DRM/Works/BZA/16/2025, తేది: 05.08.2025 PUB/0961

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఒక్కో తేదీన 15.00 గం. వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం.1: టెండరు నం. E-32-EAST-BZA-2025 పని వివరాలు: పని పేరు: DEN/E/BZA అధికార పరిధి క్రింద SSE/Works/BVRM, GDV మరియు BZA సెక్షన్లలోని స్టేషన్ల వద్ద కనీస అవసరమైన సౌకర్యాలు/దివ్యాంగ సౌకర్యాలు ఏర్పాటు చేయుట. పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ రూ.: 2,10,76,818/-, బయానా రూ.: 2,55,400/-, ముగింపు తేది: 19.08.2025

క్ర.సం.2: టెండరు నం. E-33-EAST-BZA-2025 పని వివరాలు: పని పేరు: విజయవాడ డివిజన్-KI-BZA సెక్షన్: TFTR – మొత్తం పొడవు 3.65 కి.మీ కొరకు ట్రాక్ సెంటర్ల కంటే తక్కువ. 5.30 మీటర్లతో CR లైన్ (0.450 కి.మీ నుండి 3.000 కి.మీ) & బల్బు లైన్ II (0.300 కి.మీ నుండి 1.400 కి.మీ) సెస్ వెడల్పు చేయడం/ మరమ్మత్తులు చేయడం, నీరు నిలిచిపోకుండా ఉండడానికి ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాలను నింపడం, ట్యాంక్ బ్యాంక్‌ను సరిగా అందించడం. పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ రూ.: 72,28,665/-, బయానా రూ.: 1,44,600/-, ముగింపు తేది: 19.08.2025

క్ర.సం.3: టెండరు నం. E-13-SOUTH-BZA-2025 పని వివరాలు: పని పేరు: GDR-BZA సెక్షన్: TFTR - Sr. DEN/S/BZA అధికార పరిధిలోని మొత్తం పొడవు 27.862 కొరకు సెంట్రల్ & క్రాస్ డ్రైన్ల ఏర్పాటు యొక్క నీరు నిలిచిపోకుండా ఉండడానికి ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాలు నింపడం ద్వారా అందించడం, వెడల్పు చేయడం/ మరమ్మత్తులు. పూర్తి చేయు కాలం: 15 (పదిహేను నెలలు), టెండరు విలువ రూ.: 13,93,80,490/-, బయానా రూ.: 8,46,900/-, ముగింపు తేది: 19.08.2025

క్ర.సం.4: టెండరు నం. E-24-NORTH-BZA-2025 పని వివరాలు: పని పేరు: విజయవాడ డివిజన్ – BZA-VSKP సెక్షన్లు (UP&DN) TFTR- మొత్తం పొడవు 17.781 కి.మీ.లు (మంజూరైన ప్రదేశాలు అనుబంధంగా జత చేయబడినది) కొరకు వివిధ ప్రదేశాల వద్ద ఎత్తు కంటే ఎక్కువ 3 మీటర్లను ఏర్పాటు చేయుట. ప్రక్కనే ఉన్న ట్రాక్‌ల మధ్య దూరం తగినంతగా ఉన్న పరిమిత పొడవు (UP or DN) ప్రీ కాస్ట్ / కాస్ట్ ఇన్ సీటూ ఆర్‌సిసి సెంట్రల్ & క్రాస్ డ్రైన్ల ఏర్పాటు యొక్క నీరు నిలిచిపోకుండా ఉండడానికి ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాలు నింపడం ద్వారా అందించడం, వెడల్పు చేయడం/ మరమ్మత్తులు. పూర్తి చేయు కాలం: 18 (పద్దెనిమిది నెలలు), టెండరు విలువ రూ.: 17,41,90,959/-, బయానా రూ.: 10,21,000/-, ముగింపు తేది: 20.08.2025

క్ర.సం.5: టెండరు నం. E-25-NORTH-BZA-2025 పని వివరాలు: పని పేరు: SW-1: DEN/TUNI సబ్ డివిజన్ క్రింద SSE/Works/TUNI సెక్షన్‌లోని TUNI, NRP మరియు AKP స్టేషన్ల వద్ద FOB లకు మరమ్మత్తులు. SW-2: ADEN/SLO సబ్ డివిజన్ క్రింద SSE/Works/SLO సెక్షన్‌లోని DWP, APT, SLO, SPVM, CCT, COA, PAP, GLP మరియు ANV స్టేషన్ల వద్ద FOB లకు మరమ్మత్తులు. SW-3: ADEN/RJY సబ్ డివిజన్ క్రింద SSE/Works/RJY సెక్షన్‌లోని PSDA, KVR, GVN మరియు RJY స్టేషన్ల వద్ద FOB లకు మరమ్మత్తులు. SW-4: ADEN/RJY సబ్ డివిజన్ క్రింద SSE/Works/NDD సెక్షన్‌లోని CEL, TDD మరియు NDD స్టేషన్ల వద్ద FOB లకు మరమ్మత్తులు. పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ రూ.: 2,53,64,818/-, బయానా రూ.: 2,76,800/-, ముగింపు తేది: 21.08.2025

క్ర.సం.6: టెండరు నం. E-10-Bridges-BZA-2025 పని వివరాలు: పని పేరు: BZA డివిజన్:- BZA-VSKP సెక్షన్: ADEN/BR/N/BZA అధికార పరిధి క్రింద SSE/BR/II/RJY సెక్షన్‌లోని Br.No. 248ఎ (రైల్ కమ్ రోడ్ బ్రిడ్జ్)పై SS చెకర్డ్ ప్లేట్‌తో పాడైపోయిన ఐసోలేటెడ్ ప్రదేశాల వద్ద MS సైడ్ పాత్‌వే భర్తీ చేయుట మరియు గాల్వనైజ్డ్ MS షీట్‌తో CG టాప్ ఫ్లాంగస్ యొక్క కవరింగ్ మరియు బాటం X -బ్రాసింగ్స్ పై PVC పైప్ కవరింగ్ ఏర్పాటు చేయుట. పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ రూ.: 2,38,91,454/-, బయానా రూ.: 2,69,500/-, ముగింపు తేది: 21.08.2025

క్ర.సం. 7. టెండరు నం. E-18-CENTRAL-BZA-2025, పని వివరాలు- పని పేరు: GDR-BZA-VSKP సెక్షన్: 2025-26 వర్షాకాలంలో సెంట్రల్ అధికార పరిధిలో ADEN/BPP సబ్ డివిజన్‌లో మరియు ADEN/EE సబ్ డివిజన్‌లో ప్రస్తుత RUBs/LHS యొక్క డివాటరింగ్- డీసిల్టింగ్ మరియు నిర్వహణ. పూర్తిచేయుకాలం: 12 (పన్నెండు నెలలు) టెండరు విలువ : రూ. 20,25,562/-, బయానా: రూ. 40,500/-, ముగింపు తేది: 26.08.2025.

క్ర.సం. 8. టెండరు నం. E-35-EAST-BZA-2025, పని వివరాలు- పని పేరు: విజయవాడ డివిజన్: KI-BZA-GDR &BZA-BVRM-NDD సెక్షన్లు: ప్యాసింజర్ రన్నింగ్ లూప్‌లైన్‌పై 17.663 కి.మీ. మొత్తం పొడవు కొరకు బల్లాస్ట్ డీప్ స్క్రీనింగ్ మరియు 35 సెం.మీ.కు బల్లాస్ట్ కుషన్ పెంచుట మరియు రీకూప్‌మెంట్ కలుపు కొని 1660 నం.లు/ కి.మీ. కొత్త వెడల్పు స్లీపర్లపై కొత్త 60 Kg/R260 రైల్లతో 1540/ 1660/కి.మీ. డెన్‌సిటీ PSC5/PSC6 (SH) స్లీపర్లపై Exg.52kg/90UTS & 60Kg/ 90UTS (SH) యొక్క CTR(P). పూర్తిచేయు కాలం: 12 (పన్నెండు నెలలు) టెండరు విలువ : రూ. 5,23,72,431/-, బయానా: రూ. 411900/-, ముగింపు తేది: 26.08.2025.

క్ర.సం. 9. టెండరు నం. E-34-EAST-BZA-2025, పని వివరాలు- పని పేరు: విజయవాడ డివిజన్: 2 సంవత్సరాల కాలానికి విజయవాడ డివిజన్‌లో అల్ట్రా ఫ్లా డిటెక్షన్ ఎక్విప్‌మెంట్ ద్వారా రైల్/ వెల్డ్/ ఎస్ఇజె/ స్విచ్ టెస్టింగ్‌కు సంబంధించి అనుబంధ పనులు చేపట్టుట. పూర్తిచేయు కాలం: 24 (ఇరవై నాలుగు నెలలు) టెండరు విలువ : రూ. 4,43,80,939/-, బయానా: రూ. 3,71,900/-, ముగింపు తేది: 26.08.2025.

క్ర.సం. 10. టెండరు నం. E-26-BZA-North - 2025, పని వివరాలు- పని పేరు: SW-I విజయవాడ డివిజన్: BZA-VSKP సెక్షన్: హంసవరం స్టేషన్ నుండి దువ్వాడ స్టేషన్ల మధ్యన "ఎయిర్ పుషింగ్ మెథడ్" ద్వారా 4.0 m x 2.5M యొక్క సైజులలో ఆర్‌సిసి బాక్సుతో శిథిలమైన ఆర్‌సిసి స్లాబ్ బ్రిడ్జ్ నం.లు.596 DN , 597 DN, 601 DN,694 DN, 722DN, 666 UP, 668 UP, 696 UP =8 నం.లు భర్తీ. SW-II విజయవాడ డివిజన్: BZA-VSKP సెక్షన్: హంసవరం స్టేషన్ నుండి దువ్వాడ స్టేషన్ల మధ్యన " ఎయిర్ పుషింగ్ మెథడ్ " ద్వారా 2.0 m x 2.5m x ,5.0m x 2.5m & 2x4.0m x2.5m యొక్క సైజులలో ఆర్‌సిసి బాక్సుతో శిథిలమైన ఆర్‌సిసి స్లాబ్ బ్రిడ్జ్ నం.లు.579 DN (1X1.83), 673DN (1X1.83), 675DN (1X4.57),734DN (2X3.66) & 717 UP (1X4.57) =5 నం.లు భర్తీ. పూర్తిచేయు కాలం: 09 (తొమ్మిది నెలలు) టెండరు విలువ : రూ. 6,95,52,114/-, బయానా: రూ. 4,97,800/-, ముగింపు తేది: 27.08.2025

క్ర.సం. 11. టెండరు నం. E-27-North-BZA-2025, పని వివరాలు- పని పేరు: BZA డివిజన్: BZA-VSKP సెక్షన్: 2 సంవత్సరాల కాలానికి DEN/North/BZA అధికార పరిధిలో రోబోటిక్ వెల్డింగ్ మిషన్‌ను ఉపయోగించి వార్న్- అవుట్ సిఎంఎస్ క్రాసింగ్ యొక్క ఇన్-సీతు రీకండీషన్ పూర్తిచేయు కాలం: 24 (ఇరవై నాలుగు నెలలు) టెండరు విలువ : రూ. 1,18,88,004/-, బయానా: రూ. 2,09,500/-, ముగింపు తేది: 28.08.2025.

1) పూర్తి పనిపేరు వివరాలు వంటి టెండర్ నిబంధనలు/ఇతర వివరాలు, ఇదే తరహా పై పనులు, అర్హతా ప్రమాణాలు వగైరా వెబ్‌సైట్ "www.ireps.gov.in"లో ప్రచురించిన టెండరు డాక్యుమెంట్‌లో లభించును. 2) కాగోరు టెండరుదారులు ఏదైనా టెండరుకు ఏదైనా మార్పులు/ సవరణ గమనించుటకు టెండర్ ముగింపు తేదీనకు ముందు వెబ్‌సైట్ "www.ireps.gov.in"ను దర్శించవలసిందిగా సూచించడమైనది. 3) టెండరు ప్రకటన డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), ద.మ. రైల్వే, విజయవాడ కార్యాలయం మరియు విజయవాడ డివిజన్ యొక్క ఏడిఇఎన్ సబ్ డివిజన్ కార్యాలయాలలో ప్రదర్శించబడిన నోటీసు బోర్డును చూడగలరు. 4) ఎటువంటి కారణం తెలుపకుండా టెండరును రద్దు చేయుటకు రైల్వేకు హక్కు కలదు.

మా సైట్ "www.ireps.gov.in" దర్శించగలరు.

A1185 డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు),విజయవాడ

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

योजना तथा वास्तुकला विद्यालय, विजयवाडा
School of Planning and Architecture, Vijayawada
An Institute of National Importance, Ministry of Education, Govt. of India
Survey No.4/4, ITI Road, Vijayawada – 520 008, AP., India.

Ref. No.SPAV/Admin/Estt./Non-Teaching Dt: 09-08-2025

ADVERTISEMENT NO.:01/2025

School of Planning and Architecture, Vijayawada invites applications from Indian National for the following posts on Direct Recruitment/Deputation.

Name of the Post	Level of Pay	No. of Post	Reservations				
			UR	SC	ST	OBC-NCL	EWS
Registrar	14	01	01	--	--	--	--
Assistant Registrar Direct-01 & Deputation -01	10	02	02	--	--	--	--
Assistant Registrar Finance (on Deputation)	10	01	01	--	--	--	--
Graphic Designer/ Sr. Technical Assistant (Publication)	07	01	01 (PwD)	--	--	--	--
Personal Assistant (Direct-01, Deputation -01)	06	02	02	--	--	--	--
Junior Superintendent (Technical) (Deputation-01)	06	01	01	--	--	--	--

Reservations for SC/ST/OBC-NCL/EWS/PwD and age relaxation are applicable as per GoI orders. For detailed information regarding eligibility, qualification, experience, other terms and conditions and application forms, visit our website www.spav.ac.in. The last date of receipt of application is 30 days from the date of publication in the employment news. Applications forms are to be submitted online only by registering in following link: https://spavnt.samarth.edu.in/. Sd/- Registrar

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

నం. B/C.576/YTSK/01/2025, తేది:04.08.2025
అడ్వర్టైజ్‌మెంట్ నోటిఫికేషన్ నం.01/2025 (YTSK) PUB/0968

దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో రిజర్వ్‌డ్ మరియు అన్ రిజర్వ్‌డ్ రైల్ టికెట్స్ జారీ చేయుటకు యాత్రి టికెట్ సువిధ కేంద్ర (YTSK) నెలకొల్పుటకు ప్రకటన.

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్, విజయవాడ వారు రిజర్వ్‌డ్ మరియు అన్ రిజర్వ్‌డ్ టికెట్ల జారీ కొరకు దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో వివిధ ప్రదేశాల వద్ద ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా యాత్రి టికెట్ సువిధ కేంద్ర (YTSK) స్థాపన మరియు నిర్వహణ కొరకు దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన పార్టీలు YTSK ఎక్కడ స్థాపించాలని వారు భావిస్తున్నారో ఆ ప్రదేశాన్ని తెలుపగలరు.

భారతీయ రైల్వేలలోని రైల్ ట్రావెల్ సర్వీస్ ఏజెంట్లు (RTSAs), రైల్ ట్రావెల్ ఏజెంట్లు (RTAs) మరియు జన్‌సాధారణ్ టికెట్ బుకింగ్ సేవక్స్ (JTBS) కలుపుకుని అధీకృత రైల్వే టికెటింగ్ ఏజెంట్లు అందరూ మరియు ఇండియన్ రైల్వే కేటరింగ్ మరియు టూరిజం కార్పొరేషన్ (IRCTC) ద్వారా నియమించిన టికెటింగ్ ఏజెంట్లు, పని చేసిన/ ప్రస్తుతం పని చేస్తున్న వారు కూడా **కనీసం రెండు (2) సంవత్సరాల కొరకు YTSK పథకం క్రింద దాఖలు చేసుకొనుటకు అర్హులు.**

దరఖాస్తు ఫారం, అర్హతా ప్రమాణాలు, అర్హత, నియమనిబంధనలతోపాటు పథకం వివరాలు దక్షిణ మధ్య రైల్వే అధికారిక వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో ఉంచబడినవి.

కవర్‌పై "Application for operation of Yatri Ticket Suvidha Kendra (YTSK)" అని వ్రాసి సీల్డ్ కవర్‌లో నిర్ణీత పరచబడిన, సంబంధిత డాక్యుమెంట్లు అన్నింటితోపాటు దరఖాస్తులను రిజిస్టర్డ్ పోస్ట్ విత్ అకనాలెడ్జ్‌మెంట్ ద్వారా పంపవచ్చును లేదా సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, 1వ అంతస్తు, DRM's కార్యాలయ కాంపౌండ్, విజయవాడ డివిజన్, విజయవాడ-520001 కార్యాలయం నుండి స్వయంగా పొందవచ్చును.

దరఖాస్తుల దాఖలుకు ఆఖరి తేది 01.09.2025 న 15.00 గం.లకు లేదా ఆలోగా. 01.09.2025న 15.00 గం.తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించబడవు. దరఖాస్తుల దాఖలులో ఏదేని జాప్యానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు.

ఇందుకు సంబంధించి, **సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, 1వ అంతస్తు, DRM's కార్యాలయ కాంపౌండ్, విజయవాడ డివిజన్, విజయవాడ-520001** కార్యాలయంలో YTSK పథకం గురించి ఏదేని స్పష్టీకరణ అవసరమైనచో ఏదేని పని రోజున కార్యాలయం నుండి పొందవచ్చును.

ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఏదేని దరఖాస్తును అంగీకరించు లేదా తిరస్కరించు హక్కు రైల్వే అడ్మినిస్ట్రేషన్ కలిగియున్నది మరియు ఇందుకు సంబంధించి తదుపరి ఎటువంటి సంప్రదింపులు ఉండవు.

A1200 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఏది నిజం?

తాను చెబుతున్నది నిజమని రాహుల్‌గాంధీ నమ్ముతున్న పక్షంలో అఫిడవిట్‌మీద సంతకంతో లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని, లేదంటే దేశప్రజలను తప్పుదోవపట్టించినందుకు క్షమాపణలు కోరాలని భారత ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. బెంగుళూరులో గురువారం సుదీర్ఘమీడియా సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్రమైనవి. దాదాపు గంటన్నర విడియో ప్రెజెంటేషన్‌లో ఈసీ–బీజేపీ కలసి ఓట్ల చౌర్యానికి పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. ఓటర్ల డిజిటల్ డేటానూ, సీసీటీవీ ఫుటేజ్‌లనూ కాంగ్రెస్‌కు ఇవ్వడానికి ఎన్నికల సంఘం ఎంతోకాలంగా నిరాకరిస్తున్న నేపథ్యంలో, బెంగుళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవ్ పురాను ఈమారు ఆయుధంగా ప్రయోగించారు రాహుల్. ఈ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్ల గోల్‌మాల్ జరిగిందని విశ్లేషించడం ద్వారా కాంగ్రెస్ వెనుకంజకూ, నరేంద్రమోదీ విజయాలకూ ఈ ఓట్ల చౌర్యమే దేశవ్యాప్తంగా పనిచేసిందని ఆయన నిర్ధారించారు. మెషీన్ రీడబుల్ డేటాను ఈసీ ఇవ్వనందున, ఒక్క మహదేవ్‌పుర మాయను వెలుగులోకి తేవడానికే తమకు ఆరునెలలు పట్టిందంటున్నారు ఆయన. ఈ సమావేశంలో తెర మీద ప్రదర్శించిన సమాచారం, దానిపై రాహుల్ చేసిన విశ్లేషణ చూసినవారికి ఆ ఓట్లచౌర్యం ఆరోపణలో అసత్యమేమీలేదన్న భావన కలగడం సహజం. దేశప్రజలంతా రాహుల్ వాదనను నమ్మి నిజమనుకొనే ప్రమాదం ఉన్నందున, ప్రమాణపత్రంతో ఫిర్యాదుచేస్తేనే పరిశీలిస్తానని ఎన్నికల సంఘం చెప్పడం సరికాదు. తాను చెబుతున్నది నిజమని రాహుల్ నమ్ముతున్నారా లేదా అన్నది కాదు, అందులో నిజం ఉన్నదా లేదా నిగ్గుతేలడం దేశ ప్రయోజనాల రీత్యా ముఖ్యం. రాహుల్ చేసిన విశ్లేషణలోనూ, ఆర్నెల్ల పాటు సేకరించిన సమాచారంలోనూ వీసమెత్తు నిజం కానీ, నిజాయితీ కానీ లేదని ఎన్నికల సంఘం నమ్మినపక్షంలో అది కేవలం రాజకీయ కుట్రేనని నిగ్గుతేల్చే కర్తవ్యాన్ని నెత్తినెత్తుకోవాల్సిన కీలకమైన అంశమిది.

నకిలీ ఓటర్లు, తప్పుడు చిరునామాలు, ఒకే చిరునామాలో బల్క్ ఓటర్లు, నకిలీ ఫోటోలు, కొత్త ఓటర్ల నమోదుకు వాడే ఫార్మ్ 6 దుర్వినియోగం వంటి ఐదురకాల విధానాల్లో మహదేవ్‌పురాలో లక్షకుపైగా ఓట్లమోసం జరిగిందని కాంగ్రెస్ అంటోంది. బెంగుళూరు సెంట్రల్ లోక్‌సభస్థానంలోని మిగతా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ ఓడినప్పటికీ, ఆరున్నర లక్షల ఓటర్లున్న మహదేవ్‌పురాలో లక్షా పద్నాలుగువేల ఆధిక్యం సంపాదించడంతో, సదరు పార్లమెంటరీ స్థానాన్ని బీజేపీ 33వేల ఓట్ల మెజారిటీతో గెలవగలిగింది. పాతిక లోక్‌సభ స్థానాలు ఎక్కువ వచ్చినందుకు నరేంద్రమోదీ ప్రధాని అయ్యారని, ముప్పై ఐదువేల ఓట్లకంటే తక్కువ తేడాతో బీజేపీ గెలుచుకున్న లోక్‌సభ స్థానాలు పాతికకుపైనే ఉన్నాయనీ, ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్, విడియో రికార్డులను ఇచ్చిన పక్షంలో, దేశవ్యాప్తంగా ఎన్ని మహదేవ్‌పురాలున్నాయో రుజువు చేస్తామని రాహుల్ సవాల్ చేస్తున్నారు.

నిందలు వేయడం తప్ప, విధానాలను పాటించడం మీద రాహుల్‌కు శ్రద్ధలేదని ఈసీ ఆరోపిస్తోంది. చర్చకు రమ్మన్నా రావడం లేదని ఎన్నికల సంఘం అంటూంటే, మేం అడిగినదానిని ఇవ్వకుండా మాటలతో ప్రయోజనం ఏమిటని కాంగ్రెస్ అంటోంది. డిజిటల్ ఓటర్ల జాబితా, సీసీ ఫుటేజ్ ధ్వంసం ఇత్యాది అంశాలతో రాహుల్ నిరవధికంగా దాడికొనసాగించేందుకు ఎన్నికల సంఘమే అవకాశం ఇస్తోంది. భారత ప్రజాస్వామ్యం అమూల్యమైనది అంటూ హితోపదేశాలు చేసేందుకూ, ఈసీని బీజేపీ తొత్తుగా ఆరోపించేందుకు వీలుకలుగుతోంది. తన విమర్శకు పునాదిగా రాహుల్ వాడిన సమాచారం ఎక్కడినుంచో తెచ్చింది కాదు. ఈసీ అధికారిక డేటానే ఆయన వాడుకున్నారు. లక్షకుపైగా ఓట్లకు సంబంధించిన ఆ డేటా అబద్ధమైన పక్షంలో అదేమాటచెప్పవచ్చు. లేదా పాక్షిక నిజాన్ని పక్షపాతంతో తనకు అనుకూలంగా విశ్లేషించుకున్నారనీ వివరించవచ్చు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికల సంఘాన్ని ఇలా బహిరంగంగా నిందిస్తూ, కుట్రలను ఆపాదిస్తూ, ఎన్నికల ప్రక్రియ మీదే ప్రజల్లో అనుమానాలు పెంచుతున్న రాహుల్‌గాంధీ, తన ఆరోపణలమీద ఫిర్యాదుచేస్తేకానీ పరిష్కారాలు ఉండవని ఈసీ అనడం భావ్యంకాదు.

ట్రంప్ 'వృషభ' వీరంగాలు!

భారత్ ఒకప్పుడు విదేశీ వాణిజ్యానికి సుముఖంగా ఉండేది కాదు. ముఖ్యంగా దిగుమతులను వ్యతిరేకించేది. సహచర అలీనోద్యమ దేశాలతోనైనా, తోటి వర్ధమాన దేశాలతోనైనా అదే వైఖరితో వ్యవహరించేది. వాణిజ్యం, విదేశీ పెట్టుబడుల విషయంలో అన్య దేశాలతో వ్యవహరించడంలో అత్యంత అప్రమత్తంగా ఉండేది. వాణిజ్య భారతావని తలుపులు పూర్తిగా మూసివేశాం. నాలుగు దశాబ్దాల పాటు వాటిని తిరిగి తెరువనే లేదు. పైగా ఎగుమతి దిగుమతులకు భయంకరమైన నిబంధనలు నిర్దేశించాం. అవును, ప్రతి ఎగుమతికీ, ప్రతి దిగుమతికీ లైసెన్సులు, పర్మిట్‌లు తప్పనిసరి. మన దిగుమతులలో అత్యధికం, ఎగుమతులలో కొన్ని ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్ల ద్వారా విధిగా జరుగుతుండేవి. 'చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అనే అధికారి ఒకరు మనకు ఉండేవారు. ఆయన కింద ఒక విస్తృత అధికార గణం ఉండేది. వారు దేశ వ్యాప్తంగా ఉండేవారు. ఈ అధికార గణం చేసే ఏకైక పని దిగుమతులు, ఎగుమతులకు లైసెన్సులు జారీ చేయడమే! అదొక లాభసాటి వ్యవహారం. ఎవరూ ఎప్పుడూ ఒక ప్రశ్న అడిగిన పాపానికి పోలేదు: 'మంచిదే, దిగుమతులను నియంత్రించే అధికారి ఒకరు ఉండడాన్ని అర్థం చేసుకుంటున్నాం, అయితే ఎగుమతులను నియంత్రించే అధికారి ఎందుకు ఉన్నారు?'. ప్రశ్న స్పష్టమే. సమాధానమే లేదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ విధానం ఎగుమతులను పెంపొందించలేదు. ఎగుమతుల ఆధారిత తయారీ పరిశ్రమల రంగాన్ని అభివృద్ధిపరచలేదు. విదేశీ మారకద్రవ్య నిల్వలను సమృద్ధం చేయలేదు. ఇదిలా ఉండగా భారత్‌తో సమస్థాయి ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయ్యే బహిరంగ ఆర్థిక వ్యవస్థ (ఓపెన్ ఎకానమీ)ను అభివృద్ధిపరచుకోవడానికి సంకల్పించాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించి సుసంపన్నమయ్యాయి.

అనేక కారణాల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ 1990–91లో సంక్షోభం అంచుకు చేరింది. ఆర్థిక సంస్కరణలను అమలుపరచడం భారత ప్రభుత్వానికి అనివార్యమయింది. వాణిజ్య, పారిశ్రామిక విధానాలలో మౌలిక మార్పులతో ఆర్థిక క్రమశిక్షణకు అగ్ర ప్రాధాన్యమివ్వడం ద్వారా భారత్ ఆ సంక్షోభం నుంచి గట్టెక్కింది. అభివృద్ధిపథంలోకి ప్రవేశించి వడివడిగా ముందుకు సాగింది. సుంకాలు తగ్గించాం (సగటు సుంకాన్ని 2013లో 12 శాతానికి తీసుకు వచ్చాం), సుంకాలేతర అవరోధాలను తొలగించాం. 'సుంకాలు, వాణిజ్య సాధారణ ఒప్పందం' (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్)పై సంతకం చేసి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ)లో సభ్య దేశంగా చేరాం. వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఆర్థిక వ్యవస్థ అనేది ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉండే బహిరంగ ఆర్థిక వ్యవస్థగా ఉండాలనే యథార్థాన్ని భారతీయులు అంగీకరించారని ఆత్మవిశ్వాసంతో చెప్పగలం.



ఏ దేశమైనా మరొక దేశానికి లోబడినా, మోకరిల్లినా, అనుగ్రహానికి ప్రాకులాడినా ఆ దేశం అనివార్యంగా మట్టికరుస్తుంది, సందేహం లేదు. విదేశీ సంబంధాలలో మొదటి పాఠమిది. డోనాల్డ్ ట్రంప్‌తో దోస్తీ చేయడంలో నరేంద్ర మోదీ ఈ కఠోర రాజనీతిని మరచిపోయారు. అదృష్టవశాత్తు ట్రంప్ తెంపరితనాన్ని మోదీ ప్రతిఘటిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇది నాకూ, ప్రతి భారతీయునికీ చాలా సంతోషకరమైన పరిణామం.

దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే అభివృద్ధి చెందుతున్న దేశాలు బహిరంగ ఆర్థిక వ్యవస్థలుగా మార్పు చెందుతుండగా స్వేచ్ఛా వాణిజ్యానికి ఆద్యులు అయిన అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల 'సంరక్షణ' విధానాలకు మళ్లాయి. ఈ విషయంలో అమెరికా పథ నిర్దేశం చేసింది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో ఆ దేశం ఈ విషయంలో మరింత ముందంజ వేసింది. తాత్కాలిక సంక్షోభాన్ని నివారించేందుకు 'సంరక్షణ' చర్యలు చేపట్టడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే 'సంరక్షణవాదం'ను అధికారిక ఆర్థిక విధానంగా మార్చుకోవడాన్ని ఎలా చూడాలి? భారీ సుంకాలు విధించడమే ట్రంప్ అభిమతం. అందుకు ఆయన ఎవరికీ ఎటువంటి సంజాయిషీ ఇవ్వరు. అపార దర్పక టారిఫేతర చర్యలకు పూర్తిగా అనుకూలుడు. అంతేనా? దిగుమతులను ఆయనెంతగానో నిరుత్సాహపరుస్తున్నారు, పనిగట్టుకుని ప్రతి దేశంతో వాణిజ్య సమతౌల్యతను సాధించేందుకు ఆరాటపడుతున్నారు. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను అమెరికాలోనే నెలకొల్పుకోవాలి, అమెరికాయేతర దేశాలలో వాటిని నిర్వహించకూడదని ఆంక్షలు విధిస్తున్నారు. తన ఆకాంక్షలను తాను విధించే సుంకాలు నెరవేరుస్తాయని ట్రంప్ విశ్వసిస్తున్నారు.

అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను మళ్లీ స్వదేశానికి తీసుకురావాల్సిందేనని ట్రంప్ గట్టిగా వాదిస్తున్నారు. అలా 'దేశభక్తి' చూపని కంపెనీలు అనేక ఆంక్షల నెదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. 'ఇది చేయడం కంటే చెప్పడం తేలిక 'అని హార్వర్డ్ బిజినెస్ రివ్యూ వ్యాఖ్యానించింది, లేదు, నిరసించింది. 'ఒక వస్తువును ఉత్పత్తి చేయడంలో అనేక ప్రక్రియలు ఉంటాయని, వాటన్నిటినీ ఒకే కంపెనీ చేయగలగడం సాంకేతికతలు సంక్లిష్టమైపోయిన ప్రస్తుత కాలంలో అసాధ్యమని, అందుకు అవసరమైన నైపుణ్యాలను ఒకే ఒక్క ప్రదేశంలో సమీకరించడం అంతకంటే అసాధ్యమని' ఆ పత్రిక నిష్కర్షగా చెప్పింది. 21వ శతాబ్ది వస్తూత్పత్తి కార్యకలాపాల సంక్లిష్టతలపై ట్రంప్‌కు ప్రాథమిక అవగాహన కూడా లేదని, ఆయన కాలానికి అనుగుణమైన అధునాతన ఆలోచనలు ఉన్న వ్యక్తి కానేకాదని' అర్థశాస్త్ర విజ్ఞుడు ఒకరు విమర్శించారు.

తన లక్ష్యాల సాధనకు సుంకాలను ఆయుధాలుగా ట్రంప్ ఉపయోగించుకుంటున్నారు. తనతో ఏకీభవించి తన షరతులకు అంగీకరించిన ఆస్ట్రేలియా, ఇండోనేసియా, జపాన్, దక్షిణ కొరియా ప్రయోజనాలకు అనుకూలంగాను, తనతో విభేదించిన కెనడా, ఫ్రాన్స్, బ్రిటన్, బ్రెజిల్ ప్రయోజనాలకు ప్రతికూలంగాను ఆయన నిర్ణయాలు తీసుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు జరిమానాతో సహా భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ట్రంప్ సుంకాలపై ఆవశ్యక చర్యలు చేపడతామని న్యూఢిల్లీ ప్రతిస్పందించింది.


భారత్ లోబడదు, మోకరిల్లదు అనేది స్పష్టం. ధిక్కరించాల్సిన అవసరం కూడా భారత్‌కు లేదు చర్చల ప్రక్రియ ఎంత సుదీర్ఘమూ, బాధాకరమైనా సుంకాలపై సంప్రతింపులకు మనం మన సుముఖతను స్పష్టంగా ప్రకటించాలి. ట్రంప్ తన సుంకాల విధానంపై పునరాలోచన చేసేలా ఆర్థిక సూత్రాలు ఆయనను బలవంతం చేస్తాయి, సందేహం లేదు. అమెరికా ప్రజలు నిత్యం వినియోగించుకునే వందలాది వస్తువులు, సేవలపై అధిక సుంకాలతో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను స్వదేశానికి తీసుకురావడంలో తాత్సారం చేస్తాయి. అమెరికాలో ఉద్యోగాలు పెరగవు. అనివార్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు మందగిస్తుంది. 2026లో కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలు ట్రంప్ దురహంకారానికి మంగళం పాడే అవకాశం ఎంతైనా ఉన్నది.

ఏ దేశమైనా మరొక దేశానికి లోబడినా, మోకరిల్లినా, అనుగ్రహానికి ప్రాకులాడినా ఆ దేశం అనివార్యంగా మట్టికరుస్తుంది, సందేహం లేదు. విదేశీ సంబంధాలలో మొదటి పాఠమిది. డోనాల్డ్ ట్రంప్‌తో దోస్తీ చేయడంలో నరేంద్ర మోదీ ఈ కఠోర రాజనీతిని మరచిపోయారు. అదృష్టవశాత్తు ట్రంప్ తెంపరితనాన్ని మోదీ ప్రతిఘటిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇది నాకూ, ప్రతి భారతీయునికీ చాలా సంతోషకరమైన పరిణామం. భారత్ కొండలా నిలబడుతుంది, తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని వాషింగ్టన్‌కు ఎటువంటి శషభిషలకు తావు లేకుండా న్యూఢిల్లీ స్పష్టం చేయాలి. భారత్ అన్నిటా న్యాయబద్ధంగా ఉంటుంది, న్యాయమైన వాణిజ్యాన్నే చేస్తుంది. పరస్పర లాభదాయకమైన వాణిజ్యానికై సంప్రదింపులు జరిపేందుకు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సంసిద్ధంగా ఉన్నామని అమెరికాకు తెలియజేయాలి. ఎన్ని కష్టనష్టాలు ఎదుర్కోవలసివచ్చినా భారత్ సదా సదరు బాటలోనే సుస్థిరంగా ముందుకు సాగుతుంది. ఇది ప్రతి భారతీయుని మాట, ప్రధాని మోదీ అనుసరించే బాట.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చరితార్థుడైన చరిత్రకారుడు

మహాత్మాగాంధీకి నలుగురు కుమారులు ఉన్నారు. ప్రథమ, ద్వితీయ పుత్రులు హరిలాల్, మణిలాల్‌ను ఆయన వేధించారు. మూడో తనయుడు రామ్‌దాస్ పట్ల ఆదరభావంతో ఉండేవారు. కనిష్ఠ కుమారుడు దేవదాస్ జన్మించే నాటికి బిడ్డల పట్ల మరింతగా ఆప్యాయతానురాగాలు చూపే తండ్రిగా పరిణతి పొందారు. చిన్నారి దేవో తల్లి కస్తూరిబాకు బాగా ప్రేమాస్పదుడైన బిడ్డ. మృదుస్వభావి అయిన దేవదాస్ ఆశ్రమ జీవితంలో బాగా ఒదిగిపోయారు. పెద్దవాడవుతున్న కొద్దీ తండ్రి చెప్పిన పనులన్నీ మారు మాట్లాడకుండా నిర్వర్తించేవారు. నూలు వడికేవారు, దక్షిణ భారతీయులకు హిందీ బోధించేవారు.



ఒక సందర్భంలో మాత్రం తండ్రిని దేవదాస్ ధిక్కరించారు. గాంధీ సన్నిహిత సహచరుడు, రాజాజీగా సుప్రసిద్ధుడైన సి.రాజగోపాలాచారి కుమార్తె లక్ష్మితో దేవదాస్ ప్రేమలో పడ్డారు. వారి ప్రేమను గాంధీ, రాజాజీ ఇరువురూ వ్యతిరేకించారు. బిడ్డల ప్రేమను పరీక్షించేందుకు ఐదు సంవత్సరాల పాటు పరస్పరం మాట్లాడుకోకూడదని, ఉత్తరాలు సైతం రాసుకోకూడదని దేవదాస్, లక్ష్మిలను వారి తండ్రులు ఆదేశించారు. యువ ప్రేమికులు ఐదేళ్ల పాటు తమ తండ్రుల ఆదేశాన్ని ఓర్పుతో పాటించారు. నిషిద్ధ కాలం పూర్తయిన తరువాత వివాహం చేసుకున్నారు. హిందుస్థాన్ టైమ్స్‌లో పాత్రికేయుడుగా దేవదాస్ చేరారు. ఢిల్లీలో దేవదాస్, లక్ష్మి కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఈ నగరంలోనే వారి నలుగురు బిడ్డలు జన్మించారు. 1934లో తార, 1935లో రాజ్‌మోహన్, 1937లో రామచంద్ర, 1945లో గోపాల్ కృష్ణ పుట్టారు.

గాంధీ కుమారుడు రాజాజీ కుమార్తెను వివాహం చేసుకున్న వైనం నా మనసులో చిన్ననాటి నుంచీ నిలిచిపోయింది. దేవదాస్–లక్ష్మి ప్రేమ గాథ భారత దేశ మధ్యతరగతి ప్రజలలో విస్తృతంగా ప్రసిద్ధి పొందింది. వారి ప్రేమాయణం నా తల్లిదండ్రులకు కూడా స్ఫూర్తినిచ్చింది. నా తల్లిదండ్రులు సైతం తమ వివాహానికి ఇరువురి కుటుంబాల అనుమతికై ఐదేళ్లు వేచివున్నారు.

రాజ్, రామచంద్ర ఇరువురూ మహాత్ముడికి మనవళ్లే కాకుండా గాంధీ విద్వజ్జులు. ముఖాముఖి సంభాషణల్లోను, సభల్లో శ్రోతగాను రాము మాటలు వినడం ఒక మేధో నిమగ్న అనుభవం. ఋషితుల్యుడైన భారతీయ దార్శనికుడులా మౌఖిక సంప్రదాయంలో ఆయన వాణి వివేకవంతమైన ఆలోచనలను పురిగొల్పుతుంది. రాజ్‌మోహన్ రచనల్లో అనుభావిక వివరాలు పుష్కలంగా ఉంటాయి. నిశితమైన అభిప్రాయాలు ఉంటాయి. విడివిడిగా, సంయుక్తంగా ఈ సోదరులిరువురూ గాంధీ గురించి, భారతదేశం గురించీ నాకు చాలా విలువైన విషయాలు బోధించారు.

దేవదాస్, లక్ష్మీ గాంధీల సంతానం నలుగురితోను పరిచయం కలగడం, స్నేహ బంధం ఏర్పడడం, నా మేధో వ్యాసంగాలను వారు ప్రభావితం చేయడం నా జీవిత మహద్భాగ్యంగా భావిస్తున్నాను. వీరిలో నాకు తొలుత పరిచయమయింది తాత్త్వికుడు రామచంద్ర గాంధీ. నా మేనమామలు చదివిన సెయింట్ స్టీఫెన్ కళాశాలలోనే ఆయన విద్యాభ్యాసం జరిగింది. అయితే నాకు బాగా పరిచితుడు, సన్నిహితుడు ఆ నలుగురిలో కడగొట్టు వాడయిన గోపాల్‌కృష్ణ. 1980ల్లో మేమిరువురమూ ఢిల్లీలో పనిచేస్తుండగా మా స్నేహం ప్రారంభమయింది. గోపాల్ గృహంలోనే ఆయన అక్క తారతో నేను మొదట సమావేశమయ్యాను. ఖాదీ వ్యవహారాలపై ఆమె సాధికారిక పరిశోధనలు నిర్వహించారు. తల్లిదండ్రుల మాతృభాషలతో పాటు హిందీ, బెంగాలీ, ఇటాలియన్, ఇంగ్లీష్ మొదలైన భాషలలో కూడా ఆమెకు అద్వితీయ పాండిత్యమున్నది. గోపాల్‌కృష్ణే తన పెద్ద సోదరుడు రాజ్‌మోహన్‌ను నాకు పరిచయం చేశారు. ఈ ఆగస్టు 7న రాజ్ 90వ వసంతంలోకి ప్రవేశించారు. ఈ ప్రశంసా వ్యాసానికి ఆయన పుట్టినరోజు ఒక సంతోషకరమైన సాకు.

1990లో నేను మొట్టమొదటసారి రాజ్‌మోహన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన ఒక పార్లమెంటరీ ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయారు. 1989లో అమేథీ లోక్‌సభా నియోజకవర్గంలో ప్రధానమంత్రి రాజీవ్ గాంధీపై ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా రాజ్‌మోహన్ పోటీ చేశారు. ఆ ఎన్నిక అస్లీ గాంధీ, నక్లీ గాంధీ మధ్య పోటీగా దేశవ్యాప్తంగా సుప్రసిద్ధమయింది. రాజ్‌మోహన్ మహాత్ముడికి స్వయాన మనవడు. రాజీవ్‌కు గాంధీ పేరు యాదృచ్ఛికంగా వచ్చింది (పార్సీ మతస్థుడు అయిన రాజీవ్ తండ్రి ఫిరోజ్‌గాంధీ పేరును వాస్తవంగా 'ఘాండీ' అని ఉచ్చరిస్తారు). సమున్నత నైతిక, మేధో వ్యక్తి వ్యక్తిత్వమున్న రాజ్‌మోహన్‌కు సిరిసంపదలు లేవు. సహజంగానే నెహ్రూ కుటుంబానికి కంచుకోట అయిన అమేథీలో ఆయన పరాజయం పాలయ్యారు. అయితే ఆ సార్వత్రిక ఎన్నికల్లో రాజీవ్ పార్టీ ఓడిపోయింది. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రధానమంత్రి అయ్యారు. రాజీవ్‌కు గట్టి పోటీనిచ్చినందుకుగాను రాజ్‌మోహన్‌కు రాజ్యసభ సభ్యత్వం లభించింది.

చూపరులను ఇట్టే ఆకట్టుకునే వ్యక్తి రాజ్‌మోహన్. చాలా నెమ్మదిగా, మృదువుగా జాగ్రత్తగా మాట్లాడతారు. అయితే సోదరుడు రామచంద్రకు ఉన్న వాగ్ధాటి ఆయనకు లేదు. తమ్ముడిలోని కొంటె హాస్యమూ అన్నలో తక్కువే. రాజ్‌మోహన్‌తో పరిచయమైన వెంటనే ఆయనలో అపారమైన ప్రభావశీలత ఉన్నదని నాకు అర్థమయింది. అప్పటికే నేను ఆయన రాసిన రాజాజీ, పటేల్‌ల జీవిత చరిత్రలు చదివాను. వాటి మేధో నైశిత్యం, నిష్పాక్షికత నన్ను ప్రగాఢంగా ప్రభావితం చేశాయి. రాజ్‌మోహన్ తొలుత 'హిమ్మత్' అనే మ్యాగజైన్‌కు ఎడిటర్‌గా ఉండేవారు. ఉదారవాద విలువలను నిర్భయంగా సమర్థించేవారు. ఎమర్జెన్సీలో అనేక ఒత్తిళ్లకు తట్టుకుని నిలబడిన ఆ పత్రిక ఆ తరవాత ఆర్థికవనరుల కొరతతో మూతపడింది. తదనంతర కాలంలో ప్రధానస్రవంతి మీడియాలో సుప్రసిద్ధులు అయిన పాత్రికేయులు, రచయితలు తొలుత రాజ్‌మోహన్ మార్గదర్శకత్వంలోనే శిక్షణ పొందారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

రాజ్‌మోహన్‌కు నన్ను గోపాల్ పరిచయం చేసిన తరువాత నేను నేరుగా ఆయనను కలిసి మాటామంతీ జరపడం ప్రారంభించాను. రాజ్‌తో ప్రతి సమావేశమూ మన దేశ చరిత్రపై నాకు కొత్త అంతర్ దృష్టులను సమకూర్చింది. ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమంపై నా పరిజ్ఞానాన్ని ప్రగాఢమూ విస్తృతమూ చేసింది. భారత్ ప్రజాస్వామ్య, బహుళత్వ భవిష్యత్తు గురించి మేము కలతచెందేవాళ్లం. అనేక సంవత్సరాలుగా నేను ఆయనతో ఢిల్లీ, బెంగళూరు, పంచగని, ఈస్ట్ లాన్సింగ్ (మిషిగాన్)లో వివిధ విషయాలపై విస్తృతంగా సంభాషణలు జరుపుతున్నాను. రాజ్ పుస్తకాలు, వ్యాసాలు శ్రద్ధగా చదువుతున్నాను. అవి నాలో కొత్త ఆలోచనలను పురిగొల్పాయి. ఇన్ని సంవత్సరాల మా స్నేహంలో నేను ఆయనతో ఒకే ఒక్కసారి విభేదించాను. ఇప్పుడు దాని గురించి ప్రస్తావించనవసరంలేని చాలా చిన్న విషయమది.

మహాత్మాగాంధీ కంటే జవహర్‌లాల్ నెహ్రూను అమితంగా అభిమానించే కుటుంబంలో నేను పెరిగాను. భారతీయ పర్యావరణవాదంపై యువ పరిశోధకుడుగా నెహ్రూ పట్ల ఒక నిర్దిష్ట విమర్శనాత్మక దృక్పథం నాలో ఏర్పడింది. ఆయన ప్రభుత్వం అనుసరించిన ఆర్థికాభివృద్ధి నమూనా దేశ పర్యావరణ సుస్థిరతకు హానికరంగా పరిణమించడమే నెహ్రూపై నా వైఖరిని ప్రభావితం చేసింది. పర్యావరణవాదులు అయిన ఆ నాటి నా స్నేహితులు పలువురు మన మొదటి ప్రధానమంత్రిని తీవ్రంగా విమర్శిస్తుండేవారు. రాజ్‌మోహన్ ప్రభావం లేకపోతే నేనూ వారితో ఏకీభవించి ఉండేవాడినేమో? ఆర్థిక విధానం విషయమై గాంధీతో నెహ్రూ మౌలికంగా విభేదించినప్పటికీ మహాత్ముడికి న్యాయసమ్మతమైన వారసుడు నెహ్రూనే అని రాజ్‌మోహన్ తన పుస్తకం 'The Good Boatman'లో సహేతుకంగా వాదించారు. మహాత్ముని అనుయాయులు అందరిలోనూ నెహ్రూ మాత్రమే గాంధీ సమ్మిళిత దృక్పథాన్ని బాగా అర్థం చేసుకుని అమలుపరిచారని రాజ్ పేర్కొన్నారు. మహాత్ముడి వలే నెహ్రూ కూడా ముస్లింల విశ్వాసం పొందిన హిందువు, స్త్రీలకు సమానహక్కుల కోసం పోరాడిన నాయకుడు, దక్షిణ భారతావనిలో సమస్త ప్రజల గౌరవాదరాలను పొందిన ఉత్తర భారతావని నాయకుడు. నెహ్రూకు ఉన్న ఇటువంటి విశిష్టత మహాత్ముని ఇతర ఆంతరంగికుల– రాజాజీ, మౌలానా ఆజాద్, రాజేంద్ర ప్రసాద్, కృపలానీ, సర్దార్ పటేల్ –లో ఎవరికీ లేదు. అరుదైన నైతిక, రాజకీయ లక్షణాలు మూర్తీభవించిన నేత నెహ్రూ మాత్రమే. గాంధీ హత్యతో హతాశులైన నెహ్రూ, పటేల్‌లు తమ వ్యక్తిగత, తాత్త్విక దృక్పథాలలో విభేదాలను విస్మరించి భారత్ ఏకీకరణకు, భారతీయుల సమైక్యతకు ఎలా కృషిచేశారో రాజ్‌మోహన్ తన పుస్తకంలో విపులంగా వివరించారు.

రాజ్‌మోహన్, రామచంద్రగాంధీ ఇరువురూ మహాత్ముడికి మనవళ్లే కాకుండా గాంధీ విద్వజ్జులు. ముఖాముఖి సంభాషణల్లోను, సభల్లో శ్రోతగాను రాము మాటలు వినడం ఒక మేధో నిమగ్న అనుభవం. ఋషితుల్యుడైన భారతీయ దార్శనికుడులా మౌఖిక సంప్రదాయంలో ఆయన వాణి వివేకవంతమైన ఆలోచనలను పురిగొల్పుతుంది. ఆయన సోదరుడు రాజ్‌మోహన్ రచనల్లో ఎటువంటి హాస్యోక్తులూ ఉండవు. అయితే అనుభావిక వివరాలు పుష్కలంగా ఉంటాయి. నిశితమైన అభిప్రాయాలు ఉంటాయి. విడివిడిగాను, సంయుక్తంగానూ ఈ సోదరులిరువురూ గాంధీ గురించి, భారతదేశం గురించీ నాకు చాలా విలువైన విషయాలు బోధించారు.

చివరగా రాజ్‌మోహన్‌కు సంబంధించిన, బహుశా, ఆయనకూ తెలియని ఒక చిన్న విలువైన విషయంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. భారతదేశ ఆదివాసులపై సాధికారిక పరిశోధనలు జరిపిన మానవ శాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ వ్యక్తిగత పత్రాల నుంచి నేను ఆ విషయాన్ని తెలుసుకున్నాను. భారతీయ పౌరసత్వం స్వీకరించిన ఈ ఆంగ్లేయ విద్వజ్జుడు గాంధీ, నెహ్రూలకు కూడా బాగా సుపరిచితుడు. నేను తొలుతనే పేర్కొన్నట్లు రాజ్‌మోహన్ తల్లిదండ్రులు వివాహం చేసుకునేందుకు తమ పెద్దల అనుమతికి సుదీర్ఘ కాలం వేచి ఉన్నారు. దేవదాస్, లక్ష్మిల వివాహం జూన్ 1933లో పూణేలో జరిగింది. అప్పట్లో గాంధీ, కాంగ్రెస్‌లు మరో దేశవ్యాప్త సత్యాగ్రహోద్యమానికి సమాయత్తమవుతున్నారన్న విషయమై వార్తలు వెలువడుతుండేవి. ఆ సందర్భంలో పూణేలో గాంధీ అనుయాయుల బృందం నొకదానితో సమావేశమైన ఎల్విన్, వారెవరూ మరొకసారి జైలుకు వెళ్లేందుకు సంసిద్ధంగా లేరన్న విషయాన్ని గ్రహించాడు. 'ఆ బృందంలో చాలా సంతోషంగా ఉన్నది దేవదాస్, సౌందర్యవతి అయిన ఆయన భార్య లక్ష్మి మాత్రమే. ఆనందోత్సాహాలలో ఉన్న ఆ దంపతులు జైలుకు వెళ్లకూడదనే దృఢ నిశ్చయంతో ఉన్నారు' అని తన స్నేహితుడు ఒకరికి రాసిన లేఖలో ఎల్విన్ పేర్కొన్నాడు. అంతిమంగా ప్రతిపాదిత సత్యాగ్రహం ప్రారంభమవలేదు. జైలుకు వెళ్లాలని దేవదాస్‌ను ఆయన తండ్రి ఆదేశించలేదు. దేవదాస్, లక్ష్మి ఢిల్లీకి వెళ్లి తమ సంసార జీవితాన్ని ప్రారంభించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అనేక విధాలుగా ప్రశస్త ప్రతిభావంతులు అయిన నలుగురు బిడ్డలకు జన్మనిచ్చి, వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

తెలుగుజాతి వెలుగు రేఖ.. తుర్లపాటి

'అందరినీ ప్రేమించు! అందరినీ పలకరించు! మరల ఈ దారిన వస్తానో, రానో!' రాము, రాబోము. ఈ మహత్తర మానవ జీవిత సందేశాన్ని పాటించడమే మానవ జీవిత ప్రస్థానానికి సాఫల్యం. చివరగా ఒక మాట. నేను ఎప్పుడూ చేప్పే మాటే. 'జాతి, మత, కుల, వర్ణ, వర్గ, స్త్రీ, పురుష విభేదాలకు అతీతమైన, మానవుడు మానవునిపట్ల మానవుడుగా వ్యవహరించే మానవీయ వ్యవస్థ మన లక్ష్యం కావాలి' అని పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు తన 'నా కలం–నా గళం' ఆటో బయోగ్రఫీలో రాసుకున్నారు.

మహాత్మాగాంధీ ఆటోగ్రాఫ్ సంపాదించిన తుంటరి తుర్లపాటి... ఐరన్ లేడీ ఇందిరాగాంధీ ఇంటికొచ్చి పరామర్శించేంత గొప్ప వ్యక్తిత్వం... మా జాతిపితకు నోబెల్ ఎందుకివ్వరు అంటూ నిర్వాహకుల్ని నిలదీసిన తెగువ... ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి, ఆంధ్రకేసరి త్యాగాలను రికార్డు చేసిన కలం... మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, రాజాజీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపిన మహా మేధావి.. బిల్ క్లింటన్‌నూ భారతదేశానికి ఉత్తరం ద్వారా రప్పించిన జనహితుడు.

ఉత్తరాలతోనూ ఉద్యమాలను నడిపించిన సత్తా.. నిరసన తెలిపిన చాతుర్యం సొంతం చేసుకున్న తుర్లపాటి కుటుంబరావు తాను నడిచిన దారి నిండా మంచితనం, మానవత్వం మొక్కలు నాటుకుంటూ మహావృక్షాలుగా చేసి వార్తలలో వ్యక్తిగా.. బహుముఖ ప్రజ్ఞాశక్తిగా శాశ్వతత్వం సాధించారు. కలకాలం నిలిచే ఆయన కలం.. తెలుగు భాష ఉన్నంతవరకూ ప్రతిధ్వనించే ఆయన గళం ఒక చరిత్ర. ఏడు దశాబ్దాల పాటు నిర్విరామంగా పాత్రికేయునిగా కొనసాగిన తుర్లపాటి కుటుంబరావు తెలుగుజాతి వెలుగు రేఖ. 14 ఏళ్లకే రచనా వ్యాసంగంలోకి వచ్చి పాత్రికేయుడైన తుర్లపాటి కుటుంబరావు 1933 ఆగస్టు 10న సుందర రామారావు, శేషమాంబ దంపతులకు విజయవాడలో జన్మించారు. విద్యాభ్యాసం గన్నవరం, విజయవాడలలో కొనసాగించారు. నార్ల వేంకటేశ్వరరావు గారికి ఏకలవ్య శిష్యుడు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి 'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు వద్ద కార్యదర్శిగా పనిచేశారు.

తుర్లపాటి వంటి ఘనాపాఠీని పరిచయం చేయడానికి భారీ కాన్వాస్ అవసరం. తెలుగు నేలపైనే కాదు, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అరుదైన వ్యక్తి.. ఒక దేశ ప్రధాని కుటుంబంతో నాలుగుతరాలుగా అనుబంధం కొనసాగడం అంటే మాటలా? జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ ఇలా నాలుగు తరాలు మారినా తరగని స్నేహబంధం ఏర్పడింది. ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ఇప్పటి మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర నుంచి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వరకు, ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు నుంచి నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వరకూ 20 మంది ముఖ్యమంత్రులకు తలలో నాలుకలా వ్యవహరించినా, ఏ రాజకీయ పార్టీకి చెందని అజాతశత్రువు.

పద్మశ్రీ అందుకున్న తొలి తెలుగు పాత్రికేయ శిఖరం తుర్లపాటి కుటుంబరావు. పాత్రికేయుడిగా, అనువాదకుడిగా, జీవిత చరిత్రల రచయితగా, ఉపన్యాసకుడిగా ఏ బాధ్యతనైనా ఆయన మాత్రమే నిర్వర్తించగలరు అన్న బలమైన ముద్ర వేసుకోగలిగారు.



నాటి ప్రధానమంత్రులు.. కేంద్రంలో కీలక నేతలైన ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్, రాజీవ్‌గాంధీ, జగ్జీవన్‌రామ్ లాంటి ఉద్దండుల ఇంగ్లీష్ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించే ఒకే ఒక తెలుగు గళం తుర్లపాటి. ఒకసారి వేదిక ఎక్కి మాట్లాడితే మురిసిపోతాం.. స్వాతంత్ర్యం రాక ముందు నుంచీ, స్వర్ణోత్సవ కాలం ముందు వరకూ 20 వేల ఉపన్యాసాలు ఇచ్చిన 'ఉపన్యాస కేసరి' గురించి కొత్తగా మనం ఏం ఉపన్యసించగలం? 'వార్తల్లోని వ్యక్తి' అనే శీర్షికను తొలుత ఆంధ్రజ్యోతిలో తర్వాత వార్త దినపత్రికలో మొత్తం దాదాపు 50 సంవత్సరాలు కొనసాగించి రికార్డ్ నెలకొల్పారు. ఈ శీర్షిక ద్వారా వికీపీడియాను మించిన కచ్చితమైన సమాచారాన్ని అందించిన 'వార్తల్లోని వ్యక్తి' కుటుంబరావు. దాదాపు 6,000 మంది జీవితచరిత్రలు రాసి, చరిత్ర సృష్టించిన ఆటోబయోగ్రఫీస్ స్పెషలిస్ట్ మన తుర్లపాటి.

పద్మశ్రీ అందుకున్న తొలి తెలుగు పాత్రికేయ ఎవరెస్ట్ శిఖరం కుటుంబరావు.. చివరికి సొంతిల్లు కూడా లేదు. మంచితనం, మానవత్వం, నిజాయితీ, నిబద్ధత.. వీటినే ఆయన తరతరాలకు తరగని ఆస్తిగా మురిసిపోయేవారు. పాత్రికేయుడిగా, అనువాదకుడిగా, జీవిత చరిత్రలు రచించిన రచయితగా, ఉపన్యాసకుడిగా, రాజకీయ నేతలకు కార్యదర్శిగా ఏ బాధ్యతనైనా తుర్లపాటి కుటుంబరావు మాత్రమే నిర్వర్తించగలరు అన్న బలమైన ముద్ర వేసుకోగలిగారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ కుటుంబంలో తుర్లపాటి ఇంటిపెద్ద వంటి వారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్‌ను స్థాపించి నటీనటులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేవారు. ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం 'నంది' అవార్డులు ప్రవేశపెట్టటానికి కుటుంబరావు ఇచ్చిన అవార్డులే ప్రేరణ. అక్కినేని నాగేశ్వరరావుకి 1957లో 'నటసామ్రాట్' బిరుదుని, హీరో కృష్ణకి 'సూపర్ స్టార్' బిరుదుని ఇచ్చింది కుటుంబరావే. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా, నంది అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా, 'జ్యోతిచిత్ర' ఎడిటర్‌గా, నేషనల్ ఫిల్మ్ అడ్వైజర్‌గా వివిధ హోదాలలో పనిచేశారు.


తుర్లపాటి బహుముఖ ప్రతిభకు 'ఉపన్యాస కేసరి', 'దశ సహస్ర సభా కేసరి' అనే బిరుదులు; ఆంధ్రా యూనివర్సిటీ వారి 'కళా ప్రపూర్ణ', తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్' అవార్డ్, ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్, అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా 'ఇంటర్నేషనల్ మాన్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు వరించాయి. 2002లో అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' అందుకున్న ఏకైక తెలుగు జర్నలిస్ట్ తుర్లపాటి కుటుంబరావు కలం నుంచి జాలువారిన రచనలు కలకాలం నిలిచే ఉంటాయి. ఆయన గళం తెలుగు భాష ఉన్నంతవరకూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆయనకు జననమే కానీ మరణం లేదు.

తుర్లపాటి జీవించు ప్రజల నాలుకల యందు.. తుర్లపాటి కుటుంబరావు జీవితచరిత్ర భావితరాలకు అందేలా పునర్ముద్రించాలని, ఆయన పేరుతో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు ఇవ్వాలని ఒక జర్నలిస్టుగా ఆయన జయంతి సందర్భంగా ప్రభుత్వాన్ని వినమ్రంగా కోరుతున్నాను.

■ చల్లా మధుసూదనరావు
జర్నలిస్ట్

(రేపు తుర్లపాటి కుటుంబరావు జయంతి)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
శనివారం 9 ఆగస్టు 2025





మయూరం అవతారంలో కాకాని భ్రమరాంబదేవి



● గుంటూరు అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహిళల కుంకుమ పూజ

వరలక్ష్మీ వ్రతాలు.. పూజలు

శ్రావణ మాసం మూడో శుక్రవారం రోజు మహిళలు వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. వ్రతాలు.. పూజలతో వాడవాడ లా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాలు, ఇళ్లల్లో కూడా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వహించిన శ్రావణమాస పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



8

కాల గర్భంలోకి.. శంకర్ విలాస్ ఆర్వోబీ

- అర్ధరాత్రి నుంచి కూల్చివేత ప్రారంభం
- ఆరు దశాబ్దాలకు పైగా నగర వాసులకు సేవలు

అంతన్నారు.. ఇంతేనా?

చివరి ఆకు వరకు కొంటాం.. ఎవరూ ఆందోళన చెందొద్దు.. అధైర్య పడొద్దు.. అని పాలకుల హామీతో పొగాకు రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామన్న ప్రభుత్వ తాజా ప్రకటనతో అయోమయం.. ఇంతలోనే 30 క్వింటాళ్లు తీసుకు రమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మార్క్‌ఫెడ్ నుంచి మెసేజ్‌లతో రైతుల్లో గందరగోళం. మొత్తం మీద పొగాకు కొనుగోళ్లకు సంబంధించి అసలు ఎంత పరిమాణంలో కేంద్రా లకు తీసుకు వెళ్లాలో అర్థం కాక రైతులు కలవరం చెందుతున్నారు. ఫోన్లకు వచ్చిన మెసేజ్ ప్రకారం కేంద్రాలకు పొగాకు తీసుకెళ్తే అక్కడ కొనుగోలు చేయకపోవడంతో మళ్లీ ఇళ్లకు తీసుకువచ్చేందుకు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అదనుగా తీసుకున్న కంపెనీలు తాము చెప్పిందే రేటుగా చెలరేగి పోతున్నాయి. ఈ గందరగోళంతో ప్రభుత్వంపై తొలుత వచ్చిన సానుకూలత.. జరుగుతున్న పరిణామాలతో కొంతవ్యతిరేకతగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.



బాపట్ల కొనుగోలు కేంద్రం వద్ద పొగాకు బేళ్లతో బారులు తీరిన ట్రాక్టర్లు (పాత చిత్రం)

- పరిమితి ప్రకటనతో రైతుల్లో అసహనం
- రైతులకు వస్తోన్న మెసేజ్‌లపైనా అస్పష్టతే
- 20 క్వింటాళ్ల నిర్ణయం కంపెనీలకు వరమయ్యేనా?

(గుంటూరు, ప్రత్తిపాడు ఆంధ్రజ్యోతి)

చివరి ఆకువరకు కొంటానని చెప్పి ప్రభుత్వం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లను ప్రారంభించింది. నాలుగు జిల్లాల పరిధిలో మార్క్‌ఫెడ్ ఇప్పటికే 11,100 మెట్రిక్ టన్నుల బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. అయితే అంతా సవ్యంగా సాగిపోతోంది అనుకునేంతలో ఒక్కో రైతు దగ్గర 20 క్వింటాళ్లే కొంటామంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పొగాకు రైతులను కలవరపెడుతోంది. మిగిలిన పొగాకును కంపెనీల చేత కొనే ఏర్పాటు చేయిస్తామనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అయితే అధికారులు మాత్రం 30 క్వింటాళ్లు తీసుకురమ్మంటూ రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో 30 క్వింటాళ్లతో కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటున్న రైతులు మిగిలిన పది క్వింటాళ్లను తిరిగి తీసుకెళ్లాల్సి వస్తోంది. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తాజాగా పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు ప్రకటించారు. కానీ ఈ విషయంలో రైతుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది.

> మీ పొగాకు పంట మద్దతు ధర (HDR 120 Rs /కే జి, HDM 90 Rs /కే జి , HDX 60Rs /కే జి) తో కొనుగోలు కేంద్రం వారు BAPATLA (జిల్లా), KARAMCHEDU (మ) ,JARUBULAVARIPALEM , ADIPUDI PACS కొనుగోలు కేంద్రం వారు రైతు సేవా కేంద్రం వద్ద 05-AUG-2025నాడు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయదరు. మీ నమోదు సంఖ్య: CM21846066. మీ కొనుగోలు పరిమితి : 30 క్వింటాల్ వరకు. ధన్యవాదాలు. -GOVTAP
>
> 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు పరిమితి అని ఓ రైతు సెల్‌కు వచ్చిన మెసేజ్

సమన్వయం.. సన్నద్ధత లోపాలు

ఆయా విభాగాల మధ్య సమన్వయ లోపంతో పాటు కొనుగోళ్లపై ముందస్తు సన్నద్ధతలో లోటుపాట్లు బర్లీ రైతులను కలవరపెడు తున్నాయి. రైతుల వద్ద (మిగతా 6వ పేజీలో)

వ్యూహాత్మకంగా కంపెనీలు..

పొగాకు కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే సమాంతరంగా అంతోఇంతో కంపెనీలు కూడా దాదాపు అదే ధరకు బర్లీని కొంటూనే వస్తున్నాయి. కానీ ప్రభుత్వం తీసుకున్న పరిమితి నిర్ణయంతో మార్కెట్ నుంచి తాత్కాలికంగా వారు వైదొలిగారనేది సమాచారం. మార్క్‌ఫెడ్ కొనగా మిగిలింది కంపెనీల చేత కొనుగోలు చేయిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యే కదా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. మళ్లీ అవే మాటలు ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు విశ్వసించడంలేదు. పరిమితి నిర్ణయం కంపెనీలకు వరంలా మారే అవకాశం ఉందనేది ట్రేడ్‌వర్గాల అంచనా.

స్వాతంత్ర్య వేడుకలకు సన్నాహాలు

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు పోలీసు శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించి పోలీస్ పరేడ్ మైదానంలో చేయాల్సిన ఏర్పాట్లను ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ బలగాలు నిర్వహించే కవాతు ప్రదేశాన్ని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులకు, ఔత్సాహికుల గ్యాలరీలు, ఆయా శాఖలకు చెందిన ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు అరవింద్, ఏడుకొండల రెడ్డి, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చినరావూరుపై చిన్నచూపు

- రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు నాస్తి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రైల్వేస్టేషన్



చినరావూరు రైల్వే స్టేషన్‌కి వెళ్లే దారిలో దట్టంగా పెరిగిన పిచ్చి చెట్లు



మరుగుదొడ్లకి తాళం



అలంకారప్రాయంగా కుళాయిలు

తెనాలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెనాలి-రేపల్లె మార్గంలో కీలకమైన రైల్వేస్టేషన్ చినరావూరు. అయితే ఆ పేరును సార్థకం చేస్తూ రైల్వే అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. తెనాలి పట్టణంలో బాగంగా ఉండే చినరావూరు స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం లో తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. తెనాలి, చుట్టు పక్కల గ్రామాల నుంచి రేపల్లె వెళ్లేవారు, వేమూరు, భట్టిప్రోలు, రేపల్లె నుంచి నిజాంపట్నం వరకు వెళ్లి ఉద్యోగ విధులు నిర్వర్తించే వారు ఈ స్టేషన్ నుంచే నిత్యం రైలు ప్రయాణం చేస్తుంటారు. ఇంత రద్దీ ఉండే స్టేషన్‌లో రైలు ఎక్కిదిగడానికి మినహా మరే ఇతర వసతులూ లేవంటే ఆశ్చర్యం కాదు. పిచ్చి చెట్లు, ముళ్ల కంపలు, చెత్త కుప్పలతో ప్రయాణికులకు స్వాగతం పలుకుతాయి. ఇటీవల పెనుగాలులకు స్టేషన్ ఆవరణలోని భారీ వృక్షాల నుంచి కొమ్మలు విరిగిపడితే వాటిని తొలగించే నాథుడులేక అవి ప్లాట్‌ఫారంపై ఎండిన మోళ్లుగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికులు తాగడానికి గుక్కెడు నీరు కూడా దొరకదు. అరాచక మూకలు కుళాయిలను ధ్వంసం చేయగా అధికారులు వాటిని అలాగే వదిలేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉపయోగంలోనే లేవు. మూత్రశాలల్లోనూ కుళాయిలు పీకేసుకుపోగా, మరుగుదొడ్డికి రైల్వే సిబ్బంది తాళాలు వేసుకున్నారు. మహిళా ప్రయాణికులు అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నారు. ప్లాట్‌ఫారం పగిలిపోయి, గడ్డి దుబ్బులు, పిచ్చి మొక్కలకు నిలయంగా ఉంది. తెనాలి పట్టణానికి శివారులో చినరావూరు రైల్వేస్టేషన్ ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలు వినియోగించే వారికి అడ్డాగా మారింది. రాత్రిళ్లు మత్తుగ్యాంగ్‌లకు ఆవాసంగా మారింది. తెనాలి రైల్వే స్టేషన్‌కు దగ్గర్లోనే ఈ స్టేషన్ ఉన్నా రైల్వే పోలీసులు కన్నేస్తున్న పరిస్థితి లేదు. మత్తు తలకెక్కిన వారు ఘర్షణలతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తుంటారు. మద్యం సీసాలను స్టేషన్ సమీపంలోని ఇళ్లపైకి విసురుతున్నారని యజమానులు వాపోతున్నారు.

అటెళ్తున్నారా.. జాగ్రత్త

- మృత్యుకుహరంలా మూడు వంతెనల మార్గం
- వర్షం వస్తే ముంపు.. ప్రమాదకరంగా డ్రెయినేజి





ప్రమాదకరంగా మూడు వంతెనల మార్గంలోని డ్రెయిన్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అసలే రద్దీ.. ఇటీవలే రూ.లక్షలు వెచ్చించి విస్తరించారు.. అయినా మూడు వంతెనెల మార్గం మృత్యుకుహరంలా మారింది. వర్షం వస్తే ఇక్కడ కాల్వ ఏదో రోడ్డు ఏదో తెలియక పాదచారులు, బైకర్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక శంకర్‌విలాస్ బ్రిడ్జి కూల్చివేతతో శనివారం నుంచి మూడు వంతెనల మార్గంలో మరింత రద్దీగా మారనున్నది. ఈ పరిస్థితుల్లో పాదచారులు, బైకర్లు ఏ మాత్రం ఆదమరిచి రాకపోకలు సాగిస్తే కాల్వలో కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జాగ్రత్తగా రాకపోకలు సాగించాలని పలువురు సూచిస్తున్నారు. ఇటీవల వంతెన విస్తరణ సమయంలో చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేసిన పనులు వర్షాల సమయంలో ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ప్రాణాంతకంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే మూడువంతెనల సెంటర్‌పై వరద నీరు ముంచెత్తి డ్రెయిను పొంగి పొర్లుతుంటుంది. ఆ సమయంలో రైల్వే ట్రాక్ కింద ఉండే అండర్ పాస్‌లో దాదాపు మూడు అడుగులు మేర నీరు ప్రవహిస్తుంది. వర్షాల సమయంలో ఓపెన్‌గా వదిలేసిన డ్రెయిన్, రోడ్డు తెలియక పలువురు ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. డ్రెయిన్ మృత్యు కుహరంలా తెరుచుకుని ఉన్నా, ప్రాణాలను హరించే స్థాయిలో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులుమాత్రం పట్టీపట్టనట్లు వదిలేశారు.

రైళ్లు కిటకిట

- వరుస సెలవులతో వెయిటింగ్ లిస్టులు
- ఈ వారం, వచ్చే వారంలో మూడు రోజులు సెలవులు



టికెట్లు లేవని చూపిస్తున్న రైల్వే యాప్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండు వారాలు.. అది కూడా వారాంతంలో మూడేసి రోజులు చొప్పున సెలవుదినాలు రావడంతో గుంటూరు రైల్వే జంక్షన్ మీదగా రాకపోకలు సాగించే రైళ్లన్నీ కిక్కిరిసిపోతోన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఈసారి వరలక్ష్మీ వ్రతానికి కూడా సెలవు ఇచ్చింది. దీంతో ఈ వారంలో మూడు సెలవుదినాలు వరుసగా వచ్చాయి. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, రెండో శనివారం, ఆదివారం వరసగా సెలవులు వచ్చాయి. అలానే వచ్చే వారం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న కృష్ణాష్టమి, 17న ఆదివారం సెలవులు ఉన్నాయి. దీంతో సొంత ఊళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లి సరదాగా గడిపి వచ్చేందుకు చాలామంది ఇప్పటికే ప్రయాణం కాగా కొంతమంది వచ్చే వారం ప్రణాళిక రూపొందించుకున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు, అటు నుంచి గుంటూరుకు రద్దీ అధికంగా ఉంటున్నది. అలానే బెంగళూరు, చెన్నైలకు కూడా రద్దీ ఎక్కువగానే ఉంటోన్నది. డిమాండ్ అధికంగా ఉండటంతో రెగ్యులర్ రైళ్లలో కూడా చాలావరకు నోరూం డిస్‌ప్లే వచ్చేసింది. కొన్ని రైళ్లలో వెయిటింగ్ లిస్టులో టిక్కెట్లు బుకింగ్ అవుతున్నా అవి 150కి పైగా ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే అదనపు బోగీని జత చేసినా టిక్కెట్లు కన్‌ఫర్మ్ కావు.

పెళ్లి ప్రయాణాలు మొదలు..

ప్రస్తుతం నిశ్చయ తాంబూలాలు, లగ్నపత్రిక రాసుకోవడం, వివాహ శుభకార్యాలు, రిసెప్షన్లు కూడా పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. దీంతో హైదరాబాద్‌కు రాకపోకలు బాగా పెరిగాయి. కాగా ఎల్‌హెచ్‌బీ బోగీలుగా చాలా రైళ్లు మారిపోయాయి. దాంతో వాటిల్లో స్లీపర్‌క్లాస్ కోచ్‌ల సంఖ్య తగ్గి సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు పెరిగాయి. ఈ కారణంగా స్లీపర్ క్లాస్ బోగీలలో బెర్తులు తగ్గడంతో కనీసం వెయిటింగ్ లిస్టులో కూడా టిక్కెట్లు లభించడం లేదు. కొన్ని ప్రత్యేక రైళ్లు గుంటూరు మీదగా నరసపూర్, కాకినాడ టౌన్‌లకు నడుపుతున్నా వాటిల్లోనూ హాట్‌కేక్‌లు మాదిరిగా టిక్కెట్లు బుకింగ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాయంత్రం వేళ మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కలవరపెడుతున్న సుంకం

- సందిగ్ధంలో ఆక్వా రైతులు
- అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన
- చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు

నచ్చిన లైటింగ్‌కు లైక్ కొట్టండి!

- సీఆర్‌డీఏ ప్రాజెక్టు భవనం లైటింగ్ డిజైన్‌పై ఓటింగ్
- వెబ్‌సైట్‌లో రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలు

నకిలీ యజమానిని ఫొటో పట్టిచ్చేస్తుంది..

- రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్
- స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

8

పోలీసుల పేరు చెప్పి... రూ.50 వేలు ఫోన్ పే చేయించుకున్నారు!

- సైబ్ నేరగాళ్ల టోకరా

6

అంతన్నారు..ఇంతేనా?

(5వ పేజీ తరువాయి)

పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని తెలిసినా అందుకు తగ్గట్లు గిడ్డంగుల లభ్యత ఉందో లేదో తెలుసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లలో కొనుగోలు చేసిన బర్లీ నిల్వలను మార్క్‌ఫెడ్ ఉంచింది. ఇంకా రైతుల వద్ద దాదాపు లక్ష క్వింటాళ్ల వరకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. ఇప్పుడు గోడౌన్లను వెదకడం యంత్రాంగానికి సవాల్‌గా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో అయితే తేదీ మారే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ఉండేందుకే స్లాట్ సిస్టమ్ అని చెప్పిన మార్క్‌ఫెడ్ ఇప్పుడు చేతులెత్తేయడం కూడా రైతుల విమర్శలకు కారణమైంది. రెండే గ్రేడ్లు అని ముందు చెప్పిన మార్క్‌ఫెడ్ మూడుగా విభజించి కొనుగోలు చేయడంతో పాటు ధరల విషయంలో కూడా అదే రీతిన వ్యవహరిస్తోందనేది రైతుల ఫిర్యాదు. ఇలా అనేక బాలారిష్టాలతో రైతులు కలవరం చెందుతున్నారు.

సత్వరం కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ (475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎల్.మాణిక్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీజే గాంధీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లు సుమారు 70శాతం మంది బోధిస్తున్నట్లు తెలిపారు. గతంలో అమలు చేసిన 12 నెలల రెన్యువల్ ఉత్తర్వులు తిరిగి పునరుద్ధరించి, 2024-25 మే నెల వేతనాలు విడుదల చేయాలని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ విద్యాశాఖలో ఎన్నికల నియమావళి కారణంగా నిలిపివేసినట్లు తెలిపారు.

చేపల వేట సాగిస్తూ.. మత్స్యకారుడి మృతి

బాపటరూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : చేపలవేట చేస్తూ ప్రమాదవశాత్తు బోటు నుంచి జారిపడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చీరాల మండలం వాడరేవుకు చెందిన మత్స్యకారుడు మోకా పెద సోమయ్య (47) పిన్నిబోయినవారిపాలెం గ్రామ సమీపంలోని నాగరాజు కాల్వలో బోటుపై చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బోటు నుంచి కాల్వలోకి జారిపడిపోయాడు. స్థానిక మత్స్యకారులు సోమయ్య కోసం చాలా సేపు గాలించారు. కొన్ని గంటల తర్వాత వలకు సోమయ్య మృతదేహం లభ్యమైంది. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నార్త్ ఈస్టు లారీ ఓనర్స్..

అసోసియేషన్ రద్దుకు నిర్ణయం

● డిపాజిట్లు సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని రద్దు చేయాలని ప్రస్తుత పాలకవర్గం తీర్మానించింది. యూనియన్ పరంగా ఉన్న డిపాజిట్లను అసోసియేషన్ సభ్యులకు దామాషా పద్ధతిన పంపిణీ చేయాలని నిర్ణయించింది. శుక్రవారం బుడంపాడు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద అసోసియేషన్ నాయకులు, సభ్యులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశానికి దాదాపుగా 40 మంది సభ్యులు హాజరయ్యారు. ప్రధానంగా లారీ యజమానుల సమస్యలపై చర్చించారు. కిరాయిలు బాగా తగ్గిపోవడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని, చార్జీలు పెంచుతామంటే అటు అధికారులు, ఇటు వ్యాపారులు అంగీకరించడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ ఉండి లాభం లేదని నిర్ణయానికి వచ్చి రద్దు చేస్తున్నామని పాలకవర్గ సభ్యులు తెలిపారు.

స్వార్థ రాజకీయాల కోసం

దళితులపై దాడులు: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు తన స్వార్థ రాజకీయాల కోసం దళితుల మీద దాడులు చేస్తూనే ఉన్నాడని ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. దళితులను చిత్రహింసలకు గురిచేయడం, చంపడం, డోర్ డెలివరీ చేయడం వైసీపీ నేతలకు హక్కుగా మారిపోయిందని ఆయన విమర్శించారు. తిరుపతిలో పవన్ కుమార్‌ను అత్యంత దారుణంగా చిత్రహింసలకు గురిచేసి.. తనను ఎవరూ కొట్టలేదని అతనితోనే వీడియో చేయించడం, ఆ వీడియోని ఆధారంగా తన భర్త శుద్ధపూజ అని చెప్పటం వైసీపీ నేర నైజానికి నిదర్శనమన్నారు. చిత్రహింసలకు గురైన పవన్ కుటుంబ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం ఇలాంటి విషపు మొక్కలను వైసీపీ పెంచి పోషిస్తోందని ఆయన ఆరోపించారు.

వారి ప్రతిభ..విభిన్నం

● ప్రారంభమైన దివ్యాంగ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు


క్యాచ్ పడుతూ..

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైకల్యం దాటిన వాటి ఆట.. క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లి ఏబుల్డ్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిచ్చుకలగుంట మైదానంలో మూడు రోజుల దివ్యాంగులకు స్వర్ణాంధ్రా సెంట్రల్ జోన్ ఇంక్లూజివ్ క్రికెట్ కప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో ప్రకాశం, గుంటూరు జిల్లా జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 5 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. చేజింగ్‌కు దిగిన ప్రకాశం నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేయగలిగింది. రెండు పరుగుల స్వల్ప తేడాతో గుంటూరు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లాల జట్లు తలపడగా.. 8 వికెట్ల తేడాతో కృష్ణా జట్టు గెలిచింది. ఈ పోటీలను కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, కన్వీనర్ నీరుకొండ లీలాకృష్ణారావు, సహాయకార్యదర్శి షేక్ నాగులమీరా, సురేష్ పర్యవేక్షించారు.


తలపడుతున్న ప్రకాశం, గుంటూరు జట్లు

బూర్జువా పార్టీలను ఎదుర్కోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

వినుకొండటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో బూర్జువా పార్టీలు అధికారంలో ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సీపీఐ భుజ స్కంధాలపై ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ద్వితీయ మహా సభలు సందర్భంగా.. 2వ రోజు శుక్రవారం స్థానిక గంగినేని కల్యాణ మండపంలో జిల్లా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ మహా సభల సందర్భంగా గత గురువారం నిర్వహించిన భారీ ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతమైందని తెలిపారు. ఒకనాడు పల్నాడు జిల్లా కక్షలకు, పంతాలకు నిలయంగా ఉండేదని.. నేడు పరిస్థితులు మారి అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లాలో కీలకంగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు కేంద్రంలో అమిత్‌షా తదితర ఎన్‌డీఏ నేతలు జాతి ద్రోహులను దగ్గరకు తీసుకుంటున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ.. కేంద్రంలో రాక్షస పాలన సాగుతోందని, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంపై వారికి ఎటువంటి గౌరవం లేదని అన్నారు. మైనార్టీ సీట్లతో గెలిచిన మోదీ తొలుత జగన్మోహన్‌రెడ్డిని, అనంతరం చంద్రబాబునాయుడుని ఆశ్రయించాడని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, పలు కార్యక్రమాలుపై కార్యదర్శి నివేదికను సభలో చదివారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వయ్యకంటి చెన్నకేశవరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ. మారుతివరప్రసాద్, సంద్రపాటి సైదా, షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, బూదాల శ్రీనివాసరావు, మహంకాళి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, ఎం. రమణారెడ్డి, టి.బాబురావు, సత్యనారాయణరాజు, శ్రీనివాసరావు, రమేష్, కోటా మాల్యాద్రి, శారమ్మ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.


సీపీఐ జెండా ఆవిష్కరించిన ముప్పాళ్ళ నాగేశ్వరరావు

దొంగ దొరికాడు..

పొన్నూరుటౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఈ నెల 5న దుకాణాల్లో చోరీకి పాల్పడిన దొంగను శుక్రవారం అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ ఎల్ వీరనాయక్ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ సమీపంలోని దుర్గా పెయింట్ షాప్‌లో చోరీపై యజమాని షేక్ సాదిక్ బాష ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు భాగంగా గుంటూరు పట్టణానికి చెందిన మిక్కిలి సందీప్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు చెప్పారు. దుకాణంలో చోరీ చేసిన రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో 18 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో నమోదయ్యాయని వెల్లడించారు. 9 సార్లు నిందితుడు జైలుకు వెళ్లి వచ్చి తిరిగి దొంగతనం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పది రోజుల క్రితం ఒంగోలు రూరల్ పరిధిలో రెండు కేసుల్లో రూ. 60 వేలు, స్కూటీ, పల్నాడు జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం చేసినట్లు చెప్పారు. మొత్తంగా రూ. 1,05,000 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో స్కూటీని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. నేరం జరిగిన 36 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసిన స్టేషన్ సీఐ వీరనాయక్ ఎస్ఐ శ్రీహరిని డీఎస్పీ జనార్దన్ రావు ప్రత్యేకంగా అభినందించారు.



దొంగను అరెస్టు చూపిస్తున్న అర్బన్ పోలీసులు

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 29 వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 68,900 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 40 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 29 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 18,055 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 7713 క్యూసెక్కులు..

దుగ్గిరాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి శుక్రవారం గరిష్ఠంగా 7,713 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజి వద్ద 12.0 క్యూసెక్కులనీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 300, రేపల్లె కాల్వకు 1861, తూర్పుకాల్వకు 702, పశ్చిమ కాల్వకు 277, నిజాంపట్నం కాల్వకు 449, కొమ్మమూరు కాల్వకు 3180 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

జిల్లా జైలు నుంచి తురకా కిశోర్ విడుదల

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, రౌడీ షీటర్ తురకా కిశోర్ శుక్రవారం జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కిషోర్ చేసిన నేరాలకు సంబంధించిన కేసుల్లో సుమారు 8 నెలలుగా ఆయన గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఇటీవల ఆయన ఆయా కేసుల్లో బెయిల్ పై విడుదల కాగా టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నంకు సంబంధించి నమోదైన మరో కేసులో పోలీసులు అరెస్టు చేశారు. దీనిని సవాల్ చేస్తూ తురకా కిషోర్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిందితుడు కిషోర్ ను వెంటనే విడుదల చేయాలంటూ ఆదేశించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం ఆయనను గుంటూరు జిల్లా జైలు అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా జైలు వద్దకు ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో వచ్చారు. అదేవిధంగా వైసీపీకి చెందిన న్యాయవాదులు జైలు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అండగా నిలిచిన జగన్, అదేవిధంగా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలతో పాటు వైసీపీ లీడర్ సెల్ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.


జిల్లా జైలు నుంచి విడుదలైన రౌడీషీటర్ తురక కిశోర్

ఏపీఎల్‌లో..

అమరావతి రాయల్స్ శుభారంభం

●కాకినాడ కింగ్స్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్ సీజన్-4 టోర్నీలో అమరావతి రాయల్స్ శుభారంభం చేసింది. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ మూడు వికెట్ల తేడాతో కాకినాడ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కాకినాడ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 229 పరుగులు చేసింది. కెప్టెన్ కేఎస్ భరత్ (93; 46 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లు), కేపీ రాహుల్ (96; 49 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లు) చెలరేగి రెండో వికెట్‌కు 183 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అమరావతి రాయల్స్ బౌలర్లలో బి.సంతోష్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టగా, యశ్వంత్, అయ్యప్ప చెరో వికెట్ తీశారు. అమరావతి రాయల్స్ బ్యాటింగ్‌కు దిగే సమయానికి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. వర్షం తగ్గడంతో డీఎల్ఎస్ మెథడ్ ప్రకారం అమరావతి రాయల్స్‌కు 14 ఓవర్లలో 173 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. అమరావతి రాయల్స్ 13.2 ఓవర్లలో ఏడు వికెట్లకు 173 పరుగులు చేసి అనూహ్య విజయం సాధించింది. కెప్టెన్ హనుమ విహారి (39), కరణ్ షిండే (28), పాండురంగరాజు (26), ఎవీవీ విజయ్ (30), అయ్యప్ప (12 నాటౌట్) రాణించి జట్టుకు అనూహ్య విజయాన్నందించారు. కాకినాడ కింగ్స్ బౌలర్ తపస్వి నాలుగు వికెట్లు పడగొట్టినా ఫలితం లేకపోయింది.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం..

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఊరు పేరు తెలియని మృతదేహాలు రెండు నగరంలోని వేర్వేరు ప్రదేశాల్లో శుక్రవారం లభించాయి. 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి మృతదేహం.. కొత్తపేట, ఉమెన్స్ కాలేజీ రోడ్డులో బస్స్ షెల్టర్ పక్కన కొత్త పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మార్చురీ ఎదురుగా పడి ఉండడంతో.. ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందాడు. మృత దేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని శవాగారంలో కొత్త పేట పోలీసులు భద్రపరిచారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దాచేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గురజాల మండలం అంబాపురం గ్రామా నికి చెందిన దోమతోటి బాజీ(27) పిడుగురాళ్ళలోని సున్న మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహ నంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో దాచేపల్లిలోని సహజ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అతనిని ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలి ంచారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయం..

పాలక మండలి నియామకానికి ఆహ్వానం

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ జి.లీలా కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను దేవస్థానంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హైదరాబాద్ ఐఐటీతో విజ్ఞాన్స్..

అవగాహన ఒప్పందం


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య) ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వడ్ల మూడి విజ్ఞాన్స్ యూ నివర్సిటీ - హైదరా బాద్ ఐఐటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శుక్రవారం వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఐఐటీ - హైదరాబాద్ స్పాన్సర్డ్ కన్సల్టెన్సీ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ జి.నరహరి శాస్త్రితో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఉమ్మడిగా పరిశోధనలు, డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవ చ్చునన్నారు. ప్రొఫెసర్ నరహరి శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యమన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

● తుమ్మలపాలెం వద్ద కేజిన్నర గంజాయి స్వాధీనం

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పరాయి రాష్ట్రం నుంచి ఇక్కడకు వచ్చి గుట్టుగా గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టును.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు రట్టు చేశారు. ముందస్తు పక్కా సమాచారంతో జాతీయ రహదారిపై ఉన్న తుమ్మలపాలెం గ్రామం వద్ద నిర్వహించిన దాడుల్లో కేజిన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిని అడ్డాగా చేసుకుని.. వెంబడి ఉన్న విద్యాలయాలు, కంపెనీలను టార్గెట్ చేసకుని ఎంతో కాలంగా విక్రయాలు సాగిస్తున్నారు. టాస్క్ ఫోర్సు సీఐ బి.నయనతార ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సిబ్బంది తుమ్మలపాలెం గ్రామంలోని ఓల్డ్ బేరింగ్ కంపెనీ వద్ద దాడులు నిర్వహించారు. ఒడిశాకు చెందిన దీపక్ శెట్టి, పబాన్ బెహెర అనే ఇద్దరు పార్వతీపురానికి చెందిన లక్ష్మీ లతా మాలిక్‌తో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వీరి నుంచి 1,557 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసకుని.. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నయనతార తెలిపారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది నాంచారయ్య, నాగరాజు, చైతన్య, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల పేరు చెప్పి...

రూ.50వేలు ఫోన్ పే చేయించుకున్నారు!

● తల్లిదండ్రులకు సైబ్ నేరగాళ్ల టోకరా

ముప్పాళ్ళ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలేనికి చెందిన కిరాణా షాపు నిర్వాహకులు రూ.50 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మప్పాళ్ళ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనుమల శెట్టి శ్రీనివాసరావు పద్మావతి దంపతులు కిరాణాషాపు నడుపుతుంటారు. ఈ నెల 6న మధ్యాహ్నం 98012 41475 అనే నంబర్ నుంచి శ్రీనివాసరావు ఫోనుకు కాల్ వచ్చింది. పద్మావతి ఫోన్ లిఫ్ట్ చేయగా ఫోన్ చేసిన వారు మాట్లాడుతూ 'మీ కుమారుడు బాలవెంకట సతీష్ ఒక అమ్మాయిని వేధిస్తూ.. పోలీసు కేసులో ఇరుక్కున్నాడు. మీ కుమారుడు అరెస్టు కాకుండా ఉండాలంటే మేము ఫోన్ చేసిన నంబర్‌కు రూ.50 వేల ఫోన్ పే చేయండి.' అని హెచ్చరించారు. దీంతో కంగారు పడిన పద్మావతి విషయాన్ని భర్తకు వివరించింది. బిడ్డ క్షేమం కోరిన వారు వెంటనే ఆ నగదును సదరు నంబర్‌కు ఫోన్ పే చేశారు. తర్వాత తమ కుమారుడు క్షేమంగానే ఉన్నాడని తెలుసుకుని విస్తుపోయారు. మోసపోయామని తెలుసుకుని ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం పిర్యాదు చేశారు. పిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ సైబర్ నేరగాళ్ళ పనేనని తెలిపారు. ఇటివంటి గుర్తింపులేని కాల్స్ వచ్చినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎవరూ.. డబ్బుల అడగరనీ ఇటువంటి కాల్స్‌పై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు.

इंडियन बैंक Indian Bank इलाहाबाद ALLAHABAD

ఇండియన్ బ్యాంక్, పట్నంబజారు బ్రాంచి 22-3-5, మిల్క్ హాస్పిటల్ దగ్గర, చౌత్ర, గుంటూరు-522003, ఫోన్: 0863-2220779

APPENDIX-IV-A [See Provision to rule 8(6) / 9(1)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) / 9(1) తో చదువుకునే నిబంధన క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన

మెస్సర్స్ ఎ1 మెడికల్స్ (ఋణగ్రహీత) యజమాని: శ్రీ కొమర సాంబశివరావు, శ్రీ కొమర సాంబశివరావు, యజమాని: మెస్సర్స్ ఎ1 మెడికల్స్ (ఋణగ్రహీత & తనఖాదారు) మరియు శ్రీ చిల్కా సుబ్బయ్య (హామీదారు), తండ్రి: లింగయ్య ల చేత సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, పట్నంబజారు బ్రాంచికి తనఖా/ఛార్జ్‌గా వుంచిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులను, బకాయిసొమ్ము దీ.08.08.2025 తేదీనాటికి రూ.39,33,658/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల ముప్పై మూడు వేల ఆరు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే) వసూలు నిమిత్తం ఇండియన్ బ్యాంక్ (సెక్యూర్డ్ క్రెడిటార్) పట్నంబజారు బ్రాంచి యొక్క అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని లాంఛనముగా స్వాధీనం చేసుకున్నారు మరియు సదరు ఆస్తిని ది.10.09.2025 తేదీన "ఎక్కడ ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అది" మరియు "ఉన్నది ఉన్నట్లుగా" పద్ధతిపై సెక్యూర్డ్ క్రెడిటార్‌చే విక్రయించబడునని ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. ఇ-వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి:

ఆస్తి యొక్క వివరములు

తనఖావుంచిన ఆస్తులు: దస్తావేజు నెం.(4888/2017)కు సంబంధించినది.

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ లిమిట్ యొక్క ఏరియా, గుంటూరు సిటీ, పాత గుంటూరు, యాదవుల బజారు, 1వ లైను, మునిసిపల్ వార్డు నెం.7, న్యూ వార్డు నెం.11, బ్లాక్ నెం.11, మునిసిపల్ పాత అసెస్‌మెంట్ నెం.23307-01, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం.79670, పాత డోర్ నెం.16-15-18, ప్రస్తుత డోర్ నెం.16-15-34, టి.యస్.నెం. 878 నందు య॥ 8.11761 చ॥అ॥ విస్తీర్ణములో, జియమ్‌సి సిటీ ప్లానర్స్ TSA No-1819/2017-18G-3, F.L.R No-967/2017/T.S.I dated 16/12/2017 ఎండార్స్‌మెంట్ మునిసిపల్ వార్డు నెం.7, బ్లాక్ నెం.11, టి.యస్.నెం.878/19 నందు 216.1/3 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులోని ఆర్‌సిసి రూఫ్డ్ డాబా మరియు అందలి అన్ని ఫిక్చర్స్ మరియు ఫిట్టింగ్స్‌తో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** సంపతి వీరమ్మకు చెందిన ఆస్తి 63-6; **దక్షిణం:** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు 30-0; **పడమర:** కడప సీతారావమ్మ చట్టబద్ధవారసులకు చెందిన ఆస్తి 63-6; **ఉత్తరం:** యలమంచిలి వెంకటరావుకు చెందిన ఆస్తి 31-0.

ఆస్తిపై ఎన్‌కంబరెన్స్	బ్యాంక్‌కు తెలిసినంత వరకు ఏవిలేవు
రిజర్వుధర (రూ.)	రూ.73,98,900/-
బయానా మొత్తం	రూ.7,39,890/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం	తేది: 10.09.2025, సమయం: ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి నెం.	IDIB6637430914

బిడ్డర్లు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సదర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నెంబర్ 8291220220, email ID: support.baanknet@psballiance.com కు మరియు సర్వీస్ ప్రొవైడర్స్ హెల్ప్‌డెస్క్‌లో లభించే ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేయండి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్‌తో రిజిస్ట్రేషన్ స్థితి కోసం మరియు EMD స్థితి కోసం దయచేసి support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

ఆస్తి వివరాలు మరియు ఆస్తి యొక్క ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతులకోసం దయచేసి https://baanknet.com ను సందర్శించండి. ఈ పోర్టల్‌కు సంబంధించిన స్పష్టీకరణల కోసం, దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్ 8291220220ను సంప్రదించండి. https://baanknet.com వెబ్‌సైట్స్‌లో ఆస్తి కోసం పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు శోధించవలసినదిగా సలహా ఇవ్వడమైనది.

తేది: 08.08.2025, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ గుంటూరు సిటీలోని ప్రముఖ లిఫ్ట్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. సంప్రదించండి సెల్ : 99515 74104
AJG-239549

➡ VS గార్మెంట్స్ నందు పనిచేయుటకు టైలరింగ్ అనుభవం వున్న స్త్రీలు కావలెను. కొత్తవారికి ట్రైనింగ్ ఇవ్వబడును. అనుభవం ఉన్నవారికి ఇంటి వద్దనే వర్క్ ఇవ్వబడును. సంప్ర॥ 6304912388, 6309351341.
AAA-10078

➡ ప్రముఖ NBFC కంపెనీ నందు పనిచేయుటకు EXECUTIVES కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలు. ✆ 91105 84789
AJB-235745

రియల్ ఎస్టేట్

➡ గేటెడ్ కమ్యూనిటీలో మంచి కట్టుబడితోటి బ్యాంకు లోన్ సౌకర్యంతో ప్లాట్లు కలవు. మరియు NH-16 పక్కన CRDA వెంచర్‌లో గజం: 7000/- మాత్రమే. 5 లక్షలకే వాణిజ్య సంస్థలో ప్రతి నెల అద్దె, లాభాలలో వాటా, ఉచిత సౌకర్యం. సంప్ర॥ 99596 83194.
AJG-239641

➡ AP LRS-2025 ద్వారా నాన్ లేఅవుట్ స్థలాలు 50% తగ్గింపుతో క్రమబద్ధీకరించేందుకు ఇదే సువర్ణావకాశం. త్వరపడండి. ANCISCON Infra Tech. Architects & Engineers (AP & TG). Ph: +91 - 94917 55456.
AJO-211492

సర్వీసెస్

నవయుగ ట్రస్ట్

➡ నవయుగ ట్రస్ట్ వారిచే కృత్రిమ అవయవములు అమర్చబడును మోకాలి క్రింద వరకు 7,000/- మోకాలిపైన 25,000/- ఖరీదు 1-8-2025 నుండి 31-8-2025 వరకు అమర్చబడును. డాక్టర్ జి. వెంకట్రావు, 2వ లైను, సుబ్బారావు కాలనీ, విజయవాడ-8, సెల్ :76800 24648
AJB-209459

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 91103 23914
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 97048 67908
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్: 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614



సుపరిపాలన కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఏడాదిలోనే అభివృద్ధికి కొత్త పునాదులు

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- ఎనిమిదో డివిజన్లో పర్యటించిన ఎమ్మెల్యే

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త పునాదులు వేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఎనిమిదో డివిజన్ పాత గుంటూరు, క్రిస్టియన్ పేటలో ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాలలో ప్రభుత్వపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రేషన్ కార్డులు, తాగునీటి సరఫరా, పెన్షన్లు, రోడ్లు, శానిటేషన్ వంటి సేవలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికి ఎలాంటి సర్వీసు అందకపోయినా తనను నేరుగా సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అనూహ్యమైన మార్పులకు నాంది పలికామని, దీనికి గర్వంగా ఉందని అన్నారు. మొండిగేట్ వద్ద వెంటనే అదనపు నిర్మాణం చేపట్టి ముంపునకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని చెప్పారు. మురుగునీటి వ్యవస్థ ఇంకా మెరుగుపడాలని అధికారులకు సూచించారు. గతంలో గుంటూరు తూర్పు నియోజకవర్గమంటే వెనకబడిన ప్రాంతంగా చూసేవారని, ఐదేళ్లపాటు ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని తెలిపారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళికాబద్ధంగా రోడ్లు, సీసీ డ్రెయిన్లు, రైల్వే ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ముందడుగు వేశామని చెప్పారు. ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనే నవశకానికి నాంది పలికిందన్నారు. పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ యల్లావుల అశోక్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విద్యార్థుల సృజనాత్మకతను హరించే చర్యలు తగదు

- ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్స్ వలన విద్యార్థులకు స్వయం ఆలోచన, సృజనాత్మకత లేకుండా చేసి, ఉపాధ్యాయులకు అసౌకర్యంతో తీవ్ర ఒత్తిడికి గురి చేస్తాయని, వాటిని తొలగించి పూర్వ పద్ధతిలోనే పరీక్షల విధానం ఉండాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో సీవీ రేణుకకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్స్‌లో నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించి వాటి సమాధానాలు అన్ని ఒకే బుక్‌లోనే రాయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత కొరవడుతుందన్నారు. బుక్ ఉండటం వలన విద్యార్థులు చూసి రాత విధానానికి అలవాటు పడతారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, సభ్యులు జి.దాస్, పి.నాగశివన్నారాయణ, మూర్తి, పి.శివరామకృష్ణ, జహంగిర్, టి.భాస్కర్, మాలకొండయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

నిరసనలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 13న క్విట్ కార్పొరేట్-క్విట్ మోదీ నినాదంతో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేట, పి ఎల్ రావు భవన్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ రంగం నిర్వీర్యమైందని అన్నారు. మద్దతు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక లాడ్జి సెంటర్లో జరిగే నిరసనల్లో రైతు, ప్రజా, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో పాటిబండ్ల కోటేశ్వరరావు, కంచుమాటి అజయ్, కొల్లి రంగారెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త వేణుగోపాలరావు, మన్నం హరిప్రసాద్, ఈమని అప్పారావు, లక్ష్మణరావు, హనుమంతరావు, అరుణ్ కుమార్, వేల్పూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అవయవదానంతో మరణించిన వ్యక్తి జీవించవచ్చని, కొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం రోగుల బంధువులతో నిర్వహించే మీ కోసం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం అటెండర్ పాసు తప్పనిసరని వివరించారు. అవసరం మేరకే రోగి బంధువులు ఆసుపత్రిలో ఉండాలని ఆయన సూచించారు. మత్తు పానీయాలు తీసుకొని ఆసుపత్రిలోకి రాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పాటించాల్సిన నియమావళి గురించి డాక్టర్ రమణ యశస్వి వివరించారు. అనంతరం జాగృతి సేవ సంస్థ నుంచి నాగరాజుకుమారి ఉచిత పండ్లు పంపిణీ చేశారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమణ యశస్వి

సినీరంగ ఉప్పెన...అగ్ని కవి మోదుకూరి జాన్సన్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సినీ నాటక రంగ నటుడు, రచయిత, అగ్ని కవిగా ప్రసిద్ధి చెందిన మోదుకూరి జాన్సన్ 91వ జయంతి కార్యక్రమం కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మేడ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ (మేడ్) రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ సినీ, సాహిత్య రంగంలో ఓ ఉప్పెన మోదుకూరి జాన్సన్, ఆయన ఎన్నో గొప్ప రచనలు చేశారన్నారు. జాన్సన్ మరుగున పడిన మాణిక్యం అయిపోయారని, ఇప్పటికైనా ఆయన రచనలు వెలుగులోని తేవటానికి దళిత మేధావులు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జాన్సన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర కోశాధికారి కుక్కమళ్ళ సంజీవ్, ఏకుల సుబ్రహ్మణ్యం, కందుకూరి మరియదాసు, న్యాయవాది రాజకుమారి, కువ్వారపు కార్తీక్, కత్తి రాజేష్, క్రిస్టొఫర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు



అభివృద్ధి పనులకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అరండల్‌పేట, వసంతరాయపురం, మల్లికార్జున పేట, శ్రీనగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను, డ్రెయిన్ ఆక్రమణలను శుక్రవారం పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పని నిర్దేశిత గడువు మేరకు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని, ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం అమరావతి రోడ్డులో ఆక్రమణలను గమనించి శంకర్ విలాస్ వంతెన పనులతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్యతో పాటు డ్రెయిన్లలో మురుగుపారుదలకు అడ్డుగా ఉంటుందన్నారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేరేచర్ల మైదానంలో శుక్రవారం సీనియర్ బాలుర విభాగంలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు దాదాపు 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు శనివారం బాపట్లలో జరిగే నల్లమల జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు వైజాగ్‌లో ఆగస్టు 16, 17వ తేదీలలో జరిగే సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ మెన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఎంపికలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుర్గా మోహన్ తదితరులు పర్యవేక్షించారు.

మలబార్ ఆర్టిస్ట్రీ షో ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఆర్ట్ ఇన్ ఎవ్రీ జ్యూవెల్ అనే థీమ్‌తో ఈ నెల 11 తేదీ వరకు జరిగే ఆర్టిస్ట్రీ షో విశిష్ట ఆభరణాల ఎగ్జిబిషన్‌ను శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, డాక్టర్ టి.మహతి, పెద్ది రమణారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అత్యాధిక డిజైన్లతో ప్రారంభించిన ఆర్టిస్ట్రీ షో ఎంతో ఆకర్షణీయంగా ఉందని అభినందించారు. ఆభరణాల ప్రదర్శనను నగర, పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టిస్ట్రీ షోలో భాగంగా బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు

భారత దేశపు ముద్దుబిడ్డ ఎంఎస్ స్వామినాధన్

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాధన్ గొప్ప శాస్త్రవేత్త, భారతదేశపు ముద్దు బిడ్డ అని సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాధన్ శతజయంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సేవ చేయటానికి స్వామినాధన్ సైన్స్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్‌వీ సింగరయ్య, హరిజనార్ధనరావు తదితరులున్నారు.

అప్పులు బాధతో యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అప్పులు కారణంగా సంపత్ నగర్ ఒకటో లైన్‌లో నివాసం ఉంటున్న షేక్ ఇస్మాయిల్(35) అనే పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై భార్యను ఇబ్బంది పెట్టడంతో ఆమె తన పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఇంట్లో ఉంటూ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య షేక్ మాధర్‌బి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటుకూరులో...

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరుకు చెందిన ఏటుకూరి సంతోష్ (31) అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేసి తీర్చలేని పరిస్థితుల్లో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కరుణానిధి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాజకీయ దుందుభి కరుణానిధికి ఘన నివాళులు

- ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాల రాజకీయాలకు వన్నెతెచ్చిన రాజకీయ దుందుభి కరుణానిధి 7వ వర్ధంతి సందర్భంగా స్థానిక గుంటూరు జేఏసీ కార్యాలయంలో కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ కరుణానిధి 5 సార్లు ముఖ్యమంత్రిగా, 13 సార్లు అసెంబ్లీ శాసనసభ్యుడిగా ఎన్నికై దక్షిణాది రాష్ట్రాలకు వన్నె తెచ్చిన గొప్ప రాజకీయ తత్వవేత్త అని అన్నారు. బీసీ మహాజనసభ అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ బడుగు వర్గాలకు రాజ్యాధికార దిశగా జీవితకాలం రాజకీయాలు నడిపి, ఈ దేశంలో బీసీలు దేనికి తక్కువ కాదని నిరూపణ చేసిన గొప్ప రాజకీయ దార్శకుడు కరుణానిధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన పొలిటికల్ సెంటర్ కోఆర్డినేటర్ సాదు మల్యాద్రి, విసికె పార్టీ మహిళా అధ్యక్షురాలు కె జయసుధ, రైతు కూలీ సంఘం అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరావు, బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సికా సురేష్ , లంబాడి హక్కుల పోరాట కమిటీ అధ్యక్షులు చంద్రనాయక్, పూలే అంబేద్కర్ లిటరేచర్ కోఆర్డినేటర్ బత్తుల విల్సన్, భీమ్ సేన సేవా సంఘం అధ్యక్షులు నల్లపు నీలాంబరం, బిఎస్పి నాయకులు చరతనగండ్ల వాసు, నాయీబ్రాహ్మణ సౌందర్య శాలల సంక్షేమ శాఖ గుంటూరు అర్బన్ కమిటీ ఉపాధ్యక్షులు పి శ్రీమన్నారాయణ, ప్రజాపక్షం సామాజిక న్యాయ పోరాట సంస్థ కార్యదర్శి ఎంఏఎస్ రహమాన్ తదితరులు ఉన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

- శ్రీ వామనాశ్రమ మహాస్వామి

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అన్ని వర్గాలపై ఉందని వైశ్య కుల గురువు, శృంగేరి పీఠ శిష్య పరంపర, శ్రీ వామనాశ్రమ మహా స్వామిజీ అన్నారు. స్థానిక ఏటుకూరు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో చాతుర్మాస దీక్ష సందర్భంగా దేవాలయంలో కొలువై ఉన్న స్వామీజీని శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పలువురు కలుసుకొని ఆశీస్సులు తీసుకొన్నారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మకు దుశ్శాలువాతో సత్కరించి మహా ఆశీర్వాదం అంద జేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మం, దేవాల యాలపై మక్కువ చూపేలా చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింత నను పిల్లలకు అలవాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిడమానూరు సురేష్, రవి, బొడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణం నుంచి యువతి పరార్

స్థానిక ఎన్‌టీఆర్ తెలుగు మహిళా ప్రాంగణం నుంచి ఓ యువతి పరారైంది. గుంజి కల్పన (30) అనే యువతిని ఇటీవల పోలీసులు మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్‌లో చేర్పించారు. అయితే కల్పన మరిది రవికృష్ణకు న్యాయవాది ఫోన్ చేసి రమ్మని కోరగా ఆయన తమకు సంబంధంలేదని, రానని చెప్పాడు. అయితే ఈ నెల 4న తోటపని చేసే క్రమంలో మహిళా ప్రాంగణం నుంచి ఎవరికీ చెప్పకుండా పారిపోయింది. దీనిపై భానుప్రసాద్ కాలనీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



స్థానిక ఆర్ అగ్రహారం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

సంపదలివ్వు తల్లీ...

- నగరంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన దేవాలయాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరలక్ష్మి వ్రతాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో వేకువజామునుంచే అమ్మవారి మూలవిరాట్‌లకు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరండల్‌పేట, సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు బ్రాడీపేట, పాతగుంటూరు, గోరంట్ల, ఇతర ప్రాంతాల్లో కొలువైన అమ్మ వారి ఆలయాల్లో శ్రావణమాస విశేష పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులతో అమ్మవారి ఆలయాలు కిక్కిరిశాయి.

శుక్రవారం వ్రతాలు, కుంకుమార్చనలు, పారాయణలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి నక్షత్ర హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్రతంలో పాల్గొని, అమ్మవారిని వారికి దర్శించుకున్నారు.

- స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, పద్మావతి కల్యాణమండపం వేదికగా ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్ మస్తానయ్య, పాలకమండలి వారి అధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి మాధవస్వామి బృందం వరలక్ష్మి వ్రతాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు వందల మందికి పైగా సువాసినులచే శుక్రవారం వ్రతాలు కుంకుమార్చనలు, పారాయణలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.
- స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోపూజ, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు విశేషంగా జరిగాయి. అనంతరం మూలవిరాట్‌లకు నూతన వస్త్రాభరణాలతో అలంకరించి 1108 బంగారు పుష్పాలు, కలువపూలతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. మర్రిపాటి ప్రసాదు శర్మ పర్యవేక్షించారు.
- స్థానిక మల్లారెడ్డి నగర్, శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం పూజలలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ పర్వత వర్ధిని అమ్మవారిని సుమారు రూ.15 లక్షల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.
- గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శ్రీ వామనాశ్రమం మహాస్వామిజీ సమక్షంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుడివాడ రవికుమార్, కార్యదర్శి కోట శేషగిరి, కోశాధికారి పాపారావు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అద్దేపల్లి రాఘవ , రాంబాబు, ఆంజనేయులు, మహంకాళి శ్రీనివాస్, నేరెళ్ళ హరి, వందవాసి రఘు, జుజ్జూరి శ్రీనివాసరావు తదితరులున్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్దిదారులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

సంక్షేమ పాలనకు నిదర్శనం ముఖ్యమంత్రి సహాయ నిధి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- రూ.33.14 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

గుంటూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న సంక్షేమ పాలనకు సీఎం సహాయనిధి ఓ నిదర్శనమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని 29 మందికి మంజూరైన రూ.33.14 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆమె తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది కేవలం ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఇది పేదల పాలిట ఒక భరోసా అని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్క సంవత్సరంలోనే రూ. 400 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించి వేలాది మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఆమె గుర్తు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు చేయించామని, నియోజకవర్గ ప్రజలకు సహాయం చేయటానికి తాము సిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ అందేలా చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాల్లో పింఛను పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం- 2 పథకం ద్వారా ఉచిత సిలిండర్లు ఇచ్చిన సీఎం చంద్రబాబు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చి సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించడం, వారికి సంక్షేమ ఫలాలు అందించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవి చెప్పారు.

ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం సొసైటీ ఎన్నికలు నిలుపుదల

- ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలను పరిపాలనా కారణాల దృష్ట్యా నిలుపుదల చేయడం జరిగిందని ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఎక్స్ అఫీషియో చైర్మన్, నగర మేయర్ ఆదేశాల మేరకు, ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీకి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18న జరగాల్సిన ఎన్నికలను పరిపాలనా కారణాల దృష్ట్యా నిలుపుదల చేయడం జరిగిందని, ఎన్నికలు మరల ఎప్పుడు నిర్వహించేది, తదుపరి ప్రకటన ద్వారా తెలియచేయడం జరుగుతుందని తెలిపారు.

దృఢ సంకల్పం, కష్టపడే తత్వం ఉంటే సర్వీస్ సాధ్యమే

- సివిల్ ర్యాంకర్ సాయి భార్గవ



మాట్లాడుతున్న సాయి భార్గవ

గుంటూరు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్‌లో సత్తాచాటాలనుకునే విద్యార్థులకు దృఢ సంకల్పం, కష్టపడే తత్వం, సరైన గైడెన్స్ ఉంటే సర్వీస్ సులభంగా సాధించవచ్చునని యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా ర్యాంకర్ శనగవరపు సాయి భార్గవ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాయి భార్గవ మాట్లాడుతూ తాను నాలుగో అటెంప్ట్‌లో సర్వీస్ సాధించానని విద్యార్థులకు తెలిపారు. ఏడాది పాటు చదివి పరీక్షల్లో విజయం సాధించకపోతే నిరాశ చెందకూడదని, ఓర్పు, సహనంతో మళ్లీ ప్రయత్నించి సర్వీస్ సాధించాలని పిలుపునిచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా ఎలా ప్రిపేర్ అవ్వాలో తెలియాలంటే మాత్రం నిపుణుల గైడెన్స్ తీసుకోవాలన్నారు. సివిల్స్ పరీక్షలో మెరవాలంటే శ్రమ, శ్రద్ధ, అంకితభావం, సొంత ప్రతిభతోనే రాణించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్వైజర్, ఏపీ మాజీ డీజీపీ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ జేసీలో సందడిగా వీడ్కోలు వేడుకలు

గుంటూరు (విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థుల నూతన ప్రయాణం ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. కళాశాలలో ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సభలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించుకొని, వారి విద్యా సమయంలో జరిగిన వివిధ విశేష అనుభూతులను గుర్తు చేసుకొంటూ, ఉత్సాహంగా గీతాలాపన, నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

రిక్షా కార్మికుడి అనుమానాస్పద మృతి

గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిసె వాసుల కాలనీ శివారు రాజీవ్‌గాంధీ నగర్ కి చెందిన పెదాల వెంకటేశ్వర్లు (52) అనే రిక్షా కార్మికుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మద్యానికి పూర్తిగా బానిసై ప్రతిరోజు మద్యం సేవిస్తున్నట్లు, గత కొన్ని రోజులుగా జ్వరం, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్ళగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.



నచ్చిన లైటింగ్‌కు లైక్ కొట్టండి!


● సీఆర్‌డీఏ ప్రాజెక్టు భవనం లైటింగ్ డిజైన్‌పై ఓటింగ్

● వెబ్‌సైట్‌లో రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలు

మంగళగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ భవన నిర్మాణాల తాలూకు ఆకృతులు ప్రజాభీష్టానికి అనుగుణంగా ఉండాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. భవనాల బాహ్య ఆకృతులు ప్రజలు నచ్చే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించుకున్నారు. పూర్తయిన భవనాలకు తుది మెరుగులు దిద్దేక్రమంలో వాటి తాలూకు ఆకృతులకు పలు రకాలుగా డిజైన్‌లను రూపొందించి.. వాటిల్లో ఏది ఎక్కువమంది ఆమోదం పొందిందో తెలుసుకోవడానికి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. నవ్య రాజధాని అమరావతిలో పూర్తవుతున్న తొట్టతొలి భవనంగా ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం. గతంలో ఈ భవనం ప్రవేశ ద్వారానికి నాలుగు రకాలైన డిజైన్‌లను ఓటింగ్ నిమిత్తం ప్రజల ముందుంచారు. వాటిల్లో ఎక్కువమంది ఆమోదాన్ని పొందిన ఓ ఆకృతిని ఫైనల్ చేసి అదే డిజైన్‌ను భవనంపై ఏర్పాటు చేశారు. ఇపుడు తాజాగా సదరు అకృతికి తోడు భవనం ముందువైపు ఏ తరహా లైటింగ్‌ను ఏర్పాటుచేయాలనే దానిపై కూడ సీఆర్‌డీఏ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. ఇందుకోసం రెండు రకాల డిజైన్‌లను రెండు సంస్థల చేత రూపొందింపజేశారు. ఒక డిజైన్‌ను సిగ్నిఫై అనే సంస్థ రూపొందించగా.. రెండవ డిజైన్‌ను జాక్వర్ సంస్థ తయారుచేసింది. ఈ రెండు డిజైన్‌ల తాలూకు వీడియోలను సీఆర్‌డీఏ ఓటింగ్ నిమిత్తం శుక్రవారం తన వెబ్ సైట్‌లో అందుబాటులోఉంచింది. రెండింటిలో ప్రజామోదం పొందిన ఆ లైటింగ్ డిజైన్‌ను ఏర్పాటు చేస్తారు.



వీడియో-1 కు సంబంధించిన ఫొటో..



వీడియో-2 కు సంబంధించిన ఫొటో..

మయూరం..భ్రమరాంబ



పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస 3వ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారికి నెమలి పింఛములతో ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 15న సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుందని, ముత్తైదువులుపాల్గొని, అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

మహాలక్ష్మి అమ్మవారికి బంగారు కిరీటం



బంగారు కిరీటంతో దాతలు ప్రకాశ్, నీలిమ దేవి

పెదకాకాని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్నా.. శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరావు, స్వర్ణ కుమారి దంపతులు, కుటుంబ సభ్యులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టి సమర్పించారు. విజయవాడకు చెందిన దాతలు ప్రకాష్, నీలిమ దేవి, కుటుంబ సభ్యులు అమ్మ వారికి బంగారు కిరీటం, శ్రావణ పట్టి సమర్పించారు.

కలవరపెడుతున్న సుంకం

● సందిగ్ధంలో పడిన సాగు రైతులు

● అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం

● ఇతర దేశాలకు ఎగుమతులపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్యే వేగేశన


● చర్చలతో పన్ను తగ్గించాలి: వ్యాపారులు



బాపట్ల తీరంలో సాగు చేస్తున్న ఆక్వా చెరువులు

బాపట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగు సంక్షోభం వైపు పయనిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో ఆ ఆక్వా రైతు కుదేలు అవుతున్నాడు. వ్యాపారులు కలవరపాటుకు గురవుతున్నారు. ఇప్పటికే సాగు పెట్టుబడులు పెరిగిపోయి.. దిగుబడులు తగ్గి విలవిల్లాడుతున్న రైతును ట్రంపు సుంకం.. మరింత బాధ పెడుతోంది. ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా ఉన్నప్పటికీ.. అమెరికా దిగుమతి సుంకం పెంచడంతో వ్యాపారులు సందిగ్ధంలో పడ్డారు. బాపట్ల జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రొయ్యల విలువ రూ.888 కోట్లుగా ఉంది. ఇందులో అమెరికాదే అగ్రభాగం కావడం విశేషం. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. 70 శాతం వెనామి రొయ్యలు, 30 శాతం టైగర్ రొయ్యలు సాగు చేస్తున్నారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్‌లు ఐదు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 10వేల మందికి ఉపాధి లభిస్తోంది. వ్యవసాయం తర్వాత ఆక్వాదే అగ్ర భాగం. అమెరికా టారిఫ్ ఫలితంగా స్వదేశీ మార్కెట్‌లో రొయ్యల ధరల తగ్గుముఖం పట్టాయి.

వినియోగదారులపై ప్రభావం



ఆక్వా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు పెంచిన సుంకాల వల్ల వినియోగదారులపై భారం పడుతుంది. ఇప్పటికే 25 శాతం సుంకం అమలలోకి రాగా ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలలోకి రానుంది. రాబోవు రోజుల్లో మరిన్ని అంక్షలు పెట్టే అవకాశం ఉంది. సుంకాల పెంపుదలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పన్ను పెంచితే అమెరికాలో ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం అక్కడి వినియోగదారులపై పడుతుంది. కొన్ని దేశాలకు ఒకరంగా మరికొన్ని దేశాలకు మరొక రకంగా పన్ను విధించడం సరికాదు. పన్ను వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బయ్యర్లు ఎగుమతులు ఆపేయాలని చెప్పారు. కంటైనర్లు ఆగిపోయాయి. మిత్ర దేశం అంటూనే ఈవిధంగా చేయడం సరికాదు. ప్రధాని నరేంద్ర మోదీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు, వ్యాపారులు ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే విషయంపై దృష్టి పెట్టాలి.

- వేగేశన నరేంద్రవర్మ, ఎమ్మెల్యే, రాయల్ మెరైన్ ఇంఫెక్స్, సీఎండీ

చర్చలతో పన్ను తగ్గించే విధంగా చూడాలి



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెంచిన పన్ను వల్ల ఆక్వా రైతులు కుదేలవుతారు. ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రంగం ముందుకు సాగదు. ప్రభుత్వం చర్చించి పన్ను మొత్తం 20 శాతానికి తగ్గించే విధంగా చూడాలి. రాష్ట్రం నుం చి ఆక్వా ఉత్పత్తులు 60 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. పన్ను పెంచడం వల్ల హేచరీలు, ఫీడ్ మిల్లులు, రైతులు, హేచరీలు, మందుల దుకాణాలు మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉంది. గతంలో 8శాతం పన్ను మాత్రమే చెల్లించేవారని ఇప్పుడు 50 శాతానికి పెంచడం దారుణం. దేశంలో ఆక్వా ఉత్పత్తులు అధికంగా ఎగుమతి చేసే వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. విదేశీ మారక ద్రవ్యం దీని ద్వారా అధికంగా వస్తుంది. కావున దీనిని కాపాడుకునేవిధంగా ప్రభుత్వం చర్చలు జరపాలి.

- అనంత నగేష్‌బాబు, సెక్రటరీ జనరల్, జాతీయ మత్స్యకార సంఘం

కల్ప వృక్షానికి కష్టకాలం



క్రోసూరు ప్రాంతంలో తగల బెట్టిన తాడి చెట్లు



పొలాలకు అడ్డంగా ఉన్నాయని నరికి వేసిన తాడి చెట్లు

క్రోసూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రాంతంలో తాటి తోపులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పొలాలకు, పంటలకు సాగుకు అడ్డ మొస్తున్నాయన్న ఉద్దేశంతో రైతులు వాటిని తగల బెట్టడం, నరికి వేయడం చేస్తున్నారు. మండలంలోని అందుకూరు, అనంతవరం, నాగవరం, హసానాబాద్, 88 తాళ్ళూరు, పీసపాడు, విప్పర్ల, బాలెమర్రు, పారుపల్లి తదితర గ్రామాల పరిధిలో ఆయా ఊళ్లకు వెళ్లే.. మార్గంలో వందలాది తాటిచెట్లు దర్శనమిచ్చేవి. కొన్ని దశాబ్దాల క్రితం గృహాల నిర్మాణానికి, శుభ కార్యాలప్పుడు పందిళ్లు వేసుకోవడానికి తాటి చెట్ల అవసరం ఎంతో ఉండేది. ఇటీవల కాలంలో పల్లె ప్రాంతాలు కూడా కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న నేపథ్యంలో తాటి చెట్ల అవసరం లేకపోవడంతో రైతులు వాటిని రూపు మాపే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చే గీత కార్మికులకే కాక స్థానికంగా ఉండే కార్మికులకు కూడా కల్లు గీత వల్ల ఉపాధి లభించేది. ఇటీవల కాలంలో వందలాది తాటి చెట్లను నరికేయడంతో.. భవిష్యత్తులో.. కల్ప వృక్షంగా భావించే తాడి చెట్లు కనుమరుగయ్యే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్లు

● దిగుబడులపై ప్రభావం ● నష్టాల బాటలో సాగుదారులు



లంక గ్రామాల్లో సాగవుతున్న బొప్పాయి తోట

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి తోటలకు వైరస్ తెగుళ్ల పట్టి పీడిస్తున్నాయి. తెగుళ్ల కారణంగా ఆ ప్రభావం దిగుబడులపై చూపడంతో గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో బొప్పాయి తోటలు సాగు చేస్తున్న రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లో రైతులు ఏటా బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు మండలాల్లో సుమారు 50 హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో రైతులు బొప్పాయి తోటలు సాగు చేస్తున్నారు. ఎకరాకు 1,600 మొక్కలు నాటుతారు. ఒకొక మొక్క రూ.18లకు కొనుగోలు చేసి కూలీలతో విత్తుకుంటారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కలకు సుమారు రూ.28,800 ఖర్చు అవుతుంది. దీనికి తోడు కౌలు రూ.50 వేలు, కూలీలు, ఇతర సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టి.. బొప్పాయి తోట సాగు చేపట్టారు. తోటలను రింగ్ స్పాట్ తెగుళ్ల ఆశించడంతో తోటల్లోని ఆకులు రంగులు మారిపోవడం, మొక్కకు వచ్చి కాయలు ఎదుగుదల లేకపోవడంతో పాటు పక్వానికి కూడా రావడం లేదు. గుర్తించిన రైతులు ఉద్యాన శాఖాధికారులకు తోటల గురించి వివరించగా వారు పరిశీలించి తెగుళ్ల ఆశించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, గాలిపాటున అప్పుడప్పుడు తెగుళ్ల బొప్పాయిని ఆశించడం జరుగుతుందని అధికారులు వివరించినట్లు రైతులు చెబుతున్నారు. తోటలను తెగుళ్ల ఆశించకుండా ఉంటే ఎకరాకు 20-25 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 10 టన్నుల దిగుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోవాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాల గర్భంలోకి.. శంకర్ విలాస్ ఆర్‌వోబీ




శంకర్‌విలాస్ ఆర్‌వోబీ, నిర్మాణ పనులు

● నేటి నుంచి కూల్చివేత ప్రారంభం

● ఆరు దశాబ్దాలకు పైగా నగరవాసులకు సేవలు



ప్రస్తుత బ్రిడ్జి సాంకేతిక వివరాలు



గుంటూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంచుమించు 65 ఏళ్లకు పైగా నగర వాసులు గుంటూరు ఒన్ టౌన్ నుంచి టూ టౌన్‌కు సులభతరంగా ప్రయాణించేలా ఈ వారధి సేవలందించింది. అమరావతి, తాడికొండ, తుళ్లూరు తదితర ప్రాంతాలను గుంటూరు నగరంతో అనుసంధానం చేసింది. గుంటూరు రైల్వే యార్డు మధ్యన నిలబడి తన భుజాలను ఇరువైపులా చాచి వాహనాలను చేరవేసింది. ఆరు దశాబ్దాలకు పైగా నిలిచిన శంకర్ విలాస్ ఆర్‌వోబీ నేటి నుంచి కాలగర్భంలో కలిసిపోనుంది. ఈ బ్రిడ్జి స్థానంలో కొత్త హంగులతో నాలుగు వరసల రైల్ ఓవర్ బ్రిడ్జి పనులు ఇప్పటికే ప్రారంభమైన విషయం తెలిసిందే.

ఆర్వోబీ చరిత్ర ఇదీ..

1958కి ముందు గుంటూరు రైల్వేస్టేషన్ చాలా చిన్నదిగా ఉండేది. అప్పట్లో రైల్వే యార్డు కూడా తక్కువ విస్తీర్ణంలోనే ఉంది. గుంటూరు - అమరావతి రోడ్డులో 500 మీటర్ల దూరంలో లెవల్ క్రాసింగ్ గేటు నంబరు 497ఏ ఉండేది. రైళ్లు, గూడ్స్‌ల షంటింగ్ కారణంగా తరచుగా గేటు మూసేయాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. దాంతో అప్పట్లో జాతీయ రహదారుల శాఖ ఆర్‌వోబీని ప్రతిపాదించింది. ఇందుకు రైల్వే శాఖ కూడా ఆమోదం తెలపడంతో 1958 ఆగస్టు 4న అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి నాటి మునిసిపల్ కౌన్సిల్ చైర్మన్ ఎన్‌వీఎల్ నరసింహారావు, చీఫ్ ఇంజనీర్ (హైవేస్) ఆంధ్రప్రదేశ్ ఎన్.దురాని కూడా హాజరయ్యారు. అప్పటి ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.8.37 లక్షల అంచనా విలువతో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. బ్రిడ్జికి ఉత్తరం వైపున అప్రోచ్ రోడ్డు పొడవు 793 అడుగులు, పిల్లర్ల నుంచి 446 అడుగులు, దక్షిణ వైపున అప్రోచ్ పొడవు 583 అడుగులు, పిల్లర్ల నుంచి 334.5 అడుగుల మేరకు బ్రిడ్జిని నిర్మించారు. రైళ్ల రాకపోకలకు వీలుగా బ్రిడ్జి కింద నాలుగు కానాలు నిర్మించారు. బ్రిడ్జి పైన రోడ్డు మార్గం 24 అడుగులు, కాలి బాటలు ఇరువైపులా 6 అడుగుల చొప్పున నిర్మించారు.

పెరిగిన వాహనాల రద్దీ

కాగా 2001కి ముందు వరకు నగరంలో పెద్దగా వాహనాల సంచారం ఉండేది కాదు. దాంతో బ్రిడ్జిపై ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఎప్పుడైతే కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య పెరిగిందో అప్పటి నుంచి ఈ ఆర్‌వోబీపై ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ వచ్చింది. దాంతో ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి మధ్యలో తాత్కాలిక ప్లాస్టిక్ డివైడర్ స్తంభాలు ఏర్పాటు చేసి కొంత మేరకు వాహనాలు ఒక దాని వెంట ఒకటి వెళ్లేలా చేశారు. ఆర్ అండ్ బీ డిపార్టుమెంట్ అడపాదడపాగా మరమ్మతులు నిర్వహించేది. కాలిబాటల్లపై పలుమార్లు టైల్స్ నిర్మించింది. బ్రిడ్జి పైన హాట్ మిక్స్‌తో రోడ్డు వేయడం వల్ల ఫుట్‌పాత్‌ల ఎత్తు తగ్గిపోయాయి. దాంతో వాటిపై కూడా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మించాలన్న ఆలోచన 2004లోనే జరిగింది. అయితే ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితం అయ్యాయి తప్పా కార్య రూపం దాల్చలేదు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సేతు బంధన్ స్కీమ్ కింద ఈ ఆర్‌వోబీ నిర్మాణాన్ని శాంక్షన్ చేసింది. అయితే పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని రూ. 98 కోట్ల నిధులు మంజూరు చేయించి పాత బ్రిడ్జి స్థానంలో నూతన ఆర్‌వోబీని నిర్మింప చేస్తున్నారు. కాగా శుక్రవారం చాలామంది పాత బ్రిడ్జి వద్దకు చేరుకొని తీపి జ్ఞాపకాలుగా డిజిటల్‌లో భద్రం చేసుకొనేందుకు ఫోటోలు దిగారు.

కొత్త బ్రిడ్జి సాంకేతిక అంశాలు

సెంట్రల్ డివైడర్, ఫుట్‌పాత్‌లు కలుపుకొని మొత్తం 21.550 మీటర్ల వెడల్పుతో ఈ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మొత్తం 930 మీటర్ల పొడవునా.. ఈ వంతెనలో జీజీహెచ్ వైపు 168 మీటర్ల ఆర్ఈ(రీయిన్‌ఫోర్స్‌డ్ ఎర్త్) వాల్ 168 మీటర్లు, వయాడక్ట్ స్పాన్‌లు 11 నంబర్లు కలిపి 253 మీటర్లు, రైల్వే భాగం 64 మీటర్లు, అరండల్‌పేట వైపున వయాడక్ట్ స్పాన్‌లు 10 నంబర్లు కలిపి 230 మీటర్లు, ఆర్ఈ వాల్ 215 మీటర్ల పొడవునా నిర్మిస్తారు. 23 అడుగుల వెడల్పుతో రెండు వైపులా సర్వీసు రోడ్లను నిర్మిస్తారు. బ్రాడీపేట నాల్గో లైను, అరండల్‌పేట ఐదో లైను, జీజీహెచ్ వద్ద అండర్‌పాస్‌లు సదుపాయాలుంటాయి. ఉమెన్స్ కాలేజ్ జంక్షన్ నుంచి ఏసీ కళాశాల వైపునకు 100 మీటర్ల దూరంలో బ్రిడ్జి ప్రారంభమవుతుంది. అరండల్‌పేట వైపు నుంచి సులభతరంగా ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోకి వెళ్లిపోవచ్చు. ప్రస్తుత ఆర్‌వోబీ రైల్వేట్రాక్ కంటే 5.9 మీటర్ల ఎత్తులో ఉంది. దీనిని మారిన రైల్వే నిబంధనల ప్రకారం 9 మీటర్ల ఎత్తుకు నూతన బ్రిడ్జిని పెంచ బోతున్నారు. అరండల్‌పేట వైపున 8 - 9 లైన్ల మధ్యన ఈ బ్రిడ్జి ప్రారంభమవుతుంది. 2028 లోపే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభింప చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకొని ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రెండు పిల్లర్ల నిర్మాణం పూర్తి అయింది.

నకిలీ యజమానిని ఫొటో పట్టిచ్చేస్తుంది..

● రిజిస్ట్రేషన్ల అక్రమాలకు చెక్

● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు చెక్ పడనుంది. ఎవరినో తీసుకువచ్చి ఇతనిదే భూమి అని చెప్పి దొంగ రిస్ట్రేషన్ చేయించడం ఇకపై కుదరదు. గతంలో ఒకే పేరు ఉన్న వ్యక్తులను తీసుకు వచ్చి ఆధార్ మార్పులు(నకిలీ) చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిస్ట్రేషన్‌లు సైతం జరిగాయి. వీటన్నిటికీ ఇకపై చెక్ పడనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో పలు మార్పులు ప్రభుత్వం చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. దీంతో భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చినా తెలిసేది కాదు. మార్పుల నేపథ్యం సంబంధిత వ్యక్తి ఆధార్ నంబర్ చెప్పగానే అందులో ఉన్న ఫొటో ప్రిపరేషన్ డేటాలో వస్తుంది. మూడురోజుల నుంచి ఈ విధానం అమలవుతోంది.

కొనుగోలు దారుని చేతికే డాక్యుమెంటు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంటును కొనుగోలు దారునికే ఇవ్వనున్నారు. ఈ విషయంలో గతంలో క్రయ, విక్రయ దారులు ఇబ్బందులు పడేవారు. కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంటు రైటర్లు ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వావత డాక్యుంటును సంబంధిత వ్యక్తికి అందజేస్తారు.

ఓటీపీ ఇక్కట్లు

నూతన విధానంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. వన్ టెమ్ పాస్ వర్డ్ వల్ల కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మొబైల్ ఫోన్‌ను ఆధార్‌కు లింకు చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చి కూడా డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి తలెత్తుతుందని డాక్యుమెంటు రైటర్లు చెబుతున్నారు. చదువురాని వారు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా వచ్చే మెసేజ్‌లు అర్థం కాక.. ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. ఆధార్ నంబరు నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే సరిపోతుందని అంటున్నారు.

ఫొటోల ద్వారా తెలిసి పోతుంది

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పుడు ఆదార్ ఓటీపి విదానంతో ఫోటో వస్తుంది. దీంతో సంబందిత వ్యక్తి అసలా..నకిలా.. అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీని వల్ల మోసాలకు తావు ఉండదు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంటును కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. థంబ్ వేయడం ద్వారా సంబంధిత వ్యక్తి తీసుకోవాల్సి ఉంటుంది.

- అశోక్, సబ్ రిజిస్ట్రార్, సత్తెనపల్లి

ఆరోగ్యానికి భరోసా..

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు

సత్తెనపల్లి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు(ఆరోగ్యశ్రీ) సేవలు పల్నాడు జిల్లాలో రోగులకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 3,257 రకాల వ్యాధులకు.. ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. పేదలే కాదు కార్డులు ఉన్న ఉన్నత స్థాయి వర్గాల వారు సేవలు పొందుతున్నారు. కార్డులేని అర్హులకు కూడా వైద్యసేవలకు సీఎంఓ అనుమతులు ఇప్పిస్తున్నారు.

కార్డు లేకుంటే ఎవరిని సంప్రదించాలి

ఆరోగ్యశ్రీ కార్డులేని అర్హులు అనారోగ్యానికి గురై నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్ళి ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి. వారు జిల్లా సమన్వయ కర్త కార్యాలయానికి వివరాలు తెలియజేస్తారు. అర్హతను పరిశీలించి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అధకారికంగా.. అదికారికంగా అనుమతులు తీసుకుని వైద్యసేవలు అందేలా చర్యలు చేపడతారు.

ఆరోగ్య మిత్రల వ్యవస్థ

ఆరోగ్య మిత్ర వ్యవస్థ ఉంది. పూర్తి ఉచితంగా సేవలు అందించి. డిశ్చార్జ్ తర్వాత రవాణా చార్జీలు అందజేస్తారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. అదనంగా డబ్బులు తీసుకుంటే 104, 14400 టోల్‌ఫ్రీ నంబర్లకు ఆరోగ్యమిత్రలకు పిర్యాదు చేయవచ్చు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం 9 ఆగస్టు 2025

అనురాగం



అపురూప బంధం

బాలీవుడ్‌లో స్టార్లుగా ఎదిగిన అన్నాచెల్లెళ్లు చాలామందే ఉన్నారు. కానీ రక్తం పంచుకొని పుట్టకపోయినా... తోబుట్టువుల్లా అపురూప బంధాన్ని కొనసాగిస్తున్న తారలు అరుదుగా కనిపిస్తారు. వారే వీరు...

ఐశ్వర్యా రాయ్- సోనూసూద్



రీల్ లైఫ్‌లో కనిపించిన బంధాలు కొన్ని రియల్ లైఫ్‌లోనూ కొనసాగుతుంటాయి. అది మనసులు కలిపే ప్రేమ బంధమే కానక్కర్లేదు. అన్నాచెల్లెళ్ల అనురాగ బంధమూ కావచ్చు. అలాంటిదే ఐశ్వర్యా రాయ్, సోనూసూద్‌ల అనుబంధం. హృతిక్ రోషన్ హీరోగా చేసిన 'జోధా అక్బర్' చిత్రంలో వీరిద్దరూ తోబుట్టువులుగా నటించారు. ఈ అన్నాచెల్లెళ్ల బంధం నిజ జీవితంలోనూ కొనసాగుతోంది. సినిమా సెట్‌లో రాఖీ కట్టినప్పటి నుంచీ సోనూ ఆమెకు తన సొంత సోదరి కంటే ఎక్కువగా ప్రేమానురాగాలు పంచుతున్నారు.

అలియాభట్- యష్ జోహార్



బాలీవుడ్ అగ్ర కథానాయికల్లో ఒకరు అలియా భట్. అద్భుతమైన అభినయంతో వెండితెరపై పాత్రను ఎంతలా పండిస్తున్నారో... నిజ జీవితంలోనూ ఇల్లాలిగా, తల్లిగా, తనయగా అంతే సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అంతేకాదు... ఆమెకు రాఖీ పండుగ చాలా ప్రత్యేకం. శ్రావణ పౌర్ణమినాడు స్టార్ దర్శకనిర్మాత కరణ్ జోహార్ తనయుడు యష్ జోహార్‌కు అలియా రాఖీ కట్టడం... కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక ఆనవాయితీ. పరిశ్రమలోకి అడుగుపెట్టకముందు నుంచీ కరణ్‌తో ఆమెకు మంచి స్నేహం ఉంది. వాళ్ల ఇంట్లో ఒక కుటుంబ సభ్యురాలిగా మెలుగుతున్నారు.

కరీనా కపూర్- మనీష్ మల్హోత్రా



కపూర్‌ల వారసురాలిగా బాలీవుడ్‌లో అడుగు పెట్టింది మొదలు... కరీనా కపూర్ పేరు నిత్యం వార్తల్లో ఉంటోంది. ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. చూపు తిప్పుకోనివ్వని అందంతో... మంత్రముగ్ధులను చేసే హావభావాలతో కోట్లమంది అభిమానులను సంపాదించుకున్నారు. స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌ను ప్రేమించి, పెళ్లి చేసుకొని, బిడ్డకు జన్మనిచ్చిన కరీనా... సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో మళ్లీ బిజీగా మారారు. కెరీర్‌లో తనతో కలిసి ప్రయాణించి, తన ఎదుగుదలలో భాగమైనవారిని తన కుటుంబ సభ్యులుగా భావిస్తారు. అలాంటివారిలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఒకరు. ప్రతి సంవత్సరం అతనికి కరీనా రాఖీ కడుతున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో దృఢమైన అన్నాచెల్లెళ్ల బంధాల్లో ఒకటిగా చెప్పుకొనే వీరి అనురాగబంధం ఇవాల్టిది కాదు... ఎన్నో ఏళ్లనాటిది.

గౌరీఖాన్- సాజిద్‌ఖాన్

హీరో షారూక్ ఖాన్ సతీమణిగానే కాకుండా... నిర్మాతగా, ఇంటీరియర్ డిజైనర్‌గా పేరు సంపాదించిన వ్యక్తి గౌరీఖాన్. 'హౌస్‌ఫుల్' వరుస చిత్రాల దర్శకుడు, హాస్య నటుడు... సాజిద్‌ఖాన్. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్‌తో గౌరీకి మొదటి నుంచీ మంచి స్నేహం. ఆమె ద్వారా సాజిద్ పరిచయమయ్యారు. నాటి నుంచీ అతడు గౌరీ కుటుంబంలో ఒక సభ్యుడయ్యారు. ఏటా క్రమం తప్పకుండా సాజిద్‌కు ఆమె రాఖీ కడుతున్నారు. చాలా సందర్భాల్లో సాజిద్ ఈ విషయం పంచుకున్నారు.





కత్రినా కైఫ్- అర్జున్ కపూర్



మోడల్‌గా మెరిపించి... తారగా వెలిగిన కత్రినా కైఫ్... హీరో విక్కీ కౌశల్‌తో పెళ్లి తరువాత సినిమాలు తగ్గించారు. నచ్చిన ప్రాజెక్టులు మాత్రమే చేస్తూ కుటుంబం కోసం సమయం కేటాయిస్తున్నారు. నటుడు అర్జున్ కపూర్. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ తనయుడుగా రంగప్రవేశం చేసినా, హీరోగా ఆశించిన విజయాలు అందుకోలేకపోయారు. అయితే అగ్రనటుడు సల్మాన్‌ఖాన్ ద్వారా కత్రినాకు పరిచయమైన అర్జున్... నేటికీ ఆమెతో ఆత్మీయ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అర్జున్‌ను తన తమ్ముడిలా చూసుకొంటూ ఆప్యాయతలు పంచుతోంది కత్రినా. ఏటా రక్షాబంధన్ రోజున అతడికి రాఖీ కడుతున్నారు.

బంగారు రాఖీ కొంటున్నారా?

రాఖీ.. మన భారతీయ సంస్కృతిలో సోదరీ,సోదరుల మధ్య అనుబంధానికి ఒక ప్రతీక. ప్రతి ఏడాది ఈ పండుగను కోట్ల మంది జరుపుకుంటూ ఉంటారు. కొందరు వెండి లేదా బంగారు రాఖీలను కూడా తమ సోదరులకు కడుతూ ఉంటారు.

సోదరుడి జాతకంలో చంద్రుడి వల్ల కలిగే సమస్యలకు వెండి రాఖీ పరిష్కారమని కొందరు నమ్ముతూ ఉంటారు. అంతే కాకుండా మానసిక ప్రశాంతతకు వెండిని చిహ్నంగా కూడా భావిస్తూ ఉంటారు. ఇక బంగారాన్ని తమ సోదరుడికి ఇచ్చే బహుమతిగా కొందరు భావిస్తూ ఉంటారు. ఇంకొందరు రాఖీ పండుగకు బంగారపు రాఖీలు కొని దాచుకుంటూ ఉంటారు.

వెండి లేదా బంగారు రాఖీలను కొనే ముందు తీసుకో వాల్సిన జాగ్రత్త లేమిటో తెలుసుకుందాం..

- సాధారణంగా వెండి లేదా బంగారపు రాఖీలు 14 క్యారెట్లు లేదా 18 క్యారెట్లతో తయారుచేస్తారు. ఇలా తయారుచేసిన రాఖీలు ఏవైనా వస్తువులు తయారు చేయించు కోవటానికి వీలుగా ఉంటాయి.
- రాఖీ కట్టించుకొనే వ్యక్తి వ్యక్తిత్వానికి తగినట్లుగా రాఖీలను కొంటే బావుంటుంది. ఈ మధ్యకాలంలో 'ఓం' చిహ్నంతో ఉన్న రాఖీలకు మంచి డిమాండ్ ఉంది.



- కొన్ని రకాల బంగారు లేదా వెండి రాఖీలను పెండెంట్‌ల కింద కూడా వాడుకోవచ్చు.
- షాపుకు వెళ్లే ముందే ఎన్ని గ్రాముల బంగారం లేదా వెండి రాఖీని కొనాలనే విషయాన్ని నిర్ణయించుకొని వెళ్తే మంచిది.
- ఈ మధ్యకాలంలో పేరున్న జ్యూయలరీ సంస్థలన్నీ వెండి లేదా బంగారు రాఖీలను విక్రయిస్తున్నాయి. అలాంటి సంస్థల నుంచి కొనుగోలు చేస్తే గ్యారంటీ కూడా ఉంటుంది.

మేకప్



తడికి చెదరకుండా..

వానాకాలం ఎన్ని జాగ్రత్తలు పాటించినా, అడపాదడపా తడుస్తూనే ఉంటాం. ఇలా తడిచిన ప్రతి సారీ మేకప్ సరిచేసుకోవడం అన్ని సార్లూ వీలుపడదు. కాబట్టి ఈ కాలానికి తగిన మేకప్ ఎంచుకోవాలి.

పరిశుభ్రం: మేకప్‌కు తగ్గట్టు ముఖ చర్మం శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖం మీద తేమ, జిడ్డులను తొలగించుకుని ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టుకోవాలి.

మాయిశ్చరైజర్: పగటివేళ ఆయిల్ ఫ్రీ మాయిశ్చరైజర్ మాత్రమే ఉపయోగించాలి. ముఖం జిడ్డుగా మారకుండా ఉండడానికి ఇది తోడ్పడుతుంది.

సన్ ప్రొటెక్షన్: వానాకాలం కదా అని సన్‌స్క్రీన్ మానుకోకూడదు. ఈ కాలంలో కూడా 30 కంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత సన్‌స్క్రీన్, ఆ తర్వాత ఫౌండేషన్ సరైన ఛాయిస్.

ప్రైమర్: మేకప్ వన్నె తగ్గకుండా ఉండాలంటే ప్రైమర్ కూడా తప్పనిసరిగా వాడాలి. ముడతలను కనపడనివ్వకుండా చేసే ప్రైమర్‌తో యంగర్ లుక్ వస్తుంది.

తక్కువ మేకప్: ముఖం మీద మేకప్ ముద్దలు కట్టకుండా, గీతలు పడకుండా ఉండాలంటే, వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. తప్పనిసరి అయితే టింటెడ్ మాయిశ్చరైజర్, కన్‌సీలర్లను ఉపయోగించుకోవచ్చు.

బ్రాంజర్: కళ్లు ఆకర్షణీయంగా కనిపించాలంటే బ్రాంజర్ వాడుకోవాలి. తాజాగా, సహజసిద్ధ సౌందర్యంతో మెరిసిపోవాలంటే నుదురు, చీక్ బోన్స్, చుబుకం, ముక్కు మీద బ్రాంజర్ అప్లై చేయాలి. ఈ కాలంలో క్రీమ్ రూపంలోని బ్రాంజర్లనే ఎంచుకోవాలి.

షిమ్మర్ వద్దు: అవసరానికి మించిన మెరుపులు ఈ కాలంలో ఎబ్బెట్టుగా ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో షిమ్మర్‌ను వాడకపోవడమే మంచిది.

బ్లష్: ఈ కాలంలో పౌడర్ బ్లష్‌లకు బదులుగా జెల్ బ్లష్ వాడుకోవాలి.

లిప్‌స్టిక్: ముదురు రంగు లిప్‌స్టిక్‌లకు బదులుగా హాయిగొలిపే లేత గులాబీ, లేత నారింజ రంగులను ఎంచుకోవాలి.

భోజన కుతూహలం

మధుమేహానికి దొండాకులే మందు..!

మన పూర్వుల ఆహార అలవాట్లు చాలా విశిష్టమైనవి. వాళ్లకు ఆహార కరువు తెలీదు. ఎందుకంటే ప్రకృతిలో కంటికి కనిపించే ఎన్నో ఆకుల్ని, కాయల్ని, పూలని, దుంపల్ని వాళ్లు ఆహారంగా మలచుకుని తిన్నారు.

దొండ ఆకుల పచ్చడి చేయటం ఇలా...

దొండ ఆకులను శుభ్రంగా కడిగి.. సన్నగా తరగాలి. ఈ ఆకులను ఉప్పు నీళ్లలో వేసి బాగా ఉడికించాలి. ఆ తర్వాత ఈ ఆకులకు నేతితో తాలింపు పెట్టాలి. కొద్దిగా ఇంగువ వేయాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.

అలాంటి వాటిలో దొండ ఆకులు కూడా ప్రధానమైనవి. చాలా మంది దొండ ఆకులు వగరుగా ఉంటాయనుకుంటారు. కానీ ఈ ఆకులు కూడా దొండకాయల రుచిలోనే ఉంటాయి. వీటితో కూర, పప్పు, పచ్చడి మొదలైనవి చేసుకోవచ్చు. మన ఆయుర్వేద గ్రంధాల ఆధారంగా దొండ ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం.

- దొండ ఆకులు అమితంగా చలవ చేస్తాయి. వాతాన్ని తగ్గిస్తాయి. అదే సమయంలో శరీరంలో వేడిని కూడా తగ్గిస్తాయి.
- కామెర్ల వ్యాధికి దొండాకుల రసం మంచి మందు. దొండ ఆకుల రసాన్ని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా ఒక కప్పుడు తాగితే కామెర్లు తగ్గుతాయి.
- దొండ ఆకులు రక్తహీనతను తగ్గిస్తాయి. రక్తపుష్టినిస్తాయి.
- దొండ ఆకుల రసం క్రమం తప్పకుండా తాగితే శరీరంలో కొవ్వు కరుగుతుంది. స్థూలకాయం తగ్గుతుంది.
- పురుషుల్లో లైంగిక బలహీనతను నివారించే గుణం దొండాకులకుంది.
- దొండ ఆకులను ఎండబెట్టి పొడిచేసి నీటిలో కలుపుకుని ప్రతి రోజూ తాగితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. దొండ ఆకులు మాత్రమే కాకుండా.. దొండ పువ్వులు, దొండ వేర్లు కూడా మధుమేహ వ్యాధి నివారణకు పనికొస్తాయి.
- పక్క తడిపే పిల్లలకు దొండ ఆకులు, దొండవేళ్లు కలిపి నూరిన పసరును తేనెతో కలిపి తాగిస్తే వారిలో మార్పు వస్తుంది.



● గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

కొబ్బరి పాలతో నోరూరేలా..



రాఖీ పండక్కి అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు, బంధుమిత్రులు అందరూ ఒక చోట కలుసుకుంటూ ఉంటారు. ఈ సమయంలో ఏవైనా స్పెషల్ వంటకాలు చేస్తే ఆ ఆనందం రెట్టింపవుతుంది. ఎక్కువ శ్రమ పడకుండా తక్కువ సమయంలో పూర్తయ్యేవి అయితే ఇంకా బాగుంటుంది. కొబ్బరిపాలతో తయారుచేసే అలాంటి విభిన్న వంటకాలు మీకోసం...

కొబ్బరిపాల పలావ్

కావాల్సిన పదార్థాలు


బియ్యం- ఒక గ్లాసు, పచ్చి కొబ్బరి చిప్ప- ఒకటి, నెయ్యి- రెండు చెంచాలు, బిరియానీ ఆకు- ఒకటి, దాల్చిన చెక్క- చిన్న ముక్క, మిరియాలు- 15, లవంగాలు- మూడు, యాలకులు- రెండు, జీలకర్ర- అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- ఆరు, జీడి పప్పు- కొద్దిగా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, కేరట్ ముక్కలు- పావు కప్పు, ఆలుగడ్డ ముక్కలు- పావు కప్పు, బీన్స్ ముక్కలు- పావు కప్పు, ఉప్పు- రెండు చెంచాలు, తరిగిన కొత్తిమీర- కొద్దిగా, గరం మసాల పొడి- అర చెంచా

చిట్కాలు

- ఈ పలావ్‌లో క్యాలీ ఫ్లవర్, క్యాప్సికమ్ ముక్కలు కూడా వేసుకోవచ్చు.
- కొబ్బరి పాలను చిక్కగా తయారు చేసుకుంటే పలావ్ రుచిగా ఉంటుంది.

తయారీ విధానం

- బియ్యాన్ని కడిగి మునిగేంత వరకు నీళ్లు పోసి ఉంచాలి. కొబ్బరి చిప్పను చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో కొబ్బరి ముక్కలు వేసి రెండున్నర గ్లాసుల నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. స్టయినర్ సహాయంతో ఈ మిశ్రమం నుంచి కొబ్బరి పాలను గిన్నెలోకి వడబోయాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. తరవాత బిరియానీ ఆకు, కరివేపాకు, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలు, యాలకులు, జీడి పప్పు, జీలకర్ర వేసి దోరగా వేయించాలి.



తరవాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, కేరట్ ముక్కలు, ఆలుగడ్డ ముక్కలు, బీన్స్ ముక్కలు, కొత్తిమీర, గరం మసాల పొడి వేసి మరో అయిదు నిమిషాలు వేయించాలి. తరవాత ఆ మిశ్రమంలో నానబెట్టిన బియ్యం వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత రెండు గ్లాసుల కొబ్బరిపాలు, ఉప్పు వేసి బాగా కలపాలి. కుక్కర్‌కు మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న కొబ్బరి పాల పలావ్‌ను ఏదైనా గ్రేవీ కర్రీ లేదా రైతాతో సర్వ్ చేసుకోవచ్చు.

కొబ్బరిపాల జున్ను

కావాల్సిన పదార్థాలు

పచ్చి కొబ్బరి ముక్కలు- ఒకటిన్నర కప్పులు, నీళ్లు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- నాలుగు చెంచాలు, బెల్లం- అర కప్పు, యాలకులు- మూడు, మిరియాల పొడి- అర చెంచా

తయారీ విధానం



- మిక్సీలో పచ్చి కొబ్బరి ముక్కలు, నీళ్లు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమం నుంచి కొబ్బరి పాలను స్టయినర్ సహాయంతో గిన్నెలోకి వడబోయాలి. మరో చిన్న గిన్నెలో కార్న్‌ఫ్లోర్ వేసి అందులో కొన్ని కొబ్బరి పాలు పోసి ఉండలు లేకుండా జారుగా కలపాలి. ఈ కార్న్‌ఫ్లోర్ మిశ్రమాన్ని కొబ్బరిపాల గిన్నెలో పోసి బాగా కలపాలి. తరవాత అందులో యాలకుల పొడి, మిరియాల పొడి వేసి కలపాలి. ఈ గిన్నె మీద మూత పెట్టాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. తరవాత అందులో కొబ్బరి పాల గిన్నె ఉంచి కుక్కర్‌కు మూతపెట్టాలి. విజిల్ పెట్టకూడదు. అరగంటసేపు చిన్న మంట మీద ఉడికించాలి. తరవాత ఈ గిన్నెను బయటికి తీసి చల్లార్చాలి. ఇలా తయారుచేసుకున్న కొబ్బరిపాల జున్నును అరగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తరవాత ముక్కలుగా కోసి సర్వ్ చేసుకోవాలి.

చిట్కాలు

- ఇందులో జీడిపప్పు, బాదం పలుకులు వేస్తే రుచి మరింత పెరుగుతుంది.
- కొబ్బరి ముక్కలకు వెనక ఉన్న నల్లని భాగాన్ని తీసివేస్తే జున్ను ముక్కలు చూడడానికి బాగుంటాయి.

అట్టహాసంగా ఏపీఎల్ ప్రారంభం



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీ శుక్రవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని కార్యవర్గం క్రికెటర్లతో ఆటలాడుకున్న నేపథ్యంలో ఏపీఎల్-4 టోర్నీలో కొత్త మార్పులు తీసుకువచ్చి ప్రతిభకు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం మరో ముఖ్య అతిథి, సినీ నటుడు వెంకటేష్‌తో కలిసి తొలి మ్యాచ్‌లో తలపడుతున్న అమరావతి రాయల్స్-కాకినాడ కింగ్స్ జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకుని అభినందించారు. ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీశ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్, మిథాలీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా బాక్సింగ్‌లో అదే జోరు

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. మరో పది మంది బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన పోటీల్లో అండర్-19 విభాగం నుంచి మహిళల్లో నిషా (54 కిలోలు), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిత (65 కి), ఆర్తి కుమారి (75 కి), క్రితిక (80 కి), పర్చి టొకాస్ (80+ కి), పురుషుల్లో సుహాగ్ (65 కి), రాహుల్ కుందు (75 కి), హేమంత్ సాంగ్వాన్ (80 కి) సెమీఫైనల్స్‌లో ప్రత్యర్థులను ఓడించి తుదిపోరులో నిలిచారు. కాగా.. యషిక (51 కి), ఆకాంక్ష (70 కి), శివమ్ (55 కి), గౌరవ్ (85 కి) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

అర్జున్ డ్రా చేశాడు

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీని విజయంతో ప్రారంభించిన తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి..రెండో రౌండ్‌ను ఫలితం లేకుండా ముగించాడు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారికకు వరుసగా రెండో రౌండ్ లోనూ పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన మాస్టర్స్ విభాగం రెండో రౌండ్‌లో డచ్ జీఎం జోర్డెన్ వాన్ ఫోరీస్ట్‌తో తలపడిన టాప్‌సీడ్ అర్జున్ 42 ఎత్తులలో డ్రా చేసుకున్నాడు. భారత్‌కు చెందిన ప్రణవ్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్న విన్సెంట్ కీమర్ (జర్మనీ) 46 ఎత్తుల్లో విజయంతో గట్టెక్కాడు. చాలెంజర్స్ కేటగిరీలో..పన్నీర్ సెల్వమ్ ఇనియన్ చేతిలో హారిక ఓటమి చవిచూసింది.

'లీడ్స్' పిచ్ ఉత్తమం

లండన్: అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలోని టెస్టు స్టేడియాల పిచ్‌లపై ఐసీసీ రేటింగ్ ఇచ్చింది. అయితే ఇందులో ఆఖరి టెస్టు జరిగిన ఓవల్ మైదానానికి ఇంకా రేటింగ్ ఇవ్వలేదు. మిగతా నాలుగింట్లో తొలి టెస్టుకు వేదికగా నిలిచిన లీడ్స్ స్టేడియం పిచ్‌తో పాటు అవుట్‌ఫీల్డ్ కూడా చాలా బాగుందని కితాబిచ్చింది. ఇక ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్‌ట్రాఫోర్డ్ పిచ్‌లు సంతృప్తికరంగా ఉన్నా..వీటి అవుట్‌ఫీల్డ్ మాత్రం చాలా బాగున్నట్టు ప్రకటించింది.

భారత షట్లర్లకు సులువైన డ్రా

● ప్రపంచ జూ. టీమ్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ జట్టుకు ప్రపంచ జూనియర్ టీమ్ చాంపియన్‌షిప్‌లో సులువైన డ్రా ఎదురైంది. హాంకాంగ్, నేపాల్, ఘనాలాంటి పసికూన జట్లతో కలిపి భారత్‌కు గ్రూప్-హెచ్‌లో చోటు దక్కింది. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ వచ్చే అక్టోబరు 6 నుంచి 11 వరకు అసోం రాజధాని గువాహటిలో జరగనుంది. మొత్తం 37 జట్లు 8 గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. ప్రతి గ్రూప్‌లో విజేతగా నిలిచిన జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. టోర్నీ టాప్‌సీడ్ థాయ్‌లాండ్ గ్రూప్-ఎలో డెన్మార్క్, స్లోవేనియా, కుక్ ఐలాండ్ జట్లతో కలిసి తలపడనుంది. ప్రతి జట్టు పురుషులు, మహిళల సింగిల్స్, పురుషులు, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

ఆటగాడిగా గెలిచి.. జీవితంలో ఓడి..



అనారోగ్యంతో కన్నుమూసిన ఖోఖో మాజీ ఆటగాడు సారంగపాణి



ఖోఖో క్రీడనే ప్రాణంగా భావించి.. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి, దేశానికి ఎన్నో పతకాలు అందించాడు. కానీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం పేదరికం, కష్టాలతో సహవాసం చేశాడు. బతికినంతకాలం ఆర్థిక ఇబ్బందులతోనే సతమతమై, చివరకు అనారోగ్యంతో ప్రాణాలు విడిచాడు. అతనే తెలంగాణకు చెందిన ఖోఖో మాజీ ఆటగాడు, 50 ఏళ్ల సారంగపాణి. అంతర్జాతీయ పోటీల్లో 21 సార్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన సారంగపాణి.. శుక్రవారం ఉదయం తన స్వస్థలమైన వరంగల్‌లో అనారోగ్యంతో తుది శ్వాస విడిచాడు.

ఆటలో అదరగొట్టినా..

తొంభయ్యో దశకంలో భారత ఖోఖోలో తిరుగులేని డిఫెండర్‌గా పేరు తెచ్చుకున్న సారంగపాణి.. కోల్‌కతా వేదికగా 1996లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో టీమిండియా స్వర్ణ పతకం గెలవడంలో ముఖ్య భూమిక పోషించాడు. 1999లో మణిపూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తన సారథ్యంలో కాంస్య పతకం అందించాడు. జాతీయ, రాష్ట్రస్థాయిలో సుమారు 30కిపైగానే పతకాలు కొల్లగొట్టాడు. అమోఘమైన ప్రదర్శనతో తన క్రీడలో వెలుగొందిన అతను.. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక జీవితంలో మాత్రం ఓడిపోయాడు.

సరైన గుర్తింపు, ఉపాధి లేక..

క్రీడాకారుడిగా కెరీర్ ముగిశాక సారంగపాణి కొన్నాళ్లు వరంగల్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కాంట్రాక్టు కోచ్‌గా పని చేశాడు. ఆ తర్వాత నిధుల కొరతతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో.. నాయీ బ్రాహ్మణుడైన సారంగపాణి కుల వృత్తి చేసుకుంటూ జీవనం వెళ్లదీశాడు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడినైన తనకు కనీసం చిన్న ఉద్యోగం కానీ, నగదు ప్రోత్సాహకం కానీ లభించక పోవడంపై సారంగపాణి తరచూ మదనపడేవాడని అతని సన్నిహితులు తెలిపారు. కోచ్‌గా కాకపోయినా, కనీసం స్వీపర్ ఉద్యోగమైనా ఇవ్వాలని నెల రోజుల క్రితమే అతను కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగాడని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వారు వెల్లడించారు. ఇక, జీవితంలో స్థిరపడలేదన్న కారణంతో సారంగపాణి పెళ్లి కూడా చేసుకోలేదన్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి- హైదరాబాద్)

ప్రభుత్వాలు అండగా నిలవాలి

క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి కొన్ని క్రీడలకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల సారంగపాణిలాంటి ప్రతిభావంతులైన అంతర్జాతీయ క్రీడాకారులు ప్రపంచానికి తెలియకుండానే కనుమరుగవుతున్నారు. ఖోఖో, కబడ్డీ, వంటి గ్రామీణ క్రీడలతో పాటు స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ వంటి ఒలింపిక్ క్రీడల అభివృద్ధి, ఆ క్రీడాకారుల సంక్షేమంపై కూడా ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు దృష్టి పెట్టాలని క్రీడా విశ్లేషకులు కోరుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత వాళ్లకు ఏదో ఒక విధంగా ఉపాధి కల్పించాలని సూచిస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!



● విరాట్ కోహ్లీ బ్యాటు పట్టాడు
● అక్టోబరులో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్
● లండన్‌లో ప్రాక్టీస్ ప్రారంభించిన టీమిండియా స్టార్

లండన్: భారత జట్టు తదుపరి వన్డే సిరీస్ మరో రెండు నెలలకుపైగానే ఉంది. వచ్చే అక్టోబరులో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న టీమిండియా పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడనుంది. అందులో భాగంగా మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-ఆస్ట్రేలియా ఢీకొననున్నాయి. అక్టోబరు 19న వన్డే సిరీస్ మొదలు కానుంది. వాస్తవంగా ఈ ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనలో భారత్ వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ ఆ సిరీస్ రద్దయింది. ఇక..భారత జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు సన్నాహకాలు మొదలు పెట్టాడు. విరాట్ చివరిసారి మైదానంలో కనిపించి రెండు నెలలకుపైగానే అయ్యింది. ఇక..ఇటీవల టెస్టులు, అంతకుముందు టీ20లనుంచి రిటైర్ అయిన కోహ్లీ..ఐపీఎల్ అనంతరం లండన్ వెళ్లిపోయి అక్కడే ఉంటున్నాడు. వింబుల్డన్ మ్యాచ్‌లకు హాజరు కావడంతోపాటు, లండన్‌లో యువరాజ్ సింగ్ తన ఫౌండేషన్‌కోసం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాత్రమే విరాట్ కనిపించాడు. మొత్తంగా మెగా లీగ్ అనంతరం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్న అతడు..వన్డేలలో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాడు. గుజరాత్ సహాయ కోచ్ నయీమ్ అమీన్‌తో కలిసి లండన్‌లోని ఓ ఇండోర్ స్టేడియంలో కోహ్లీ ప్రాక్టీస్ షురూ చేశాడు. ఈమేరకు ఆ ఫొటోను అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

నన్నూ వదిలేయండి

సీఎస్‌కేకు అశ్విన్ విజ్ఞప్తి



చెన్నై: సంజూ శాంసన్ మాదిరే ఆర్.అశ్విన్ కూడా తన సొంత జట్టును వీడాలని భావిస్తున్నాడు. ఈమేరకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే ఇరు వర్గాల నుంచి ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడలేదు. పదేళ్ల తర్వాత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ గత సీజన్‌లోనే మళ్లీ చెన్నైకి ఆడాడు. 9 మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసిన ఈ వెటరన్‌ను మెగా వేలంలో రూ.9.75 కోట్లకు దక్కించుకుంది. అయితే 2022-2024 మధ్య రాజస్థాన్‌కు ఆడిన అశ్విన్ తిరిగి అదే జట్టులో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

ఇద్దరిని ఇస్తేనే..: రాజస్థాన్ కెప్టెన్ శాంసన్‌ను తీసుకోవాలనుకుంటున్న సీఎస్‌కేకు ఆ ఫ్రాంచైజీ ఓ షరతు విధించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి శాంసన్‌ను అతడి ధర రూ.18 కోట్లు ఇచ్చి చెన్నై తీసుకోవాలనుకుంది. అయితే రాజస్థాన్ మాత్రం నగదు కాకుండా శాంసన్‌కు బదులు ఇద్దరు సీఎస్‌కే ఆటగాళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తోందట. దీంతో ప్రస్తుతానికి ఈ విషయమై ప్రతిష్ఠంభన నెలకొంది. ఒకవేళ ఈ చర్చలకు పరిష్కారం లభించకపోతే శాంసన్ వేలానికి వెళ్లక తప్పదు.

హైదర్ అలీపై రేప్ కేసు

మాంచెస్టర్: పాకిస్థాన్ బ్యాటర్ హైదర్ అలీపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీంతో గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు ఈనెల 4న అతడిని అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. పాకిస్థాన్ షహీన్స్ జట్టు తరఫున ఇటీవల ఇంగ్లండ్‌లో పర్యటించిన హైదర్ గత నెల 23న ఓ మహిళపై అత్యాచారం చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. దీంతో అతడిపై పాక్ బోర్డు తాత్కాలిక నిషేధం విధించింది.

న్యూజిలాండ్ 601/3

బులవాయో: ముగ్గురు బ్యాటర్లు శతక మోత మోగించిన వేళ..జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ 476 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 174/1తో ఆట కొనసాగించిన కివీస్ జట్టులో రచిన్ (165 బ్యాటింగ్), హెన్రీ నికోలస్ (150 బ్యాటింగ్), కాన్వే (153) శతక్కొట్టారు. దాంతో రెండోరోజు ఆఖరికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 601 రన్స్ చేసింది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులే చేసింది.

ఆకాశ్ దీప్‌దే 'బాల్ ఆఫ్ ద సిరీస్'

ఇది సచిన్ మాట



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శనను సచిన్ ఎంతగానో కొనియాడాడు. అతడికి రావాల్సినంత గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. అయితే ఈ సిరీస్‌లో అత్యుత్తమ బంతిని విసిరింది మాత్రం ఆకాశ్‌దీప్ అని చెప్పాడు. రెండో టెస్టు నాలుగో రోజున అద్భుత ఇన్‌స్వింగర్‌తో జోరూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేశాడు. ఆ బంతినే సచిన్ 'బాల్ ఆఫ్ ద సిరీస్'గా ప్రకటించడం విశేషం. ఆ టెస్టులో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. కాగా ఐదో టెస్టు మూడో రోజు చివర్లో ఓపెనర్ క్రాలేను స్లో యార్కర్‌తో సిరాజ్ క్లీన్‌బౌల్డ్ చేసిన బంతి అద్భుతమంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఎస్‌బీఐ భళా



10% వృద్ధితో రూ.21,201 కోట్లకు లాభం
రూ.1,35,342 కోట్లకు పెరిగిన ఆదాయం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జూన్ త్రైమాసికానికి ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరుగుదలతో రూ.21,201 కోట్లకు చేరింది. ట్రెజరీ, ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆకర్షణీయ లాభాలు ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. ఈ క్యూ1లో బ్యాంక్ స్టాండ్ అలోన్ నికర లాభం 12 శాతం పెరిగి రూ.19,160 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి స్టాండ్ అలోన్ లాభం రూ.17,035 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం గత ఏడాదితో పోల్చితే రూ.1,22,688 కోట్ల నుంచి రూ.1,35,342 కోట్లకు పెరిగింది. మరిన్ని విషయాలు..

● ఈ క్యూ1లో మొత్తం రుణాలు 11.6 శాతం వృద్ధి చెందినప్పటికీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం 0.13% తగ్గి రూ.41,072 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) కూడా 0.33% క్షీణించి 3.02 శాతానికి జారుకుంది. ఆర్‌బీఐ రెపోరేటు తగ్గించడంతో పాటు డిపాజిట్ల రేట్లను దిగువకు సవరించేందుకు సమయం పట్టడం వడ్డీ మార్జిన్లపై ప్రభావం చూపింది. రెండో త్రైమాసికంలోనూ నికర వడ్డీ మార్జిన్‌పై ఒత్తిడి కొనసాగనుందని, ఆ తర్వాత మళ్లీ మెరుగుపడవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 3 శాతం ఎన్ఐఎంను లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు.

టారిఫ్‌ల ప్రభావం మాపై ఉండదు

ట్రంప్ సుంకాలతో నేరుగా ప్రభావితమవుతున్న 4-5 రంగాలకు బ్యాంక్ రుణాలిచ్చి ఉందని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. అయితే, మొత్తం రుణాల్లో వీటి వాటా 2 శాతం లోపే కాబట్టి, ట్రంప్ సుంకాల ప్రభావం బ్యాంకింగ్ రంగంపై ఉండదన్నారు. ప్రస్తుత అనిశ్చితులు మూడో త్రైమాసికానికల్లా సద్దుమణగవచ్చని ఎస్‌బీఐ ఎండీ అశ్వినీ కుమార్ పేర్కొన్నారు.

● క్యూ1లో వడ్డీయేతర ఆదాయం ఏకంగా 55% ఎగబాకి రూ.17,346 కోట్లకు చేరుకుంది. అందులో ఫారెక్స్ కార్యకలాపాల ద్వారా ఆదాయం 352% పెరిగి రూ.1,632 కోట్లకు చేరగా.. పెట్టుబడుల విక్రయంపై లాభం 144% వృద్ధితో రూ.6,326 కోట్లకు పెరిగింది.

● నిర్వహణ వ్యయాలు 7.88% పెరిగి రూ.27,874 కోట్లకు చేరినప్పటికీ, వ్యయ వృద్ధిని కట్టడం చేయడం లాభదాయకత మెరుగుపడేందుకు దోహదపడింది.

● బ్యాంక్ కార్పొరేట్ రుణాలు 5.7%, దేశీయ రిటైల్ రుణాలు 12.56%, విదేశీ రుణాలు 14% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి 12 శాతం మొత్తం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శెట్టి చెప్పారు. మొత్తం రూ.7 లక్షల కోట్ల రుణాలు ప్రస్తుతం పైప్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు మంజూరైన రుణాల విడుదలపై ప్రభావం చూపుతున్నాయని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి కార్పొరేట్ రుణాల మంజూరు పెరగవచ్చని, ఈ విభాగం వృద్ధి 10 శాతానికి పెరగవచ్చన్నారు. వినియోగ డిమాండ్‌పై స్పష్టత లేకపోవడంతో కంపెనీలు కొత్త పెట్టుబడులు పెట్టడంలేదన్నారు. పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్ల రంగాల నుంచి రుణాలకు అధిక డిమాండ్ నెలకొందని శెట్టి తెలిపారు.

● ఈ క్యూ1లో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) ఏ మార్పు లేకుండా 1.83 శాతంగా నమోదయ్యాయి. కాగా, కొత్తగా రూ.7,945 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి జారుకున్నాయి. మొండి బాకీలతోపాటు ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు రూ.4,759 కోట్లకు పెరిగాయి. 2024-25 క్యూ1లో బ్యాంక్ ఇందుకోసం రూ.3,449 కోట్లు కేటాయించింది.

● డిపాజిట్ల వృద్ధి 11.6 శాతంగా నమోదైంది. డిపాజిట్ల సేకరణ వ్యయం ఇప్పటికే పతాక స్థాయికి చేరిందని శెట్టి అన్నారు.

● అనుబంధ విభాగాలవారీగా చూస్తే, ఎస్‌బీఐ లైఫ్ నికర లాభం రూ.549 కోట్లకు పెరగగా.. ఎస్‌బీఐ కార్డ్ లాభం రూ.556 కోట్లకు తగ్గింది. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ విభాగం లాభం రూ.188 కోట్లుగా నమోదైంది.

● బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు శుక్రవారం 0.09 శాతం తగ్గి రూ.804.55 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్.. ఫ్చ్!

క్యూ1 లాభంలో 62 శాతం క్షీణత

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి టాటా మోటార్స్ లాభం రూ.4,003 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన రూ.10,587 కోట్ల పోలిస్తే లాభం 62.2% క్షీణించింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాల్లోనూ వాహన విక్రయాలు తగ్గడం, అమెరికా సుంకాల కారణంగా కంపెనీ లగ్జరీ కార్ల బ్రాండ్ జాగ్వార్ లాండ్‌రోవర్ (జేఎల్ఆర్) లాభదాయకత క్షీణించడం, బేస్ ఎఫెక్ట్ అధికంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణం. క్యూ1లో కంపెనీ ఆదాయం సైతం వార్షిక ప్రాతిపదికన 2.5% తగ్గి రూ.1,04,407 కోట్లుగా నమోదైంది. 2024-25 క్యూ1లో ఆదాయంరూ.1,07,102 కోట్లుగా ఉంది. "మార్కెట్ ప్రతికూలతల్లోనూ బలమైన వ్యాపార మూలాల మద్దతుతో కంపెనీ లాభాదాయక త్రైమాసికాన్ని నమోదు చేసింది. అమెరికా సుంకాలపైనా స్పష్టత వచ్చింది. పండగ సీజన్ గిరాకీ ఊపందుకోనుంది. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల విక్రయాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బలమైన పనితీరు కనబరచడంపై ప్రధానంగా దృష్టిసారించాం" అని టాటా మోటార్స్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) పీబీ బాలాజీ అన్నారు.

మరిన్ని విషయాలు..

● బ్రిటన్, యూరప్ నుంచి దిగుమతి చేసుకునే కార్లపై అమెరికా సుంకాలు పెంచడంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జేఎల్ఆర్ ఆదాయం 9.2% తగ్గి 660 పౌండ్లకు పడిపోయింది. యూఎస్‌తో యూకే, యూరప్ ఇప్పటికే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ముున్ముందు త్రైమాసికాల్లో కంపెనీ ఆదాయంపై సుంకాల ప్రభావం తగ్గుముఖం పట్టనుందని జేఎల్ఆర్ సీఈఓ అడ్రియన్ మార్డెల్ అన్నారు.

● ఈ క్యూ1లో ప్రయాణికుల వాహన టోకు విక్రయాలు 10.1% తగ్గి 1,24,800 యూనిట్లుగా నమోదయ్యాయి. సాధారణంగానే క్యూ1లో వాహనాలకు గిరాకీ తక్కువగా ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) డిమాండ్ మాత్రం ఆశాజనకంగా ఉంది. జూన్ త్రైమాసికంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు 6% తగ్గి 88,000 యూనిట్లకు పరిమితమయ్యాయి.

తాజ్ జీవీకే లాభం రూ.36 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్ త్రైమాసికంలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ నికర లాభం దాదాపు మూడింతలై రూ.36.22 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.12.71 కోట్లుగా ఉంది. కాగా, ఆదాయం రూ.94.70 కోట్ల నుంచి రూ.128.29 కోట్లకు ఎగబాకింది. తమ సంస్థకిది అత్యుత్తమ తొలి త్రైమాసికమని తాజ్ జీవీకే చైర్మన్ జీవీకే రెడ్డి అన్నారు.

బిజినెస్

పీఎస్‌బీల లాభాల్లో సరికొత్త రికార్డు

జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ సహా దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల మొత్తం లాభాలు సరికొత్త రికార్డు స్థాయి రూ.44,218 కోట్లకు పెరిగాయి. గత ఏడాది జూన్ త్రైమాసికంలో ఈ బ్యాంక్‌లు ఆర్జించిన రూ.39,974 కోట్లతో పోలిస్తే ఇది 11% (రూ.4,244 కోట్లు) అధికం. పీఎస్‌బీల జూన్ త్రైమాసిక లాభాల్లో ఎస్‌బీఐ వాటాయే 43 శాతం. కాగా, చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76% వృద్ధి చెంది రూ.1,111 కోట్లుగా నమోదైంది. లాభాల్లో అత్యధిక వృద్ధి నమోదు చేసిన బ్యాంక్ ఇదే. 12 పీఎస్‌బీల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లాభంలో మాత్రం 48% తగ్గుదల నమోదైంది.

ఎయిర్‌టెల్ కౌంటర్‌లో రూ.11,227 కోట్ల డీల్

భారతీ ఎయిర్‌టెల్ కౌంటర్‌లో శుక్రవారం భారీ బల్క్ డీల్ చోటు చేసుకుంది. కంపెనీ ప్రమోటర్ సునీల్ మిట్టల్ అయన కుటుంబానికి చెందిన ఇండియన్ కాంటినెంటల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ఆరు కోట్ల షేర్లను రూ.11,227 కోట్లకు విక్రయించింది. రెండు విడతలుగా ఒక్కో షేరును రూ.1,870.40-1,871.95 మధ్య ఈ షేర్ల అమ్మకాలు జరిగినట్టు సమాచారం.

తెలుగు రాష్ట్రాల్లో రూ. 7,657 కోట్ల రుణాలు

పిరామల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : పిరామల్ ఫైనాన్స్ తెలుగు రాష్ట్రాల్లో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 55 శాఖల ద్వారా వివిధ వర్గాలకు రూ.7,657 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేసినట్టు కంపెనీ మార్కెటింగ్ హెడ్ అరవింద అయ్యర్ తెలిపారు. ఇందులో తెలంగాణ వాటానే రూ.5,000 కోట్ల నుంచి రూ.5,200 కోట్ల వరకు ఉందన్నారు. ఇది తమ మొత్తం రుణ పోర్టుఫోలియోలో పదిశాతమని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో పాటు వ్యక్తిగత, గృహ రుణాలు, ఆస్తులు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై తమ కంపెనీ రిటైల్ రుణాలు ఇస్తుందన్నారు. ఆదాయానికి సంబంధించి సరైన ధ్రువ పత్రాలు లేని వ్యక్తులకూ, కొన్ని షరతులకు లోబడి తాము రుణాలిస్తామని అయ్యర్ చెప్పారు. తామిచ్చే గృహ రుణాలపై వడ్డీ 9.9 శాతం నుంచి 14 శాతం వరకు ఉంటుందన్నారు.

స్టాక్ మార్కెట్ 'బేర్'

80,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ట్రంప్ సుంకాల పోటు కొనసాగుతోంది. ఈ దెబ్బతో శుక్రవారం సెన్సెక్స్ 765.47 పాయింట్ల నష్టంతో 79,857.79 వద్ద ముగియగా నిఫ్టీ 232.85 పాయింట్ల నష్టంతో 24,363.39 వద్ద క్లోజయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పడిపోయి రూ.440.63 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ గత మూడు నెలల్లో ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. గత ఆరు వారాల నుంచీ ఈ రెండు కీలక సూచీలు నష్టాల్లో నడుస్తున్నాయి. కొవిడ్ తర్వాత సూచీలు వరుసగా ఇన్ని వారాలు నష్టాలతో ముగియడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు కారణంగా ఎఫ్‌పీఐలు శుక్రవారం సైతం పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగాయి. దీంతో రియల్టీ, మెటల్, టెలికం, కన్జుమర్ డ్యూరబుల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. అయితే నిఫ్టీకి 24,200-24150 మధ్య గట్టి మద్దతు కనిపిస్తోంది. ఆ స్థాయిని కూడా బ్రేక్ చేస్తే నిఫ్టీ 23,750 పాయింట్లకు కూడా పడిపోయే ప్రమాదం ఉందని టెక్నికల్ అనలిస్టుల అంచనా.

పసిడి ధర మరింత పైకి : స్టాక్ మార్కెట్ పతనంలో పసిడి ధర శుక్రవారం మరింత జోరందుకుంది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.800 లాభంతో రూ.1,03,420కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి రూ.1,000 పెరిగి రూ1.15 లక్షల వద్ద ముగిసింది. గత ఐదు రోజుల్లోనే దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.5,800, కిలో వెండి ధర రూ.5,500 పెరిగాయి.

కోరమాండల్ గూటికి ఎన్ఏసీఎల్

న్యూఢిల్లీ : నాగార్జునా గ్రూప్ కంపెనీ ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ యాజమాన్యం చేతులు మారింది. ఈ కంపెనీ ఈక్విటీలో 53 శాతం వాటా కొనుగోలు పూర్తి చేసినట్టు మురుగప్ప గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తెలిపింది. దీంతో ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కొనుగోలు కోసం, కోరమాండల్ ఇంటర్నేషనల్ త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. వ్యవసాయ క్రిమి సంహారక మందుల మార్కెట్‌లో తమ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలన్న దీర్ఘకాలిక లక్ష్యానికి ఈ కొనుగోలు దోహదం చేస్తుందని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ



హైదరాబాద్	450	విజయవాడ	500
వరంగల్	452	గోదావరి	490
చిత్తూరు	513	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	94	అనంతపురం	82
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,27,000 ▲
విజయవాడ	1,04,200 ▲	98,300 ▲	1,18,450 ▼
విశాఖపట్నం	1,04,420 ▲	94,700 ▲	1,27,000 ▲
రాజమండ్రి	1,03,300 ▲	94,700 ▲	1,18,100 ▲
ప్రొద్దుటూరు	1,00,070 ▼	92,690 ▲	1,17,800 ▲
ముంబై	1,00,940 ▲	92,460 ▲	1,14,730 ▼

‘ఉజ్వల’కు 12 వేల కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపు

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై)ను కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పథకానికి రూ.12,000 కోట్లు కేటాయించింది. పీఎంయూవైతో దేశవ్యాప్తంగా 10.33 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. దేశంలోని పేద మహిళలకు ఎల్పీజీ కనెక్షన్లు అందించేందుకు గాను 2016 మేలో ఈ పథకాన్ని ప్రారంభించారు. 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తూ, ఏడాదికి 9 సిలిండర్ల వరకు అందజేస్తున్నారు. మరోవైపు సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి ఉద్దేశించిన ‘మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎంఈఆర్ఐటీఈ)’ పథకానికి కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 నుంచి 2029-30 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకం అమలు కోసం రూ.4,200 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. దీనికి తోడు మరో రూ.2100 కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోనుంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఉన్న 275 ప్రభుత్వ, ఎయిడెడ్ సాంకేతిక విద్యా సంస్థలకు సాయం అందించనున్నారు. నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 7.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నట్లు అంచనా. వీటితోపాటు అసోం, త్రిపురలకు రూ.4,250 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, తమిళనాడులో ‘మరక్కానం-పుదుచ్చేరి’ నాలుగులేన్ల రహదారి నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

సమాంతర ప్రభుత్వం నడుపుతున్నారా?

- ఇది దురదృష్టకరం.. ప్రమాదకరం కూడా
- ఐఏఎస్‌లపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): “సమాంతర ప్రభుత్వం నడుపుతున్నారా?.” అంటూ తమిళనాడు ఐఏఎస్ అధికారులపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార దర్పంతో వ్యవహరిస్తున్నారని, ఇది దురదృష్టకరం, ప్రమాదకరమని వ్యాఖ్యానిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మాజీ ఐపీఎస్ అధికారికి ఇల్లు కేటాయించే విషయంలో ఐఏఎస్ అధికారులు వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. తమిళ సాహితీవేత్తలకు ‘డ్రీమ్ హౌస్ ప్రాజెక్టు’(కన్నావు ఇల్లం) కింద ఇళ్లను కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు తొలి మహిళా ఐపీఎస్ అధికారిణి(రిటైర్డ్), రచయిత్రి తిలకవతికి ఇల్లు కేటాయించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై ఆమె మరోసారి అప్పీలు చేశారని గుర్తు చేసింది. ఇదేకాకుండా రచయితలకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవడంపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ‘రచయితలకు ఇళ్ల కేటాయింపు ఒక భావోద్వేగ అంశం. దీనిని ఐఏఎస్ అధికారులు స్పష్టంగా అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నారు.’ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సమాంతర ప్రభుత్వంలా వ్యవహరించడం దురదృష్టకరమని, దీనిని కొనసాగిస్తే తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని పేర్కొంది. రచయితకు కేటాయించిన ఇంటిని రద్దు చేయడమనేది మాజీ సీఎం దివంగత కరుణానిధి హయాంలో జరిగి ఉంటే ఆయన చాలా బాధపడి ఉండేవారని, ఇలాంటి చర్యలను ఏ మాత్రం సహించేవారు కాదని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ స్పందిస్తూ.. ఈ పథకం తొలి దశలో గుర్తించిన 10 మందికి ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. కాగా, మరిన్ని వివరాల కోసం తదుపరి విచారణను వాయిదా వేసింది.

గాజా స్వాధీనానికి ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం

పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదమే తరువాయి

టెల్ అవీవ్, ఆగస్టు 8: గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రణాళికకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదం పొందితే ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. అయితే ఇజ్రాయెల్ ఇప్పటికే గాజా సరిహద్దుకు భారీగా సైనికులను తరలించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోందనే కథనాలు వస్తున్నాయి. హమా‌స్‌ను నాశనం చేయడం, బందీలను విడిపించుకోవడం, గాజాను సైనికరహిత ప్రాంతంగా మార్చడం, గాజాకు ఇజ్రాయెల్ భద్రత కల్పించడం, గాజాను తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమనే 5 అంశాలతో తాజా ప్రణాళిక రూపొందించారు. అయితే గాజాను స్వాధీనం చేసుకోవడం తమ లక్ష్యం కాదని, హమాస్ ఉగ్రవాదుల వద్ద ఉన్న తమ బందీలను విడిపించుకుని, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. కాగా, గాజాను స్వాధీనం చేసుకోవాలనుకునే ప్రణాళిక తప్పని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ చర్య మరింత రక్తపాతానికి దారితీస్తుందని చెప్పారు. పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ప్రణాళికను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు ఇంతకాలం ఇజ్రాయెల్‌ను గట్టిగా సమర్థించిన జర్మనీ తాజాగా తన వైఖరిని మార్చుకుంది. ఇజ్రాయెల్‌కు సైనిక ఉత్పత్తులను ఎగుమతి చేయరాదని నిర్ణయించుకున్నట్లు జర్మనీ చాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ చెప్పారు. తాము సరఫరా చేసే సైనిక ఉత్పత్తులను గాజాపై సైనిక చర్యకు ఉపయోగించే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఓబీసీల క్రీమీ లేయర్ పరిమితిని సవరించాలి

- పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని తక్షణమే సవరించాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. ప్రస్తుత పరిమితి కారణంగా పెద్దసంఖ్యలో అర్హత కలిగిన ఓబీసీ అభ్యర్థులు రిజర్వేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపింది. చివరిసారిగా 2017లో ఈ వార్షిక పరిమితిని రూ.6.5 లక్షల నుంచి రూ.8లక్షలకు సవరించినట్లు శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించిన 8వ నివేదికలో కమిటీ పేర్కొంది. సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) నిబంధనల ప్రకారం.. ఈ ఆదాయ పరిమితిని అవసరమైతే ప్రతి మూడేళ్లకు ఒకసారి లేదా అంతకంటే ముందుగానే సమీక్షించాల్సి ఉంది. “ప్రస్తుత పరిమితి చాలా తక్కువగా ఉంది. ఓబీసీల్లోని ఒక చిన్న భాగాన్ని మాత్రమే ఇది కవర్ చేస్తోంది. ద్రవ్యోల్బణం రేటు, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని పెంచడం తక్షణ అవసరం” అని కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ పునరుద్ఘాటించారు.

‘మన్ కీ బాత్’ ద్వారా ఆకాశవాణికి 34.13 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ప్రతి నెలా ప్రసారమవుతున్న ప్రధాన మంత్రి ‘మన్ కీ బాత్’ కార్యక్రమం ద్వారా ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి) ఇప్పటివరకు 34.13 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభకు సమర్పించిన లిఖితపూర్వక సమాధానంలో ఆయన ఈ విషయం వెల్లడించారు.







చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బాలకృష్ణ డబ్బింగ్ పూర్తి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘అఖండ 2: తాండవం’. ‘అఖండ’కు సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సినిమా సెప్టెంబరు 25న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులను షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయడానికి చిత్ర బృందం కృషి చేస్తోంది. తాజాగా బాలకృష్ణ తన పాత్రకు డబ్బింగ్ పూర్తిచేశారు.

షూటింగ్స్ ఆపండి

- నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ ఆదేశాలు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. వెంటనే షూటింగ్‌లు ఆపివేయాలంటూ నిర్మాతలకు ఆదేశాలు జారీ చేసింది. సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై నిర్మాతలు - ఫెడరేషన్ నాయకుల మధ్య జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కిరాని నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ‘స్టూడియోలు, ఔట్‌డోర్ యూనిట్లు అనుమతి లేకుండా ఎలాంటి సేవలు అందించవద్దు. ఈ ఆదేశాలను స్టూడియో యజమానులు, నిర్మాతలు సీరియస్‌గా తీసుకోవాలి. తెలుగు సినీ పరిశ్రమలోని 24 విభాగాల యూనియన్లు ఏకపక్షంగా సమ్మెకు పిలుపునివ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చర్చలు, సంప్రదింపులకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు దూరంగా ఉండాలి’ అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

అదరగొట్టిన ‘జడల్’



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ‘ది ప్యారడైజ్’ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇందులో నాని ఇంతకు ముందెన్నడూ చేయని క్యారెక్టర్‌ను చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి నాని ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కోరమీసం, గెడ్డం, రెండు జడలతో ఆయన విభిన్నమైన లుక్‌లో కనిపించారు. ఇందులో నాని పాత్ర పేరు ‘జడల్’. పోస్టర్‌లో నాని వెనుక కత్తులు- బుల్లెట్లతో తయారైన భారీ చక్రం, పొగ మంచులో ఎగిరే కాకులు ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. కాగా, ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 2026 మార్చి 26న తెలుగు సహా ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.

నా మావ పిల్లనిత్తానన్నాడే...



నాగశౌర్య, నిధి జంటగా నటిస్తోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’. రామ్ దేశినా(రమేశ్) దర్శకత్వంలో శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ‘నా మావ పిల్లనిత్తానన్నాడే...’ అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యానికి హరిస్ జయరాజ్ స్వరాలు సమకూర్చారు. కారుణ్య, హరిప్రియ ఆలపించారు. పాటలో నాగశౌర్య, నిధి స్టెప్పులు ఆకట్టుకునేలా ఉన్నాయి.

పవర్‌ఫుల్ లుక్‌తో



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న మైథలాజికల్ థ్రిల్లర్ ‘జటాధర’. బాలీవుడ్ భామ సోనాక్షిసిన్హా కథానాయిక. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. శుక్రవారం హీరో ప్రభాస్ ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్ అని అర్థమవుతోంది. పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది.

భయపెట్టే బుల్లెట్టు



రాఘవ లారెన్స్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ ‘బుల్లెట్టు బండి’. లారెన్స్ సోదరుడు ఎల్విన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో కతిరేశన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హీరో నాగచైతన్య ‘బుల్లెట్టు బండి’ టీజర్‌ను ఆవిష్కరించారు. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిది, శక్తిమంతమైన పాత్రలో రాఘవ లారెన్స్ కనిపిస్తారు అని కతిరేశన్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్. సీఎస్, సినిమాటోగ్రఫీ: అరవింద్ సింగ్

ప్రేమకథ



ఈ తరం యువత జీవితాలను ఆవిష్కరించే ప్రేమ కథా చిత్రం ‘ప్రేమలో రెండోసారి’. రమణ సాకే, వనిత గౌడ్ జంటగా నటించారు. సత్య మార్క దర్శకత్వంలో సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా రమణ సాకే మాట్లాడుతూ ‘ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది’ అని చెప్పారు.

పెళ్లి నేపథ్యంలో



ఓ పెళ్లి వేడుకలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా తెరకెక్కిన చిత్రం ‘పెళ్లిలో పెళ్లి’. శ్రీకాంత్ సంబరం దర్శకత్వంలో గణేశ్ కోలి నిర్మించారు. శివసాయి రిషి, సంస్కృతి గోరే జంటగా నటించారు. తనికెళ్లభరణి కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.

క్షణాలన్నీ జ్ఞాపకాలై

ఒకప్పటి సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం అంటున్నారు సంతోశ్ శోభన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ‘కపుల్ ఫ్రెండ్లీ’ చిత్రం టీజర్ లోనిదీ డైలాగ్. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ‘కపుల్ ఫ్రెండ్లీ’ టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. చెన్నైలో అనుకోకుండా కలసిన యువతీ యువకుల ప్రేమ కథ ఎలాంటి మలుపు తిరిగిందనే లైన్ చుట్టూ ఆసక్తికరంగా సాగే కథ అని ప్రచార చిత్రాన్ని బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తోంది.



అమ్మాయి గౌరవం పెంచేలా..



వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయి బాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. ఈనెల 14 నుంచి ఈ సిరీస్ ఈటీవీ విన్‌లో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి సిరీస్ ట్రైలర్‌ని విడుదల చేసి చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా హీరోయిన్ వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ ‘అమ్మాయిలపై గౌరవం పెంచేలా ఈ సిరీస్ ఉంటుంది’ అని అన్నారు.



జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్

నలుగురు హైకోర్టు అదనపు జడ్జీలకు శాశ్వత హోదా

- కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్.. త్వరలో ప్రమాణం చేయనున్న జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ కూడా

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సేవలందిస్తున్న నలుగురు అదనపు న్యాయమూర్తులకు శాశ్వత న్యాయమూర్తుల హోదా కల్పిస్తూ శుక్రవారం కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ నలుగురూ అదనపు న్యాయమూర్తులుగా 2023 అక్టోబరు 21 ప్రమాణం చేశారు. రెండేళ్ల పదవీకాలం వచ్చే అక్టోబరు 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫారసును ఆమోదిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వీరితో త్వరలో శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేయించనున్నారు.

2 కోట్ల 'దీపం' సిలిండర్లు డోర్ డెలివరీ

- అధికారులు అనవసర ఒత్తిళ్లు తేవద్దన్న ఎల్పీజీ పంపిణీదారులు

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'దీపం-2' పథకం కింద ఇప్పటి వరకు 2 కోట్ల గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు డోర్ డెలివరీ చేసినట్లు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విజయవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1200 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లంతా ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుస్తామని ప్రకటించారు. గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ విషయంలో ఎదురవుతున్న సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ తమ అసోసియేషన్ ముఖ్యనాయకులతో ప్రత్యేకంగా చర్చించారని, ఈ సందర్భంగా తమ సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని శ్రీనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా వినియోగదారుల అభిప్రాయాలను సేకరించడం, ఆ నివేదికల ఆధారంగా అన్ని జిల్లాల్లో అధికారులు ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లపై ఒత్తిడి తెస్తుండటంతో మా వర్క్‌ఫోర్స్‌పై ప్రతికూల ప్రభావం పడుతోంది. జిల్లాల్లో అధికారుల ఒత్తిళ్లు ఇలాగే కొనసాగితే గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ విధానం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. అప్పుడు వినియోగదారులే స్వయంగా గోడౌన్‌ల వద్దకు లేదా డెలివరీ ఆటోల వద్దకు వచ్చి సిలిండర్లను తీసుకువెళ్లాల్సి రావచ్చు. ప్రభుత్వం దయచేసి ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి' అని కోరారు. తమ సమస్యల పట్ల కమిషనర్ సానుకూలంగా స్పందించారని శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' గ్రీవెన్స్‌కు 10,915 దరఖాస్తులు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హత ఉండి, వివిధ కారణాలతో లబ్ధి చేకూరని రైతుల కోసం వ్యవసాయశాఖ చేపట్టిన గ్రీవెన్స్‌కు ఈ నెల3-8 తేదీల మధ్య రాష్ట్రవ్యాప్తంగా 10,915 మంది దరఖాస్తు చేశారు. గరిష్ఠంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 1,290, విజయనగరం జిల్లా నుంచి 1,111 దరఖాస్తులు రాగా, మిగిలిన 24 జిల్లాల నుంచి వెయ్యిలోపు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో మండల వ్యవసాయ అధికారి పరిధిలో 5,377 ఆమోదించగా, 4,261 పెండింగ్‌లో పెట్టి, 29 తిరస్కరించారు. తహసీల్దార్ పరిధిలో 827 పెండింగ్‌లో ఉండగా, 411 ఆమోదించి, 10 దరఖాస్తుల్ని తిరస్కరించారు. గ్రీవెన్స్‌లో పరిష్కారమై, 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హత ఉన్న రైతులకు త్వరలో నిధులు విడుదలవుతాయని అధికారులు తెలిపారు.

3 వ్యవసాయ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని పురుగు మందుల పరీక్షా కేంద్రం, బాపట్లలోని ఎరువుల నియంత్రణ ప్రయోగశాల, నెల్లూరులోని జీవ, సేంద్రియ ఎరువుల నాణ్యత, నియంత్రణ ప్రయోగశాలకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) సంస్థ గుర్తింపు లభించింది. ఈ ప్రయోగశాలలు తమ సాంకేతిక నైపుణ్యం, గ్లోబల్ ప్రమాణాలతో నాణ్యత పరీక్షల సామర్థ్యాన్ని నిరూపించడంతో అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు శుక్రవారం తెలిపారు. దీని ద్వారా వ్యవసాయ వనరుల నాణ్యతపై రైతుల్లో మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ ప్రయోగశాలలనూ దశల వారీగా ఎన్ఏబీఎల్ గుర్తింపు పరిధిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

సచివాలయంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి ఆటల పోటీలు

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విజయవాడ జోన్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం జరిగింది. వాలీబాల్, బాడ్మింటన్ పోటీలను ఏపీఎస్పీఎఫ్ డీజీ త్రివిక్రమవర్మ, ఐజీ రామిరెడ్డి ఆదేశాలతో విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఆటల పోటీలు దైనందిన జీవితంలో ఒత్తిడిని తగ్గిస్తాయని, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయని చెప్పారు. రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆటలు సమష్టి కృషిని, మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విజయవాడ జోన్‌లోని ఏపీ సెక్రటేరియేట్, ఏపీ హైకోర్టు, విజయవాడ గార్డ్స్, ఇబ్రహీపట్నం ఎన్టీపీఎస్, గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఎస్పీఎఫ్ సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

మొక్కు తీరింది.. కోరిక నెరవేరింది!

- సీఎంతో 'సంగీత వరలక్ష్మి'కి ఫొటో
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సీఎంఓ
- 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన వరలక్ష్మి

మంగళగిరి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గాన సరస్వతి వరలక్ష్మీ నారాయణమ్ ఆకాంక్ష నెరవేరింది. సీఎం చంద్రబాబుతో కలిసి ఆమె ఫొటో దిగారు. సీఎంవో నుంచి వరలక్ష్మికి గురువారం సాయంత్రం పిలుపు రావడంతో ఆమె ఆయనను కలుసుకున్నారు. తన మొక్కులు ఫలించాయని, సీఎం చంద్రబాబును కలవడం అదృష్టంగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి విజయం సాధిస్తే రాష్ట్రంలోని 108 ఆలయాల్లో సంగీత కచేరీలు చేస్తానంటూ ఎన్నికలకు ముందు వరలక్ష్మి మొక్కుకున్నారు. మంగళగిరికి చెందిన వరలక్ష్మి ముంబాయిలో స్థిర పడినప్పటికీ చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన దరిమిలా.. ఆమె తన మొక్కు తీర్చుకోవడంలో భాగంగా అన్నవరం సత్యదేవుని సమక్షంలో తొలి కచేరీ నిర్వహించారు. చివరి కచేరీని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ సన్నిధిలో గురువారం రాత్రి ముగించారు. వరలక్ష్మి మొక్కు ఉదంతాన్ని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించగా, సీఎంఓ వెంటనే స్పందించింది. సీఎంను కలుసుకునేందుకు ఉండవల్లి నివాసానికి రావాలని ఇంద్రకీలాద్రిపై కచేరీ చేస్తున్న వరలక్ష్మికి కబురందించింది. దీనిపై ఆమె సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. కచేరీ ముగించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని సోదరుడు, స్థానిక న్యాయవాది శ్రీభాష్యం రంగనాథ్‌తో కలిసి చంద్రబాబు నివాసానికి చేరుకుని ఆయనను కలిశారు. వరలక్ష్మి కుటుంబ వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అలాగే కచేరీల మొక్కు గురించి కూడా విచారించి ఏయే దేవస్థానాల్లో కచేరీలు చేశారో తెలుసుకున్నారు. తన ఐదో ఏట నుంచే సంగీత సాధన చేస్తూ 60 ఏళ్లుగా దేశ విదేశాల్లో ఇప్పటికి 5 వేలకు పైగా గాన కచేరీలు నిర్వహించినట్టు వరలక్ష్మి సీఎంకు వివరించారు. 'మీ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆశిస్తూ ఇప్పటి వరకు కచేరీలు చేశాన'ని చెప్పారు. ఇకమీదట లోకేశ్ క్షేమాన్ని కోరుతూ కచేరీలు చేయగలనని వరలక్ష్మి అనడంతో చంద్రబాబు సంతోషంతో మురిసిపోయారు. ఈ సందర్భంగా తన 108 కచేరీలకు సంబంధించి రాసుకున్న డైరీని సీఎం చంద్రబాబుకు చూపగా, ఆయన చివరిదైన ఇంద్రకీలాద్రి కచేరీ వివరాల వద్ద అభినందనలు తెలుపుతూ సంతకం చేశారు.



సంగీత వరలక్ష్మి నారాయణమ్‌ను సత్కరిస్తున్న సీఎం

బార్ అసోసియేషన్‌లో..

మరోవైపు, 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని చూసి.. విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్ బాషా కూడా.. బార్ అసోసియేషన్‌లో శుక్రవారం కచేరీ నిర్వహించాలని వరలక్ష్మిని అభ్యర్థించారు. దీంతో ఆమె న్యాయవాదుల సమక్షంలో కచేరీ నిర్వహించి ప్రశంసలందుకున్నారు. తాను సీఎంను కలవడానికి కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి ఎంతో రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు.

రసాయన ఎరువులకు 'నానో' తోడు!

(మొదటి పేజీ తరువాయి)

ఎరువులు ఎలా ఉపయోగపడతాయో నానో యూరియా కూడా అంతేనని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంటలకు పోషకాలు అందించడంలో రసాయన ఎరువులకు దీటుగా నానో ఎరువులు పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. అందుకే నానో సాంకేతికతతో తయారైన ద్రవ రూప యూరియా, డీఏపీని ప్రోత్సహిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో నానో ఉత్పత్తులపై అంతగా ప్రచారం లేదు. వాటిని తమకు బలవంతంగా అంటగడుతున్నారని ఇటు డీలర్లు, అటు రైతులు వాపోతున్నారు.

రసాయన యూరియాతో నష్టాలు

సంప్రదాయ యూరియా వల్ల కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. పోషకాల సమతుల్యతకు, నీటి కాలుష్యానికి దారి తీస్తుంది. యూరియా నత్రజని వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని చెప్తున్నారు. రసాయన యూరియా అధిక వాడకం వల్ల పొటాష్, పాస్పరస్ లభ్యతను తగ్గిస్తుంది. చిన్న మొక్కల ఎదుగుదలకు హాని చేస్తుంది. నత్రజనిని వేగంగా విడుదల చేసే సంప్రదాయ యూరియా కంటే.. నానో యూరియా బెటర్ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నానోతో ప్రయోజనం

నానో యూరియా మొక్కలకు పోషకాలు సమర్థంగా అందిస్తుంది. అధిక దిగుబడికి దారి తీస్తుంది. పంటల్లో





పోషక లోపాలను సరి చేస్తుంది. మెరుగైన ఆహార నాణ్యతకు దోహదం చేస్తుంది. రసాయన ఎరువుల వినియోగ అవసరాన్ని తగ్గిస్తుంది. తక్కువ కార్బన్ విడుదలతో పర్యావరణానికి అనుకూలంగా ఉంటుంది. అధిక రసాయన ఎరువుల వల్ల దెబ్బతినే నేల, గాలి, నీటి కాలుష్యాన్నీ తగ్గిస్తుందని చెబుతున్నారు. పంట పోషకాల సామర్థ్యాన్ని పెంచి, మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుంది. మట్టిపై రసాయన భారాన్ని తగ్గించి, వృథా కాకుండా ఉంటుంది. నానో ఎరువులు నిల్వ చేసుకోవడం, రవాణా చేయడం చాలా సులభం. నీరు, మట్టిలో కలుషితాన్ని తగ్గించి, పంట దిగుబడుల్లో మెరుగుదల కల్పిస్తుంది. గ్లోబల్ వార్మింగ్ సమస్యను పరిష్కరించడంలో సహాయపడుతుంది. బస్తా యూరియా సబ్సిడీ పోను గరిష్ఠ చిల్లర ధర రూ.266.50. అర లీటర్ నానో యూరియా ధర రూ.225. ఇది 45కిలోల యూరియా బస్తాకు సమానం. 2-4 మిల్లీ మీటర్ల నానో యూరియాను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి రెండుసార్లు పిచికారి చేయొచ్చు. రసాయన యూరియాలో 30-40% పోషకాలు ఉంటే నానో యూరియాలో 80-90% ఉంటాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

20-25% నానో యూరియా వేయొచ్చు

- పీవీ సత్యనారాయణ, రీసెర్చ్ డైరెక్టర్, రంగా అగ్రి వర్సిటీ

ప్రస్తుతం రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి వంటి పంటల్లో సిఫారసుకు మించి నత్రజని ఎరువులు వాడుతున్నారు. దీనివల్ల చీడపీడలు పెరగడం, సాగు ఖర్చు పెరుగుతోంది. విచక్షణారహితంగా యూరియా వంటి రసాయన ఎరువులు వాడకం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నానో ఎరువులు కొద్ది మేర పని చేస్తున్నందున రైతులు 20-25 శాతం రసాయన ఎరువులు తగ్గించి, ఆమేరకు నానో యూరియా వాడితే మంచిది. రసాయన యూరియా 75%, నానో యూరియా 25% వేయొచ్చని రైతులకు సిఫారసు చేస్తున్నాం. పంట ప్రాథమిక దశలో కాకుండా.. ఆఖరి దశలో నానో యూరియా వాడితే కొంత ఫలితం ఉంటుంది.

అందుబాటులో నానో యూరియా

- డిల్లీరావు, డైరెక్టర్, వ్యవసాయ శాఖ

సారవంతమైన నేలను కాపాడుకోడానికి నానో ఎరువుల వాడకం మంచిది. నానోలో పోషక విలువ సామర్థ్యం ఎక్కువ. నేలకు, పంటకు మేలు చేస్తాయి. పర్యావరణాన్ని కాపాడేందుకు నానో దోహదపడుతుంది. నానో సాంకేతికపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి అధికారులను సూచించాం. నానోపై రైతుల్లో చైతన్యం రావాలి. గతేడాది రాష్ట్రంలో 3.5 లక్షల నానో యూనిట్లు వ్యవసాయానికి వినియోగించగా, ఈ ఏడాది 21 లక్షల నానో బాటిల్ యూనిట్ల వాడకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో నానో యూరియా 83వేల లీటర్లు అందుబాటులో ఉంది.

డీఎస్ఎన్ఎల్‌యూ జనరల్ కౌన్సిల్ సభ్యునిగా సీనియర్ న్యాయవాది

ఆదినారాయణరావు



అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డీఎస్ఎన్ఎల్‌యూ) జనరల్ కౌన్సిల్ సభ్యునిగా సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణ రావు నియమితులయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ చాన్స్‌లర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్... సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావును జనరల్ కౌన్సిల్ సభ్యునిగా నామినేట్ చేస్తూ ఈ నెల 6న ప్రొసీడింగ్స్ జారీచేశారు. జనరల్ కౌన్సిల్ సభ్యునిగా నియమితులైన ఆదినారాయణరావుకు డీఎస్ఎన్ఎల్‌యూ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ డి. సూర్యప్రకాశరావు అభినందనలు తెలిపారు.

1979లో న్యాయవాదిగా మొదలై..

సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు స్వగ్రామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల. 1979లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన ఆయన 1979-82 వరకు బాపట్లలోనే ప్రాక్టీస్ చేశారు. 1982లో ఏపీ హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 1990లో బార్ కౌన్సిల్ సభ్యునిగా పనిచేశారు. 1996-2000 మధ్య హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2011లో సీనియర్ న్యాయవాది హోదా పొందిన ఆదినారాయణరావు.. 2013 నుంచి సుప్రీం కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. రాజ్యాంగ సంబంధ కేసులతోపాటు క్రిమినల్, సివిల్, ఎన్నికలు, సర్వీసు, మధ్యవర్తిత్వం తదితర కేసులు వాదించడంలో ఆయనకు అపార అనుభవం ఉంది.

'వాతావరణ' గందరగోళం!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నట్టుగా వర్షాలు కురవడం లేదు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో రాష్ట్రంలో అనేక చోట్ల సాధారణం అంత కంటే ఎక్కువగా, కొన్ని జిల్లాల్లో మాత్రమే తక్కువగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తన అంచనాల్లో పేర్కొంది. అయితే అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఈ రెండు నెలల్లో 25 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో.. ఖరీఫ్ పంటలకు బాగా నష్టం జరిగింది. దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నా రాష్ట్రానికి వచ్చేసరికి పరిస్థితి మరోలా ఉంది. దీంతో వర్షాలు కురుస్తాయని ఇస్తున్న ముందస్తు అంచనాలపై రైతుల్లో అయోమయం నెలకొంటోంది. వర్షం పడుతుందని వాతావరణ శాఖ పేర్కొంటుంది.. కానీ మాడు పగిలే ఎండ కాస్తోంది. వేసవి మాదిరి వేడి వాతావరణం కొనసాగుతుంది. వాతావరణ శాఖ బులెటిన్ మేరకు గడిచిన వారం తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిశాయి. అదే ఏపీకి వచ్చేసరికి బులెటిన్లకు భిన్నంగా తక్కువ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణంలో చెప్పింది తూచా తప్పకుండా జరుగుతుందని నిక్కచ్చిగా చెప్పలేమని, వాతావరణంలో అనూహ్యమైన మార్పుల ప్రభావంతో చెప్పిన దానికి భిన్నంగా జరుగుతుందని నిపుణులు అంటున్నారు.

స్థానిక పరిస్థితులను పరిగణనలోకి..

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ రోజువారీ బులెటిన్లు రూపొందిస్తుంది. ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం ఇచ్చిన వివరాలకు స్థానికంగా నెలకొన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అధికారులు రాష్ట్రాల వారీగా బులెటిన్లను తయారు చేస్తారు. ఏపీకి వచ్చేసరికి అమరావతిలో వాతావరణ కేంద్రం, విశాఖలో తుపాన్ హెచ్చరిక కేంద్రం పనిచేస్తున్నాయి. రోజువారీ వాతావరణం వివరాలను అమరావతి కేంద్రం ఇస్తుండగా.. తుపాన్‌లు, వాయుగుండాల సమయంలో తుపాన్ హెచ్చరిక కేంద్రం బులెటిన్లు జారీచేస్తోంది. ఈ రెండు కార్యాలయాలు కలిసి పని చేస్తుంటాయి. అయితే చెప్పిన దానికి, వాస్తవంగా వర్షాలు కురిసిన దానికి మధ్య తేడా మాత్రం ఉంటోంది.

ఆధునిక సాంకేతికత ఉన్నా..

వర్షం పడుతుందని చెబితే ఎండ కాస్తుంది, ఎండ ఉంటుందంటే వర్షం కురుస్తుందని అప్పట్లో జోకులు వేసుకునేవారు. అదే నిజమని ఈ మధ్య తేలిపోయిందని రైతులు అంటున్నారు. వాస్తవానికి వాతావరణ శాఖలో ఆధునిక సాంకేతికతతో కూడిన రాడార్లు, ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా వర్షాలు, ఎండలు, గాలులు వంటి వాటిపై అంచనాలు తయారు చేస్తుంటారు. భారత వాతావరణ శాఖలో పనిచేసిన వారంతా ఎంతో అనుభవం ఉన్న నిపుణులే. అయినా నమ్మకం కలిగించడంలో విజయం సాధించడం లేదనే వాదన వినిపిస్తోంది. భారత వాతావరణ శాఖ ఇచ్చే బులెటిన్లలో 100 శాతం కచ్చితత్వం ఉంటుందని చెప్పలేమని రిటైర్డు వాతావరణ అధికారి కృష్ణభగవానుడు వ్యాఖ్యానించారు. కొన్నిసార్లు చెప్పింది జరుగుతుందని, ఒక్కొక్కసారి అంచనాలు తప్పుతాయన్నారు.

దక్షిణ కోస్తాపై ఉపరితల ఆవర్తనం

- నేడు, రేపు భారీ వర్షసూచన.. 13న అల్పపీడనం

అమరావతి, విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా నుంచి ఉత్తర శ్రీలంక వరకు తమిళనాడు తీరం మీదుగా ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు కురిశాయి. ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వెల్లడించింది. శనివారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ తెలిపింది. ఆదివారం ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగతా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. ఇంకా ఈనెల 13న ఉత్తరకోస్తాకు సమీపంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నదని, దాని ప్రభావంతో 13, 14 తేదీల్లో కోస్తాలో వర్షాలు పెరుగుతాయనివాతావరణశాఖ అంచనా వేసింది.

ఏపీలో ఆయుష్ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి

- లోక్‌సభలో లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ప్రతిపాదించిన 50 పడకల ఆసుపత్రులకు అదనంగా రాయలసీమ, పల్నాడు, ఒంగోలు వంటి వెనుకబడిన ప్రాంతాల్లో మరిన్ని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం లోక్ సభలో ప్రస్తావించారు. కాగా, రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ఆరోగ్య మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అదనపు ఆయుష్ ప్రాజెక్టులపై పరిశీలిస్తున్నామని ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు గణపతిరావు జవాబిచ్చారు.

గ్రీన్ హైడ్రోజన్ నౌకల దిశగా భారత్ తొలి అడుగు

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత నౌకల అభివృద్ధిలో దేశం ముందడుగు వేస్తోందని కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయాన, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. పర్యావరణానికి అనుకూలంగా, నావికా రవాణా రంగాన్ని నూతన దిశలో తీసుకెళ్లే లక్ష్యంతో హైడ్రోజన్ ఇంధనాన్ని వినియోగించే నౌకలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వెల్లడించారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తిగా హైడ్రోజన్ ఇంధన కణాలతో నడిచేలా కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ సంస్థలు చెరొక నౌకను నిర్మిస్తున్నాయని తెలిపారు. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద 2025-26 వరకు రూ.115 కోట్ల బడ్జెట్‌ను కేటాయించామని వెల్లడించారు.

దళారీలు లేకుండా ఏపీ రైతులకు 816 కోట్ల బదిలీ

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం క్రింద ఏప్రిల్-జులై 2025 కాలానికి ఏపీలోని 40.06 లక్షల రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 816.14 కోట్లు మొత్తం జమ అయిందని రాజ్యసభలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి రాంనాథ్ ఠాకూర్ తెలిపారు. శుక్రవారం టీడీపీ ఎంపీ బీద మస్తాన్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల సమన్వయం, భూరికార్డులు, ఆధార్ కార్డుల అనుసంధానం, పరిశీలన ప్రక్రియ వల్ల ఈ బదిలీ సాఫీగా జరిగినట్లు తెలిపారు. దీని వల్ల మధ్యదళారులకు ఆస్కారం లేకుండా చేశామని చెప్పారు. మూడు సమాన వాయిదాల్లో రూ.6వేలను రైతులకు అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకం వారి అదనపు ఆదాయానికి, వ్యవసాయ ఉపకరణాలకు పెట్టుబడులకు ఉపయోగపడుతుందని తెలిపారు.

ఇంటర్న్‌షిప్ చేయాల్సిందే!

- విదేశాల్లో వైద్య విద్య చేసిన వారికి ఎన్ఎంసీ స్పష్టీకరణ
- క్లినికల్ నైపుణ్యం అవసరం
- వైద్య పుస్తకాలు చదివితే సరిపోదు
- అసమగ్ర విద్యతో రోగులకు ముప్పు
- విదేశాల్లో చదివిన వారిపై రాజీవద్దు
- రిజిస్ట్రేషన్‌కు నిబంధనలు పాటించాలి
- విద్యార్థుల ఇంటర్న్‌షిప్ వ్యవహారంపై మంత్రి రాసిన లేఖకు ఎన్ఎంసీ వివరణ
- హైకోర్టులో ఏపీఎంసీ రివ్యూ పిటిషన్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థుల (ఎఫ్ఎంజీ) శాశ్వత రిజిస్ట్రేషన్ విషయంలో నెలకొన్న సందిగ్ధతకు దాదాపు తెరపడింది. ఎఫ్ఎంజీ రిజిస్ట్రేషన్ విషయంలో నిబంధనలు పాటించాల్సిందేనని, ఈ విషయంలో ఎలాంటి రాజీపడొద్దని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) స్పష్టత ఇచ్చింది. ఏపీలో శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఎఫ్ఎంజీలు పోరాటం చేస్తున్నారు. నెల రోజుల క్రితం వందల మంది విద్యార్థులు విజయవాడలోని హెల్త్ వర్సిటీ ఎదుట ధర్నా కూడా చేశారు. ఈ క్రమంలో ఎఫ్ఎంజీ కట్టా వంశీ హైకోర్టును ఆశ్రయించారు. కిర్గిస్థాన్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసించిన వంశీ.. శాశ్వత రిజిస్ట్రేషన్ కోరుతున్నారు. వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై జూలై 9న న్యాయస్థానం తీర్పునిచ్చింది. "ఆ విద్యార్థి చదువుకు సంబంధించి భారత రాయబార కార్యాలయం నెల రోజుల్లో అధీకృత సమాచారం ఇవ్వాలి. ఒకవేళ ఇవ్వకపోయినా.. వంశీకి శాశ్వత రిజిస్ట్రేషన్ ఇవ్వాలి." అని ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ)ను ఆదేశించింది. ఇదే విషయంపై మరో నలుగురు ఎఫ్ఎంజీ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపైనా హైకోర్టు తీర్పునిచ్చింది. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఎందుకివ్వడం లేదో నెలలోపు చెప్పాలని ఈ నెల 4న ఆదేశించింది. ఈ రెండు తీర్పుల నేపథ్యంలో రంగంలోకి దిగిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు ఎఫ్ఎంజీలకు శాశ్వత రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టత ఇవ్వాలని ఎన్ఎంసీని కోరారు. కొవిడ్-19, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా రాష్ట్రానికి తిరిగి వచ్చి, ఆన్‌లైన్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఎఫ్ఎంజీలు.. ఏ మేరకు ఆఫ్‌లైన్ ద్వారా చదవాలన్న అంశంపై స్పష్టత కోరారు. అలాగే, ఆయా దేశాలు జారీ చేసే 'కాంపన్సేషన్ స్టడీ సర్టిఫికెట్'లో ఎలాంటి వివరాలను పొందుపరచాలనే అంశాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఆన్‌లైన్ విద్యకు బదులుగా ఆఫ్‌లైన్‌లో చదవడానికి విద్యా కాలాన్ని పొడిగించాలా? అనే అంశంపై కూడా స్పష్టత కోరుతూ ఈ నెల 5న ఎన్ఎంసీకి లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం అడిగిన వాటికి ఎన్ఎంసీ స్పందించి, ఆయా వివరాలను గురువారం రాష్ట్రానికి పంపింది.

ఎంఎన్‌సీ ఏం చెప్పిందంటే

వైద్య విద్యలో అంతర్భాగమైన క్లినికల్ కోర్సుల ప్రాధాన్యతను వివరిస్తూ.. ఈ కోర్సులకు సంబంధించిన విద్యను ఆన్‌లైన్‌లో అభ్యసించడం వీలు కాదని స్పష్టం చేసింది. "వైద్య విద్య కేవలం పుస్తకాలు చదివేందుకే పరిమితం కాదు. అతి ముఖ్యమైన క్లినికల్ నైపుణ్యాన్ని కలిగి ఉండాలి. ప్రజల ప్రాణాలను కాపాడడానికి తగు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కూడా వైద్య విద్యార్థులు పెంపొందించుకోవాలి. అసమగ్ర వైద్య విద్యనభ్యసించే వారితో సమాజానికి తీవ్ర ముప్పు ఎదురవుతుంది. విదేశాల్లో వైద్య విద్యనభ్యసించే వారిలో భారత్‌లో వైద్య వృత్తి చేపట్టడానికి అవసరమైన అర్హతలు కల్పించే నిమిత్తం 2021 నుంచి పలు మార్గదర్శకాలు, పబ్లిక్ నోటీసులు ఇచ్చాం. శాశ్వత రిజిస్ట్రేషన్ జారీ చేసే ముందు.. ఈ నియమాలు, మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలి. ఈ బాధ్యత రాష్ట్రాల వైద్య సంఘాలదే. విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన వారంతా స్వదేశంలో తప్పనిసరిగా ఏడాది పాటు ఇటర్న్‌షిప్ చేయాల్సిందే." అని ఎన్ఎంసీ పేర్కొంది. కొవిడ్-19, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఎన్ఎంసీ జారీ చేసిన పబ్లిక్ నోటీసులను కూడా లేఖలో ప్రస్తావించింది. వీటి ప్రకారం దేశానికి తిరిగి వచ్చి ఆన్‌లైన్‌లో విద్యనభ్యసించిన కాలం ఆధారంగా ఒకటి లేదా రెండేళ్ల ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. విదేశాల్లో చదివిన వైద్య విద్యార్థుల పాస్‌పోర్టుల్లో పేర్కొన్న వివరాల మేరకు అదనంగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ఆయా దేశాల్లో వైద్య విద్యా సంస్థలు జారీ చేసే కాంపెన్సేషన్ స్టడీ సర్టిఫికెట్లలో ఆన్‌లైన్ విద్యతో పాటు ఆఫ్‌లైన్ విద్యకు సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా పొందుపరచాలని ఎన్ఎంసీ పేర్కొంది. ఆ పత్రాల్లో ఉన్న వివరాల ఆధారంగా క్లినికల్ కోర్సులను ఎంతకాలం అభ్యసించారో వివరంగా తెలపాలని సూచించింది.

అదనపు సమయం కోరుతూ..

ఎన్ఎంసీ జారీ చేసిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటించకుండా హైకోర్టు తీర్పునకు అనుగుణంగా ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) చర్యలు తీసుకుంటే ఇంటర్న్‌షిప్ విషయంలో ఏకపక్షంగా నియమాలను సడలించినట్లు అవుతుంది. హైకోర్టు ఆదేశాలను పాటిస్తే ఎన్ఎంసీ రూపొందించిన నియమాల స్ఫూర్తికి విఘాతం ఏర్పడుతుంది. ఈ కారణంగా గత నెలలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమగ్రంగా పరిశీలించి తగుచర్య చేపట్టడానికి అదనపు సమయాన్ని కోరుతూ కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఏపీఎంసీకి ఎన్ఎంసీ సూచించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును అమలు చేయడానికి అదనపు సమయాన్ని కోరడంతో పాటు, ఇంటర్న్‌షిప్ విషయంలో రెండు తీర్పులకు సంబంధించి స్పష్టత కోరుతూ ఏపీఎంసీ గురువారం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్ఎంసీ నిబంధనలు, లేఖలో ప్రస్తావించిన అంశాలను కోర్టు ముందు ఉంచనుంది.

తొందరలో జగన్ జైలుకెళ్లడం ఖాయం: నల్లమిల్లి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లిక్కర్ కుంభకోణం మూలాలు కదులుతున్నాయని, ఆ కేసులో తొందరలోనే జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అవినీతికి జగన్మోహన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని దేశ, విదేశాల్లో మాట్లాడుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ మునిగిపోయే నావగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో నుంచి బయటపడేందుకే జగన్మోహన్‌రెడ్డి పరామర్శల పేరుతో దండయాత్రలు సాగిస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాడని ఆక్షేపించారు.

నేతన్నలకు న్యాయం చేసింది కూటమి ప్రభుత్వమే

» పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్దయ్య

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు ఇచ్చిన హామీలను శరవేగంగా అమలు చేసి, వారికి న్యాయం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం పాలైన నేతన్నల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రూ.10వేల కోట్లతో నూతన టెక్స్‌టైల్ పాలసీ అమలుకు శ్రీకారం చుట్టిందని, 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. అమరావతిలో చేనేత మ్యూజియం నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.

సీఎం రమేశ్ నోరు అదుపులో పెట్టుకో: మన్నె

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎంపీ సీఎం రమేశ్‌పై బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో తిరగాలన్నా, మంచిగా ఉండాలన్నా, ఆయన తన నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందంటూ సీఎం రమేశ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేశ్‌పై శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మన్నె గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. టీడీపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన సీఎం రమేశ్.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులకు భయపడి, మనుగడ కాపాడుకోవడానికే బీజేపీలో ఆశ్రయం పొందారని చెప్పారు. ఆయనకు సారా కాంట్రాక్టులు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అవాకులు, చవాకులు పేలడం సీఎం రమేశ్‌కు తగదన్నారు. సీఎం రమేశ్‌కు ఫోర్త్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల కాంట్రాక్టు ఇచ్చినందుకే తెలంగాణను 20మంది సీమాంధ్ర పెట్టుబడిదారులు దోచుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శిస్తున్నారన్నారు.

రెవెన్యూ అధికారులపై టీడీపీ నేతల దాడి

» మట్టి తరలింపును అడ్డుకున్నారనే..!

గార్లదిన్నె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి తరలింపును అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై టీడీపీ నాయకులు దాడి చేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలోని సింగరప్ప కొండ వద్ద అనుమతులు లేకుండా యంత్రాల ద్వారా ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్నట్లు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఎర్రమట్టి తరలింపును అడ్డుకుని, చర్యలు తీసుకోవాలని సిబ్బందిని వారు ఆదేశించారు. దీంతో కల్లూరు వీఆర్వో రవికాంత్, వీఆర్ఏ నాగరాజు గురువారం (7న) రాత్రి సింగరప్ప కొండ వద్దకెళ్లారు. మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని వాటి తాళాలు లాక్కున్నారు. విషయం తెలుసుకున్న కల్లూరు టీడీపీ నాయకులు మధు, రామాంజి, నరసింహ, శేషయ్య, వీరేశ్ వచ్చి.. వీఆర్వో, వీఆర్ఏతో వాగ్వాదానికి దిగారు. దుర్భాషలాడుతూ వారిపై దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడికి సంబంధించి ఐదుగురిపై శుక్రవారం రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నిమిష ప్రియను 2 వారాల్లో తీసుకొస్తా: కేఏ పాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియను రెండు వారాల్లో దేశానికి తిరిగి తీసుకొస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో నిమిష ప్రియ భర్త థామస్‌తో కలిసి కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. జూలై 14న నిమిష ప్రియను కాపాడలేక పోయామని సుప్రీంకోర్టులో కేంద్రం తెలిపిందని, ఆమెకు జూలై 16న ఉరిశిక్ష విధించాల్సి ఉందని, కానీ చివరికి ఉరిశిక్ష నుంచి తప్పించామని తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్ అసమర్థతతోనే కేంద్రం నిమిష ప్రియను కాపాడలేమని తెలిపిందని, కావున వెంటనే జైశంకర్ ఆ పదవి నుంచి తప్పించాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా చేయలేనిది తాను చేయడాన్ని కొందరు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

ఆ నంబరు అమిత్ షాదే!

» కేంద్ర హోం మంత్రితో మాట్లాడిన మాటలూ వినేశారా?

» సిట్ చెప్పింది విని అవాక్కయిన కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. విచారణాధికారులు ఇచ్చిన ఫోన్ నంబర్లు చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌తో పలుమార్లు మాట్లాడారు. శుక్రవారం దిల్‌కుశ్ అతిథి గృహంలో సిట్ విచారణ సందర్భంగా ఈ ముగ్గురు అగ్రనేతల ఫోన్ నంబర్లను సిట్ అధికారులు సంజయ్ ముందుంచారు. ఆ నంబర్లు ఎవరివని అడగడంతో ఆయన అవాక్కయినట్లు తెలిసింది. కేంద్ర హోం మంత్రి, పార్టీ అగ్రనేతలతో తాను మాట్లాడిన మాటలు కూడా విన్నట్లు తెలియడంతో దిగ్భ్రాంతికి గురైనట్లు సమాచారం. విచారణ అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో తొలి బాధితుడిని తానేనని.. తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆరోపించారు. ట్యాపింగ్ కేసులో సిట్ వెల్లడించిన విషయాలు దిగ్భ్రాంతికి గురిచేశాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 6500 మంది ఫోన్లు ట్యాప్ చేసిందని, తనతోపాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు, నాటి మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫోన్లను సైతం ట్యాప్ చేశారని చెప్పారు. కేసీఆర్ కూతురు కవిత, అల్లుడి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కేసును సీబీఐకి అప్పగించాలని, ఇప్పుడు జరిగేదంతా తూతూ మంత్రమేనని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య జరిగిన ఒప్పందమేనని భావించాల్సి ఉంటుందని సంజయ్ చెప్పారు. రాష్ట్రంలో సీబీఐ నేరుగా విచారణ జరిపే అవకాశం ఉంటే ఈ పాటికి కేసీఆర్, ఆయన కొడుకును జైల్లో వేసేవాళ్లమని అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో సీబీఐ నేరుగా విచారణ జరిపే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు.

వైసీపీ అవినీతిని సహించేది లేదు

» అక్రమార్కులకు శిక్షలు తప్పవు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అవినీతిని సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై దర్యాప్తులో రాజీ పడేది లేదని, అక్రమార్కులకు శిక్షలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని ఆయన కలిశారు. రాష్ట్ర రాజకీయాలు, బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'బీజేపీని ఇంటింటికీ తీసుకెళ్లాలని, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను వివరించాలని, ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించాలని ప్రధాని మోదీ సూచించారు. ఏపీలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. తెలుగు భాషను ప్రమోట్ చేయాలని, యువతకు పార్టీని చేరువ చేయాలని సూచించారు. అలాగే... ట్రంప్ టారిఫ్‌ల గురించి ఏపీ రైతాంగం ఆందోళనలో ఉందని ప్రధానికి వివరించా. అమెరికా సుంకాలను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాలని కోరాను. ఆత్మనిర్భర్ భారత్‌పై దృష్టి పెట్టాలని, పొగాకు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు పండించాలని ప్రధాని సూచించారు. తొమ్మిది జిల్లాల్లో నా పర్యటన పూర్తయింది. ఈ నెల 10 నుంచి మూడోదశ జిల్లాల పర్యటన ప్రారంభమవుతుంది. 30న సంచార జాతుల కోసం స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వారికి డీఎన్‌టీ సర్టిఫికెట్ ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ విషయాలన్నీ ప్రధానికి వివరించాను' అని తెలిపారు.



ప్రధాని మోదీని సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

వైసీపీ బెదిరింపులను ఉపేక్షించవద్దు: ఏపీ మద్యం కుంభకోణం కేసు ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే పెద్దదని మాధవ్ ఆరోపించారు. ఏపీ మద్యం కేసులో అరెస్టులను బీజేపీ స్వాగతిస్తోందని, భవిష్యత్తులో మళ్లీ కుంభకోణాలు పునరావృతం కాకూడదంటే.. ఈ కేసులో శిక్షలు కఠినంగా ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్రమార్కులకు ఎప్పుడూ అండగా నిలవదని చెప్పారు. ప్రభుత్వ అధికారులపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. నాలుగేళ్ల తర్వాత అధికారంలోకి తామే వస్తామని, అప్పుడు అధికారుల వ్యవహారం చూస్తామని అంటూ వైసీపీ బెదిరింపులకు పాల్పడడం ముమ్మాటికీ స్వేచ్ఛను హరించడమేనని తెలిపారు. అటువంటి బెదిరింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నారు. అమరావతిలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు విధాన పరంగానే భూముల కేటాయింపు జరుగుతోందని తెలిపారు.

పార్టీ అధ్యక్షా.. పదవులెక్కడ?



(మొదటి పేజీ తరువాయి)

లభిస్తున్నాయి. ఈ జాప్యానికి ప్రధాన కారణం ఎమ్మెల్యేలే అని కొందరు చెబుతుండగా... తాము పేర్లు పంపి ప్రయోజనం లేదని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. నామినేటెడ్ పోస్టులకు పేర్లు పంపాలని టీడీపీ అధిష్ఠానం కొన్ని నెలలుగా కోరుతోంది. కానీ ఇప్పటికీ చాలా మంది ఎమ్మెల్యేలు పేర్లు పంపలేదు. "మేం ఎవరి పేరు ఇచ్చినా చివరకు ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఇంకెవరినో ఎంపిక చేస్తారు. ఆ మాత్రం దానికి పేర్లు ఇవ్వడం ఎందుకు?" అని కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు.. స్థానికంగా నేతల మధ్య పంచాయితీలు తేలకపోవడంతో పేర్లు పంపడం లేదు. ఈ కారణంగా పీఏసీఎస్‌ల్లో ఇంకా 13 శాతం, ఏఎంసీల్లో 20 శాతం, దేవాలయ కమిటీల్లో 50 శాతం పదవులు భర్తీ కాలేదు. ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి చేయాలని టీడీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పార్టీ పదవుల్లోనూ జాప్యమే

పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు టీడీపీ అధిష్ఠానం ఈ ఏడాది ఏప్రిల్‌లో కమిటీని నియమించింది. ఇందులో వర్ల రామయ్య అధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎండీ షరీఫ్, మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి కుమార్, సవిత, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సభ్యులుగా ఉన్నారు. సాధారణంగా మహానాడు నాటికే సంస్థాగత కసరత్తు పూర్తి చేసి రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరుగుతుంటుంది. పార్టీ అధినేత చంద్రబాబు కూడా చాలాసార్లు మే 15 నాటికి సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో నాయకుల నడుమ సమన్వయ లోపంతో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది.

భజనచేసే వారికి అందలం?

పనిచేసిన వారికే పదవులివ్వాలన్న చంద్రబాబు ఆదేశాలను చాలా మంది ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా.. ఎన్నికల అనంతరం తమ చుట్టూ తిరిగి భజన చేస్తున్నవారికి పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే.. ఎన్నికల్లో పనిచేసిన వారికి కాకుండా మండల పార్టీ అధ్యక్ష పదవులను ఏకంగా తన బంధువర్గానికి కట్టబెట్టారు. దీనిపై స్థానికంగా పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొందని అంటున్నారు. క్లస్టర్, యూనిట్, బూత్(సీయూబీ) స్థాయిలో సంస్థాగత ప్రక్రియ పూర్తయినా.. గ్రామ, మండల స్థాయికి వచ్చేసరికి పేర్ల పంచాయతీ నడుస్తోంది. దీంతో ఈ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా తయారైంది. గ్రామ, మండల స్థాయిలో వరుసగా మూడు సార్లు ఆ పదవి చేసిన వారిని ఆ పదవిలో కొనసాగించకూడదన్న నిర్ణయం కూడా పదవుల భర్తీపై ప్రభావం చూపుతోంది. ఈ నిర్ణయం ప్రకారం ఆరేళ్లు గ్రామ, మండల పార్టీ అధ్యక్షులుగా చేసిన వారు ఆ పదవిలో కొనసాగకూడదు. అంత కన్నా పెద్ద పదవిలో గానీ.. దానికి సమాంతరమైన పదవిలో గానీ వారిని నియమించాలి. అయితే గత ఐదేళ్లు పార్టీ ప్రతిపక్షంలో ఉంది. ఆ సమయంలో అధికార వైసీపీతో పోరాడిన వారికి ఇప్పుడు పదవులు దక్కవు. మండల పార్టీ అధ్యక్ష పదవి కన్నా పెద్ద పదవి ఇవ్వాలని చెబుతున్నా.. అది కార్యరూపం దాల్చదు. దీంతో ప్రతిపక్షంలో ఉండి పోరాటాలు చేసిన వారికి ఇప్పుడు పదవులు ఎండమావేనన్న ఆవేదన వ్యక్తమవుతోంది. గ్రామ, మండల స్థాయిలో సంస్థాగత ప్రక్రియను ముగించుకుని, అసెంబ్లీ, పార్లమెంటు స్థాయిలో కమిటీలను నియమించుకుంటే తప్ప రాష్ట్ర స్థాయి కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తి కాదు. సంస్థాగత ఎన్నికల నిర్వహణ కమిటీ కసరత్తు చేస్తున్నా ఎమ్మెల్యేల సహాయ నిరాకరణతోపాటు పలు కారణాలతో ఆలస్యమవుతోంది.

ఎందుకీ పరిస్థితి..?

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యకలాపాలపైనే దృష్టి సారిస్తున్నారు. రాజధాని అభివృద్ధి పనులు, సూపర్ సిక్స్ హామీల అమలు, పెట్టుబడులు తీసుకురావడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. పార్టీ వ్యవహారాలపై పెద్దగా దృష్టి సారించలేకపోతున్నారు. పార్టీ అధినేత ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వారానికోసారి పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి.. సమస్యలతో వచ్చేవారిని కలిసేవారు. ఆ తర్వాత కేవలం ఏదైనా పార్టీ కార్యక్రమం ఉన్నప్పుడు మాత్రమే వస్తున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్ సైతం పూర్తిగా ప్రభుత్వ కార్యకలాపాల్లో నిమగ్నమైపోయారు. మరోవైపు.. పార్టీ సమన్వయ బాధ్యతలన్నీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఒక్కరే చూసుకోవలసి వస్తోంది. దీంతో రెండేళ్లకోసారి నిర్వహించుకునే సంస్థాగత ఎన్నికలనూ నిర్దేశిత సమయానికి పూర్తిచేయలేని దుస్థితి నెలకొంది. గతంలో పార్టీ కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తల సమస్యలను సావధానంగా విని.. పరిష్కరించేందుకు సీనియర్ నాయకులు అక్కడ అందుబాటులో ఉండేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎవరూ పెద్దగా రావడం లేదని అంటున్నారు. ఫలితంగా పార్టీపరంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి.



గోవాలో గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిసిన బీసీ సంఘాల ప్రతినిధులు

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో బీసీ సంఘాల నేతల భేటీ

» బీసీల డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఓబీసీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు బీసీ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఓబీసీ మహాసభ సందర్భంగా గోవా వెళ్లిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు రాజ్ భవన్‌లో అశోక్ గజపతి రాజుని కలిసి బీసీల డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బీసీలకు చట్టసభల్లో జనాబా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ల కల్పన, మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరినట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఏపీ ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కురుమ, నేతలు నరేష్ ప్రజాపతి, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బాలగుండ్ల శ్రీనివాసరావు, పూర్ణ, కాశి, హనుమంతరావు, వేముల కృష్ణ, వెంకటరావు, సతీష్ తదితరులున్నారు.

మాస్టర్ ప్లాన్ మాయ

విశాఖ కొండల్ని కొల్లగొట్టేందుకు నాడు ఎత్తు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రతి ఇరవై ఏళ్లకు ఒకసారి నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తుంది. దాని ప్రకారమే భవన నిర్మాణాలకు అనుమతులిస్తారు. విశాఖ నుంచి భీమునిపట్నం వరకు తీరం వెంబడి కైలాసగిరి, సీతకొండ, కప్పరాళ్ల కొండ, రుషికొండ, బావికొండ, తొట్లకొండ, పావురాల కొండ.. ఇలా అనేకం ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2021లో అవన్నీ కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో (సీఆర్‌జెడ్) చూపించారు. 'నో డెవలప్‌మెంట్ జోన్'గా ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే మాస్టర్ ప్లాన్-2041 రూపొందించింది. అప్పటికే విశాఖ నుంచి భీమిలి వరకు వందలాది ఎకరాలు సొంతం చేసుకున్న వైసీపీ పెద్దలు వారి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త మాస్టర్ ప్లాన్‌లో అవసరమైనవన్నీ చేర్పించారు. అప్పుడే రుషికొండపై పర్యాటక వసతి గృహాలను కూలగొట్టి జగన్ కుటుంబం కోసం సీఎం క్యాంపు కార్యాలయం పేరుతో కొత్తభవనం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వాటికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవడానికి అప్పటి ప్రభుత్వం అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. భవిష్యత్తులో అలాంటి సమస్యలు రాకుండా మొత్తం కొండలన్నింటినీ కొత్త మాస్టర్ ప్లాన్‌లో 'మిక్స్‌డ్ జోన్'గా మార్చేసింది. అంటే 'నో డెవలప్‌మెంట్ జోన్' పదం మాయమైంది. దీంతో ఆయా కొండపై నిర్మాణాలు చేపట్టేందుకు మార్గం సులువైంది.

కొండలపై గునపం..

'మిక్స్‌డ్ జోన్'ను అడ్డం పెట్టుకొనే తిమ్మాపురంలో సురేశ్ ప్రొడక్షన్స్‌కు స్టూడియో నిర్మాణానికి ఇచ్చిన కొండలో కొంత భాగం కొల్లగొట్టేశారు. వాస్తవానికి అక్కడ సినీ పరిశ్రమ అభివృద్ధి పనులు మాత్రమే చేపట్టాలి. కొత్త మాస్టర్ ప్లాన్‌లో అది మిక్స్‌డ్ జోన్‌గా ఉన్నందున లేఅవుట్ వేయించి అందులో వాటా కొట్టేశారు. దీనిపై విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో అక్కడ లేఅవుట్ చెల్లదని తీర్పు వచ్చింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆ భూమిని వెనక్కి తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా, వాటిని సురేశ్ ప్రొడక్షన్స్ సవాల్ చేసింది. ఇదిలా ఉండగా, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాపులుప్పాడ సమీపాన బావికొండపై అతి పెద్ద ప్రభుత్వ అతిథిగృహం నిర్మాణానికి నడుం కట్టింది. అనుమతులు లేకుండానే జేసీబీలతో కొండను చదును చేసింది. దీనిపై ప్రజా సంఘాలు హైకోర్టులో కేసు వేయగా, పనులు ఆపాలని కోర్టు ఆదేశించింది. దీంతో వైసీపీ పెద్దలు రుషికొండపై పడ్డారు. అక్కడ పర్యాటకశాఖ రిసార్ట్స్‌ను కూలగొట్టి పాత అనుమతులతోనే కొత్తది నిర్మించారు.

మాస్టర్ ప్లాన్ మార్చాలి..

విశాఖ నగరంలో కైలాసగిరి ఉంది. అది పర్యాటక/ఆధ్యాత్మిక ప్రాంతం. రెవెన్యూ అధికారులు దాన్ని ఒక పార్కులా అభివృద్ధి చేయడానికి వీఎంఆర్‌డీఏకు ఇచ్చారు. దానిపై పదేళ్ల క్రితమే పర్యాటకులు బస చేసేందుకు గెస్ట్ హౌస్‌ల నిర్మాణానికి నడుం కట్టారు. కొంత వరకు పనులు కూడా చేపట్టారు. దానిపై పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో, వాటిని ఆపేశారు. ఇప్పుడు మళ్లీ అక్కడ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు. కప్పరాళ్లకొండను రెవెన్యూ అధికారులు పర్యాటక శాఖకు అప్పగించారు. అక్కడ హెల్త్ స్పా ఏర్పాటుకు 33 ఏళ్లకు లీజుకు ఇచ్చారు. వారు కూడా ఢిల్లీ నుంచి అష్టకష్టాలు పడి అనుమతులు తెచ్చుకొని 'బే పార్క్' ఏర్పాటుచేశారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్నారు. విశాఖలో కొండలను కొల్లగొట్టడానికి కారణమైన మాస్టర్ ప్లాన్-2041ను మార్చాలని, 'మిక్స్‌డ్ జోన్' నుంచి తొలగించి, వాటిని రక్షించడానికి తిరిగి 'నో డెవలప్‌మెంట్ జోన్'గా చేర్చాలని విశాఖలో పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ కొందరు వీఎంఆర్‌డీఏకు విన్నపాలు కూడా సమర్పించారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి కొండలను 'మిక్స్‌డ్ జోన్' నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నమ్రత లిస్టులో 200 మంది దంపతులు!

» సరగసీ కోసం 'సృష్టి'లో భారీగా రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్ సిటీ/విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. సరగసీ పేరిట 'సృష్టి' నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత మోసాలు బయటికి వస్తున్నాయి. నమ్రత సహా 26 మందిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు నమ్రతకు ఏజెంట్లుగా వ్యవహరించిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఇందులో విజయ్, సరోజ, రత్నలను విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 30కి చేరింది. అరెస్టయిన వారిలో వైద్యులు, టెక్నీషియన్లు, ఏజెంట్లు, శిశు అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడిన దళారులు ఉన్నారు. విశాఖలోని కేజీహెచ్‌లో పని చేస్తున్న మరో ముగ్గురు వైద్యుల పాత్రను కూడా గుర్తించిన పోలీసులు వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకునే అవకాశముంది. సంతానం కోసం తన వద్దకు వచ్చే దంపతులకు సరగసీకి నమ్రత ఒప్పించేది. ఆమె మాటలను నమ్మిన దంపతుల నుంచి స్పెర్మ్, అండాలు సేకరించి వేరొకరి గర్భంలో బిడ్డను పెంచుతున్నామని నమ్మించేది. కానీ, వేరెవరికో పుట్టిన బిడ్డలను ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసి సరగసీ ద్వారా పుట్టిన బిడ్డ అంటూ ఇచ్చి నమ్రత లక్షల్లో డబ్బు వసూలు చేసేది. కాగా, నమ్రత మాటలు నమ్మి సరగసీ ద్వారా సంతానం పొందేందుకు తెలుగు రాష్ట్రాల్లోని సృష్టి ఫర్టిలిటీ సెంటర్లలో 200 మంది దంపతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. ఆయా దంపతులకు సంబంధించిన జాబితా పోలీసుల చేతికి చిక్కినట్టు తెలిసింది. అయితే, నమ్రత బృందం వారిలో ఎంతమందికి సంతానాన్ని అందించింది? ఎంతమందికి చికిత్స కొనసాగుతోంది? అనేది తెలియాల్సి ఉంది. డాక్టర్ నమ్రత 80 మంది శిశువులను విక్రయించినట్టు పోలీసులు ఇప్పటికే గుర్తించిన సంగతి తెలిసిందే. ఆ 80 మంది చిన్నారులను తీసుకున్న వారిలో సరగసీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులు ఉన్నారా? ఏ రాష్ట్రం నుంచి ఎంతమంది చిన్నారులను కొనుగోలు చేశారు? అనే అంశాలపై పోలీసులు ప్రస్తుతం దృష్టి సారించారు. కాగా, సరగసీ పేరిట ఒక్కో బిడ్డ ద్వారా రూ.40 లక్షల దాకా పొందే డాక్టర్ నమ్రత.. అనతి కాలంలోనే రూ.25 కోట్ల మేర ఆస్తులు కూడబెట్టినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కాగా, ఈ కేసులో అరెస్టయిన వైజాగ్, కేజీహెచ్ ఆస్పత్రి అనస్థీషియా విభాగం వైద్యుడు డాక్టర్ వాసుపల్లి రవి వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కు సోదరుడని తెలిసింది.

45 ఏళ్లు దాటిన ప్రతి ఐదుగురిలో ఒకరికి మధుమేహం!

న్యూఢిల్లీ, ఆగస్టు 8: భారత్‌లో మధుమేహం వేగంగా విస్తరిస్తోంది. 2019లో నిర్వహించిన అధ్యయనంలో 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహంతో జీవిస్తున్నట్టు గుర్తించారు. వారిలో కూడా ప్రతి ఐదుగురిలో ఇద్దరికి తమకు ఈ వ్యాధి ఉన్నట్టు తెలియదని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో వివరాలు ప్రచురితమయ్యాయి. భారత్‌లో మధ్య వయస్కులు, వృద్ధుల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు ఎక్కువగా డయాబెటిస్ బారిన పడుతున్నట్టు గుర్తించింది.

మందు తాగేది మగాళ్లే!

» రాష్ట్రంలో మహిళల్లో ఈ సంస్కృతి చాలా తక్కువ

» పురుషులు 31.2 శాతం.. మహిళలు 0.2 శాతం

» జాతీయ కుటుంబ వైద్య సర్వేలో వెల్లడి

» మొత్తం కోటిన్నరమందికి పైగా అలవాటు

» వారిలో రోజూ తాగేవారు 50 లక్షల మంది

» సగటున నెలకు 10 క్వార్టర్లు తాగుతున్నారు

» ఈశాన్య రాష్ట్రాల్లో పోటీపడుతున్న మహిళలు

» అరుణాచల్‌ప్రదేశ్‌లో 17.2%.. సిక్కింలో 14.8%

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు మద్యపానాన్ని చెడు వ్యసనంగా భావించేవారు. రాను రానూ ఇదో ఫ్యాషన్‌లా మారిపోతోంది. తాగేవారి శాతమూ పెరుగుతోంది. మన రాష్ట్రంలో మద్యం తాగేవాళ్లంతా మగవాళ్లే. ప్రస్తుత రాష్ట్ర జనాభా దాదాపు 5.4 కోట్ల మందిలో 31.2 శాతం మంది అంటే.. 1.56 కోట్ల మంది పురుషులు మందు తాగుతున్నారు. ఇక మహిళల విషయానికొస్తే కేవలం 0.2 శాతం అంటే.. దాదాపు లక్ష మందికి మాత్రమే మద్యం అలవాటు ఉంది. మన దేశంలో ఈశాన్య, మరికొన్ని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు మద్యం తాగే సంస్కృతి చాలా తక్కువ. జాతీయ కుటుంబ వైద్య సర్వే నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. 2019-2021 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో మద్యం వినియోగంపై చేసిన సర్వే నివేదిక ఇటీవల విడుదలైంది. ఈశాన్య రాష్ట్రాల్లో మహిళలు మందు తాగే సంస్కృతి ఎక్కువగా ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో ఏకంగా 17.2 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నారు. ఆ తర్వాత సిక్కింలో 14.8 శాతం, అసోంలో 5.5 శాతం, త్రిపురలో 4.3 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఇక తెలంగాణలో 4.9 శాతం, గోవాలో 4.8 శాతం, లద్దాఖ్‌లో 3.6 శాతం మహిళలకు మందు అలవాటు ఉన్నట్టు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బిహార్, చండీగఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో అతి తక్కువ మంది మహిళలు మద్యం సేవిస్తున్నారు.

రోజూ తాగేవారు మూడోవంతే

రాష్ట్రంలో కోటిన్నర మందికి పైగా మందు అలవాటున్నా.. మద్యం అమ్మకాల ఆధారంగా చూస్తే అందులో మూడోవంతు మంది మాత్రమే రోజూ మందు తాగే అవకాశం కనిపిస్తోంది. కోటి మందికిపైగా వారానికోసారి లేదా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే మందు తాగుతున్నట్టు అంచనా. రాష్ట్రంలో నెలకు సగటున 34 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడవుతోంది. ఒక్కో కేసులో 48 క్వార్టర్ సీసాలు ఉంటాయి. ఈ లెక్కన మొత్తం 16.32 కోట్ల క్వార్టర్లు అమ్ముడవుతున్నాయి. తాగేవారి సంఖ్య (1.57 కోట్లు)తో పోల్చి చూస్తే సగటున నెలకు 10.5 క్వార్టర్లు తాగుతున్నారు. కానీ వారిలో రోజూ మందు తాగేవారు, అందులోనూ రోజుకు రెండు క్వార్టర్లు తాగే దినసరి కూలీలూ ఉన్నారు. ఇలాంటివారు దాదాపు 50 లక్షల మంది ఉంటారని అంచనా. మరో కోటి మందికిపైగా అప్పుడప్పుడు మందు తాగుతున్నారు.

యూత్‌లో బీర్ ట్రెండే

యూత్‌లో ఎక్కువగా బీర్ ట్రెండే కనిపిస్తోంది. ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో ఏకంగా 129 శాతం బీర్ అమ్మకాలు పెరిగాయి. గత ప్రభుత్వంలో బీర్‌లో పాపులర్ బ్రాండ్లు దొరక్కపోవడంతో యువతలో అనేక మంది గంజాయి, ఇతర మత్తుకు అలవాటుపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కంపెనీల బీర్లు అందుబాటులోకి రావడంతో అమ్మకాలు భారీగా పెరిగాయి. నెలకు 20 లక్షల కేసులకు పైగా బీర్ అమ్ముడవుతోంది. బీర్లు దాదాపుగా యువతే తాగుతున్నారు. వీరిలో అక్కడక్కడా ముఖ్యంగా నగరాల్లో అమ్మాయిలూ ఉండే పరిస్థితి ఉంది. గత కొన్నేళ్లుగా డ్రాట్ బీర్ అమ్మకాలు కూడా పెరిగాయి. అంటే ఎప్పుడో తయారు చేసింది కాకుండా అప్పటికప్పుడు తయారు చేసి ఇచ్చే బీర్ తాగేందుకు యువత ఇష్టపడుతోంది.

ఏపీలో ఆ కల్చర్ లేదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పోలిస్తే మెట్రో నగరాల్లో భిన్నమైన సంస్కృతి ఉంటుంది. అక్కడ పబ్‌లు అందుబాటులో ఉంటాయి. పురుషులతో పాటు కొందరు మహిళలు కూడా పబ్ కల్చర్‌కు అలవాటుపడ్డారు. అలాంటి పబ్‌ల సంస్కృతి ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా విస్తరించలేదు.

కలిసి తిరిగినవాడే చంపించాడంటే నమ్మలేకపోయా

(మొదటి పేజీ తరువాయి)



వివేకా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సునీత, రాజశేఖర్‌రెడ్డి, సౌభాగ్యమ్మ

భర్త రాజశేఖర్‌రెడ్డి, తల్లి సౌభాగ్యమ్మతో కలిసి ఆమె నివాళులర్పించారు. వివేకా సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సునీత విలేకరులతో మాట్లాడారు. 'నాన్న చనిపోయినప్పుడు ఖననం చేసేందుకు ఇంటి నుంచి ర్యాలీగా వెళ్దామని చెబితే అప్పుడు జగనన్న వద్దన్నారు. నిన్న పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక ప్రచారంలో జరిగిన గొడవలో ఒక కార్యకర్తకు చిన్న దెబ్బ తగిలితే పెద్ద ర్యాలీ చేశారు. అవినాశ్‌రెడ్డిని మంచి లీడర్‌గా చేయాలని, మంచి భవిష్యత్‌ ఉందని నాన్న ఎప్పుడూ అనేవారు. అలాంటి వ్యక్తిని మాతో తిరిగిన, మాతో ఆడుకున్న అవినాశ్‌రెడ్డే హత్య చేయించడం దారుణం. నిన్న కార్యకర్తకు దెబ్బ తగిలిందని సతీశ్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి పులివెందుల డీఎస్పీతో వాదనకు దిగారు. పోలీసులు టీడీపీకి తొత్తులుగా మారారని ఆరోపించారు. మరి నాన్న హత్య జరిగినప్పుడు సంఘటనాస్థలంలో సమయంలో పోలీసుల సమక్షంలో రక్తపు మరకలు చెరిపేసి మీరు శుభ్రం చేయలేదా? అప్పుడు మీకు పోలీసులు తొత్తులా? వివేకాను ఆదినారాయణరెడ్డి, సతీశ్‌రెడ్డి, బీటెక్‌ రవి హత్య చేయించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసే విషయమై అవినాశ్‌రెడ్డి కాగితం మీద రాసుకొచ్చారు. దానిపై సంతకం చేయాలని కోరారు. అయితే నేనొప్పుకోలేదు. నాన్న హత్య జరిగి ఆరేళ్లయింది. నేటికీ న్యాయం జరగలేదు. హైకోర్టులో 6 కేసులు, సుప్రీంకోర్టులో 6 కేసులు నడుస్తున్నాయి. న్యాయం జరుగుతుందని నమ్ముతున్నా' అని ఆమె తెలిపారు.

వివేకాను చంపించింది అవినాశ్‌రెడ్డే

- మాపై నిందలు వేశారు: ఎమ్మెల్యే ఆది

పులివెందుల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్‌ వివేకానంద రెడ్డిని వైసీపీ ఎంపీ వైఎస్‌ అవినాశ్‌రెడ్డే హత్య చేయించారన్నది అందరికీ తెలిసిందేనని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. వివేకానందరెడ్డి జయంతి సందర్భంగా పులివెందులలో వివేకా నివాసానికి వెళ్లి ఆయన సతీమణి సౌభాగ్యమ్మ, కూతురు సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డిలను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయంగా వైఎస్‌ కుటుంబంతో విబేధాలు ఉన్నాయే కానీ మనిషిని హత్య చేసేంత ఉద్దేశాలు తమకు లేవన్నారు. అవినాశ్‌రెడ్డి కుట్రపూరితంగా వివేకాను హత్య చేయించి తమపై వేసేందుకు చూశారని ఆరోపించారు. వివేకా కుమార్తె సునీత స్పందిస్తూ.. ఆ రోజు ఈయన్న (ఆది) హత్య చేశాడా అని అనుకున్నానని, కానీ తమ అన్నే హత్య చేయించాడని తెలిసి ఆశ్చర్యపోయానని అన్నారు. జగన్‌కు, అవినాశ్‌కు ఉన్న దరిద్రపు ఆలోచనలు తమకు లేవని ఆదినారాయణ రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులు ఎక్కడైనా నామినేషన్‌ వేసే పరిస్థితులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సజావుగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేస్తోందన్నారు. గతేడాది జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పులివెందులలో తమకు 25 శాతం ఓట్లు వచ్చాయని, 25 శాతాన్ని 52 శాతంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని యర్రబల్లె చెరువుకు సంబంధించి నీటిని నింపేందుకు 48 గంటల్లోనే పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. ప్రజలు కచ్చితంగా తమను ఆదరిస్తారని అన్నారు.



రాఖీ లాంటి.. రాఖీ పూలు!

ఈ పుష్పాలు.. చూడటానికి అచ్చం రాఖీల్లా ఉన్నాయి కదూ! విశాఖ నగరంలోని పెదవాల్తేరులో గల బయో డైవర్సిటీ పార్కులో ఈ పూలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. వీటిని పాసిఫ్లోరా, కృష్ణ ఫలం, రాఖీ పుష్పాలు అని పిలుస్తారు. ఇవి రాఖీ మాదిరిగా ఉండటంతో పాటు కట్టేందుకు అనువుగా తీగలు (త్రెడ్‌ మాదిరి) కూడా ఉండటం వీటి ప్రత్యేకత. ఈ పూలను రాఖీ మాదిరిగా కట్టుకోవచ్చని పార్కు వ్యవస్థాపకుడు రామమూర్తి అన్నారు. ఈ చెట్టుకు కాసే పండ్లు తింటే ఒంటికి చలువ చేస్తాయంటున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పార్వతీపురంలో డప్పు కొడుతున్న కలెక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ (కుడివైపున), పీవో శ్రీవాత్సవ

డప్పు కొట్టి.. థింసా నృత్యం

- అడవి తల్లికి మన్యం కలెక్టర్‌ పూజలు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పార్వతీపురంలోని ఐటీడీఏ కార్యాలయంలో అడవితల్లి విగ్రహానికి ప్రథమ పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్‌ శ్రీవాత్సవ సంప్రదాయబద్ధంగా అడవితల్లికి నూతన వస్త్రాలు, సారెను సమర్పించారు. అనంతరం విగ్రహానికి పాలాభిషేకం చేశారు. గిరిజనులతో కలిసి డప్పు కొట్టి థింసా నృత్యం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కలెక్టర్‌ తెలిపారు. డోలీ మోతలు తప్పించేందుకు పక్కా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- పార్వతీపురం. ఆంధ్రజ్యోతి

రూ.కోటికి తగ్గేదేలే!

- అడిగినంతా ఇస్తేనే ఫైల్‌పై సంతకం
- లేకుంటే కొర్రీలతో కాంట్రాక్టర్లకు చుక్కలు
- 'గిరిజన' ఈఎన్‌సీ శ్రీనివాస్‌ నిర్వాకం
- అక్రమ సంపాదనంతా అమెరికాకు బదిలీ
- 22 వరకు రిమాండ్‌ విధించిన ఏసీబీ కోర్టు



విజయవాడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సబ్బవరపు శ్రీనివాస్‌... విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్‌ కార్యాలయంలో ఈఎన్‌సీ. ఆయన ఏ కాగితం మీద సంతకం పెట్టాలన్నా రూ.కోటి చేతిలో పడాల్సిందే. తాను చెప్పిందే రేటు. ఇందులో మరో మాటే లేదు. అడిగినంత ఇచ్చుకుంటే ఓకే. లేకపోతే కొర్రీల మీద కొర్రీలు వేసి కాంట్రాక్టర్లకు చుక్కలు చూపిస్తారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు అమెరికాలో ఉంటున్నారు. కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన లంచం సొమ్మును అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు పంపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో కొంత మంది మంత్రులతో ఈయనకు సత్సంబంధాలు ఉన్నాయి. కాంట్రాక్టర్లను ఎంత వేధించినా అడిగేవారు లేకపోవడంతో ఇంజనీరింగ్‌ విభాగంలో తిరుగులేని అధికారిగా మారారు. ఒక కాంట్రాక్టర్‌ దక్కించుకున్న పనిని మరో కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి రూ.కోటికి తక్కువ కాకుండా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే పనిని మళ్లీ పాత కాంట్రాక్టర్‌కు అప్పగించాలన్నా రూ.కోటి ఇవ్వాల్సిందే. గతంలో ఆయనపై విచారణ చేసిన విజిలెన్స్‌ కమిషన్‌.. శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వానికి ఒక నివేదికను అందజేసింది. ఈఎన్‌సీ పోస్టుకు ఆయన అనర్హుడని అందులో స్పష్టం చేసింది. అయినా నాటి పాలకులు ఏరికోరి మరీ శ్రీనివాస్‌కు పదవిని కట్టబెట్టారు. తాను డిమాండ్‌ చేసిన మొత్తం ఇస్తేనే పెండింగ్‌ బిల్లులకు ఆమోదం తెలుపుతానని కొద్ది నెలల క్రితం ఉత్తరాంధ్రకు చెందిన ఓ కాంట్రాక్టర్‌ను వేధించాడు. ఆయన అధికార పార్టీ ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లి విషయం చెప్పి కన్నీరు మున్నీరయ్యారు. ఆ నేత ఈఎన్‌సీకి ఫోన్‌ చేసి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పనితీరు ఇదేవిధంగా ఉంటే చాలా ఇబ్బందులు పడతారని శ్రీనివాస్‌ను హెచ్చరించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదిలాఉండగా, కాంట్రాక్టర్‌ నుంచి రూ.25లక్షలు లంచం తీసుకున్న శ్రీనివాస్‌ను పట్టుకున్న అధికారులు విశాఖపట్నంలోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలు శుక్రవారం కొనసాగాయి. శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు ఈ నెల 22 వరకు రిమాండ్‌ విధించింది. అనంతరం ఆయన్ను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

పంట కొని.. డబ్బులు ఎగేసి!

- వివిధ వ్యాపారాల పేరిట 200 కోట్ల మేర మోసం
- శ్రీసత్యసాయి జిల్లాలో దాల్‌మిల్‌ సూరి బ్రదర్స్‌ ఆగడాలు
- ఒక్కొక్కరుగా వచ్చి ఫిర్యాదు చేస్తున్న బాధితులు



దాల్‌మిల్‌ సూరి

పుట్టపర్తి రూరల్‌, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆహార ధాన్యాల వ్యాపారం పేరుతో చిన్న, సన్నకారు రైతుల నుంచి పెద్దఎత్తున పంట ఉత్పత్తులు సేకరించి.. ఆపై వారికి డబ్బులు చెల్లించకుండా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అన్నదమ్ములు దాల్‌మిల్‌ సూరి, పాండు మోసం చేస్తున్నారని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. సత్యసాయి జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ వ్యాపారాల పేరిట వారు 200 కోట్ల మేర మోసం చేశారని అన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న సూరి బ్రదర్స్‌ ఆచూకీ తెలిస్తే తమకు తెలియజేయాలని కోరారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ రత్న వివరాలు వెల్లడించారు. కొత్తచెరువు మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములు దాల్‌మిల్‌ సూరి అలియాస్‌ మొరంశెట్టి సురేశ్‌, పాండు చేసిన ఆర్థిక మోసాలపై బాధితులు ఒక్కొక్కరుగా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారన్నారు. మోసాలు, ఆర్థిక నేరాలకు పాల్పడటంతో వైసీపీ నేత సూరిపై పీడీ యాక్ట్‌ నమోదు చేశామన్నారు. ఆయనపై ఇప్పటి వరకు పలు రాష్ట్రాల్లో 36కేసులు నమోదయ్యాయని, వాటిలో ఈడీ కేసులు ఉన్నాయని చెప్పారు. సూరి బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. దాల్‌మిల్‌ సూరిపై ఇప్పటికే లుకౌట్‌ నోటీసులు జారీ చేస్తామన్నారు. అన్నదమ్ముల ఆర్థిక నేరాలు, ఈడీ కేసుల వివరాలను బ్యాంకు అధికారులకిచ్చి వారి ఖాతాలను ఫ్రీజ్‌ చేయాలని కోరామని ఎస్పీ తెలిపారు.

ఫోన్‌లో సమాచారం లీక్‌ చేశారు

- స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించండి
- హైకోర్టును ఆశ్రయించిన మద్యం కేసు నిందితుడు వెంకటేశ్‌ భార్య

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా తన భర్త నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లోని సమాచారాన్ని సిట్‌ అధికారులు మీడియాకు లీక్‌ చేయడంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నిందితుడు వెంకటేశ్‌ నాయుడు(ఏ34) భార్య మహిత హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. మీడియా ట్రయల్‌ నిర్వహిస్తూ న్యాయ విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి శ్రీహరిబాబు తన భర్త నుంచి ఫోను తీసుకున్నారని, ఫోన్‌లోని సమాచారం లీక్‌ చేయడం వెనుక ఆయనే ఉన్నట్లు నమ్ముతున్నానని పేర్కొన్నారు. పత్రికలు, మీడియా, వెబ్‌సైట్లు, సోషల్‌ మీడియాలో ప్రచురించిన సమాచారాన్ని తఫోన్‌లోని సమాచారాన్ని ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా నియంత్రించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.క్షణం తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో 850 గంజాయి హాట్‌ స్పాట్లు

- ఈగల్‌ చీఫ్‌ ఆకే రవికృష్ణ



విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 850 గంజాయి హాట్‌ స్పాట్లను గుర్తించామని, వాటిపై నిఘా పెట్టి వినియోగదారులు ఎవరో తెలుసుకొని చర్యలు చేపడతామని 'ఈగల్‌' టీమ్‌ చీఫ్‌ ఆకే రవికృష్ణ తెలిపారు. విశాఖపట్నం కేంద్ర కారాగారాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గంజాయి కేసుల్లో ఖైదీలుగా ఉన్నవారితో మాట్లాడి ఈ కేసుల్లో పట్టుబడితే ఆ తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయో వారికి వివరించి, ఇకపై గంజాయి రవాణాకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. అనంతరం జైలు బయట రవికృష్ణ విలేకరులతో మాట్లాడారు. విశాఖ జైలులో మొత్తం 1,800 ఖైదీలు ఉంటే వారిలో 1,008 మంది గంజాయి కేసులకు సంబంధించినవారేనన్నారు. వారిలో చాలామందికి చట్టాలపై అవగాహన లేదన్నారు. గంజాయి జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. గంజాయి వ్యాపారుల ఆచూకీ తెలిస్తే 1972కు సమాచారం అందించాలని కోరారు. అల్లూరి జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, ప్రస్తుతం ఒడిశా నుంచి రాష్ట్రానికి దిగుమతి అవుతోందని చెప్పారు. సుమారు 81 చెక్‌పోస్టులు పెట్టి దాన్ని కూడా ఆపడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఒడిశా నుంచి గంజాయి చాక్లెట్లు వస్తున్నట్టు గమనించామన్నారు. అల్లూరి జిల్లాలో 35 వేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు రైతులకు ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా సహకారం అందిస్తుందని చెప్పారు. గంజాయి కేసుల్లో రెండు, మూడు సార్లు జైలుకెళ్లి వచ్చిన వారు కూడా బయట ఉన్నారని, ఇలాంటి 4,700 మందిని గుర్తించి సస్పెక్ట్‌ షీట్లు తెరుస్తున్నామని చెప్పారు. డాక్టర్ల సిఫారసు చేయకుండానే మత్తు కలిగించే మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు పెడుతున్నామన్నారు. గంజాయి స్మగ్లర్ల ఆస్తులను కూడా జప్తు చేయబోతున్నామని, ఇలాంటి కేసులు 55 వరకు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 40వేల విద్యాసంస్థల్లో ఈగల్‌ క్లబ్బులు ఏర్పాటు చేసి.. గంజాయి, పొగాకు ఉత్పత్తులు తీసుకోవద్దని అవగాహన కల్పిస్తున్నామన్నారు.





Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.